జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | మంగళవారం 06 అక్టోబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 210 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , భాద్రపద మాసము , తిథి: షష్టి - 10:17:05 వరకు నక్షత్రంమృగశిర - 26:55:46 వరకు కరణంవణిజ - 10:17:05 వరకు, విష్టి - 21:08:34 వరకు పక్షంకృష్ణ యోగంవ్యతీపాత - 18:17:27 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి

హైదారాబాద్, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి): తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ పి. సామ్ కోషి నియమితులయ్యారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో.. ఆయన స్థానంలో జస్టిస్ సామ్ కోషి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు

మిగతా 2లో..

## కేబీఆర్ పార్క్ చుట్టూ శాశ్వతంగా వన్‌వే

### జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ప్రకటన

హైదారాబాద్, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి): హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న వన్-వే ట్రాఫిక్ విధానాన్ని శాశ్వతం చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సోమవారం ప్రకటించారు. దీనితో పాటు, ఈ ప్రాంతంలో గతంలో ప్రతిపాదించిన హెచ్-సిటీ ఇన్‌ఫ్రా పనుల్లో కొన్నింటిని రద్దు చేస్తున్నట్లు

మిగతా 2లో..



# అనుమతి ఎవరిచ్చారు?

## ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదు

- మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటాం
- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ
- ఫారమ్-6 మార్పులపై సుప్రీం వ్యాఖ్యలు
- సీఈసీ జ్ఞానేశ్ నిర్ణయాలపై పిటిషన్లు..
- కేంద్రం, ఈసీకి సుప్రీం నోటీసులు జారీ
- వారంలో సమాధానం ఇవ్వాలని ఆదేశం
- 'సర్' కోసం అదనపు డిక్లరేషన్ చేర్చాం
- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టం




న్యూఢిల్లీ, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి): కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు. ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని సీజేఐ చెప్పారు. "సవరించిన ఫారమ్-6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే ఫారమ్-6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది.

మిగతా 2లో..

## బోగస్ ఫారం-7లపై చర్యలు తీసుకోండి

### దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు

### అధికారులకు సీఈవో సుదర్శన్‌రెడ్డి ఆదేశం

హైదారాబాద్, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి): ఓట్ల తొలగింపు కోసం బోగస్ ఫారం-7 సమర్పిస్తే చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో ముందే ప్రింట్ చేసిన ఫారం-7లు భారీగా సమర్పిస్తున్నట్లు సమాచారం అందుతోందని సీఈవో తెలిపారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇస్తే చట్ట ప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనర్హులకు ఓటు ఉన్నట్లయితే అభ్యంతరం వ్యక్తం చేస్తూ తొలగించాలని కోరుతూ ఫారం 7 సమర్పించాల్సి ఉంటుంది. అయితే హైదరాబాద్‌లోని ముషీరాబాద్, గోషామహల్, చంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో కొందరి ఓటు తొలగించేందుకు భారీగా బోగస్ ఫారం-7లు సమర్పిస్తున్నారని ఇటీవల సీఈవోకు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. దీంతో అప్రమత్తమైన సీఈవో

మిగతా 2లో..

## భారత్ కీలక శక్తిగా
# ఎదుగుతోంది

- ఏఐ, వాణిజ్యంలో కలిసి పనిచేస్తాం
- స్విస్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్
- 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు
- ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి): అంతర్జాతీయ దౌత్య రంగంలో భారత్ అత్యంత కీలకమైన శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్ ప్రశంసించారు. గ్లోబల్ గవర్నెన్స్, సాంకేతిక రంగాలలో కూడా న్యూదిల్లీ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ

మిగతా 12లో..



## ఏసీబీ వలలో మెహదీపట్నం జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్

### 4 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిన అధికారిణి సునీత

### నిర్మాణ అనుమతుల కోసం రూ.4 లక్షలు లంచం డిమాండ్



హైదారాబాద్, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి): మెహదీపట్నం జీహెచ్ఎంసీ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీత రూ.4 లక్షలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయింది. నిర్మాణ అనుమతులు, క్లియరెన్స్‌కు సంబంధించిన

మిగతా 2లో..



## వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్..

### ఆప్టోజెనెటిక్స్‌పై పరిశోధనలకు 2026 వైద్యశాస్త్ర నోబెల్

### కార్ల్ డిసెరోథ్, పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌కు పురస్కారం

న్యూఢిల్లీ, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి): ఈ ఏడాదికి నోబెల్ పురస్కారాల విజేతల ప్రకటన వైద్య శాస్త్రంతో ప్రారంభమైంది. మెదడు కార్యకలాపాలపై (ఆప్టోజెనెటిక్స్) పరిశోధకులకు వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి వరించింది. మెదడులోని నాడుల కార్యకలాపాలు ప్రారంభం లేదా నిలిపివేత సమయంలో సంభవించే అంతర్గత ప్రక్రియలపై

మిగతా 2లో..

## ఒక్కో ఉద్యోగికీ రూ.1,10,250 బోనస్

### సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి బొనాంజా

### బోనస్ పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక ప్రకటన



హైదారాబాద్, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి): దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సింగరేణి కార్మికులకు కేంద్రం బోనస్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఒక్కో ఉద్యోగికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, సింగరేణి భవిష్యత్తు కోసం యాజమాన్యం, కార్మికులు మరింత సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు దృష్ట్యా సింగరేణి కూడా బొగ్గు ఉత్పత్తిని మరింతగా

మిగతా 2లో..



## 9లోగా రూ.లక్ష కట్టకపోతే ఇందిరమ్మ ఇల్లు రద్దు!

- హైదరాబాదు లబ్ధిదారులకు అల్టిమేటం..
- ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తుది హెచ్చరిక
- అక్టోబరు 9 లోగా డబ్బులు చెల్లించాలని ఆదేశం

హైదారాబాద్, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి): హైదరాబాద్ నగరంలో క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల టవర్ల లబ్ధిదారులకు తెలంగాణ హౌసింగ్ బోర్డు కీలక ప్రకటన చేసింది. లబ్ధిదారులు తమ వాటాగా చెల్లించాల్సిన లక్ష రూపాయల మొత్తానికి అక్టోబరు 9వ తేదీని తుది గడువుగా నిర్ణయించింది. ఈ గడువులోగా డబ్బు చెల్లించని వారి ప్రొవిజినల్ అలాట్‌మెంట్ లెటర్లను ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే రద్దు చేస్తామని స్పష్టం చేసింది. తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి.గౌతమ్ ఆదివారం ఈ వివరాలు వెల్లడించారు. క్యూర్ పరిధిలోని

మిగతా 2లో..

## వణికిస్తున్న అనుమానాస్పద వైరస్

### రష్యా ల్యాబ్‌లో గుర్తుతెలియని ఇన్ఫెక్షన్

### ఒకరు మృతి.. వందలమంది క్వారంటైన్

### అప్రమత్తమైన అమెరికా, ప్రపంచ దేశాలు!



న్యూఢిల్లీ, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి): ష్యాలో కొత్త ఇన్‌ఫెక్షన్ భయాలు చెలరేగాయి. సైబీరియాలోని ఓ పరిశోధన కేంద్రంలో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్ తెలియని ఇన్ఫెక్షన్ తో మరణించడంతో, అధికారులు ముందు జాగ్రత్త చర్యగా వందల మందిని క్వారంటైన్‌లో ఉంచారు. అమెరికా విదేశాంగ శాఖ ఈ వార్తపై స్పందించింది. ఈ ఇన్‌ఫెక్షన్/ వ్యాధి గురించి కచ్చితమైన సమాచారాన్ని వెంటనే విడుదల చేయాలని మాస్కోను కోరింది. అమెరికా విదేశాంగ శాఖకు చెందిన ఓ అధికారి

మిగతా 12లో..

## యెమెన్ అంతర్యుద్ధం ఉద్ధృతం

- హౌతీల గుప్పిట్లోకి కీలక ప్రాంతాలు..
- తుర్బా నగరం హౌతీలు స్వాధీనం
- మరో సిటీని దక్కించేందుకు యత్నం
- భారీ సైనిక చర్యను ప్రకటించిన యెమెన్



న్యూఢిల్లీ, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి): యెమెన్‌లో అంతర్యుద్ధం రోజు రోజుకూ ఉద్ధృతమవుతోంది. సౌదీ అరేబియా, ఇరాన్ మద్దతున్న హౌతీ రెబల్స్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జులైలో ముగిసిన తర్వాత పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. హౌతీలపై భారీ సైనిక చర్యను స్థానిక ప్రభుత్వం ప్రకటించగా... దీనికి ముందు కీలక పరిణామం చోటుచేసుకుంది. హూతీలు మరింత భూభాగాన్ని స్వాధీనం చేసుకున్నారు. కీలకమైన తుర్బా పట్టణాన్ని తమ నియంత్రణలోకి తెచ్చుకున్నట్టు ప్రకటించారు. అటు, యెమెన్ ప్రభుత్వానికి మద్దతుగా సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు.. హూతీల స్థావరాలపై విరుచుకుపడుతున్నాయి. మరోవైపు, యెమెన్‌లోని మూడో అతిపెద్ద నగరమైన తైజ్‌లోకి చొచ్చుకెళ్లేందుకు హౌతీలు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే

మిగతా 12లో..

## మహిళలపై నేరాలను అరికట్టండి

### శిక్షలతో దుండగులకు వణుకు పుట్టాలి

### సామాజిక వ్యతిరేక శక్తుల్లో భయం సృష్టించాలి

### ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు కీలక సూచన

### ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో అత్యాచార ఘటనలపై విచారణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి): మహిళలపై నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తుల మనసుల్లో భయాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నేరం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, నేరాలు జరగకుండా నివారించడమే అత్యంత ముఖ్యమని ఢిల్లీ పోలీసులకు హితవు పలికింది. ఇటీవల ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వరుసగా చోటుచేసుకున్న అత్యాచార

మిగతా 2లో..

# సంపాదకీయం

## ప్రపంచాన్ని వదలని మహమ్మారులు!?

ప్రపంచాన్ని మహమ్మారులు వదలట్లేదు. మొన్న కరోనా, నిన్న ఎబోలా.. నేడు మరోటి. ఇలా ప్రపంచాన్ని ఏదో ఒక వ్యాధితో అతలాకుతలం చేస్తున్నాయి. కరోనాతో ప్రపంచాని అతలాకుతలం చేసింది ప్రతీ ఒక్కరికి తెలిసిందే. ఇప్పటికీ ఆ పీడకలనుంచి ఇకా కోలుకోలేదు. ఆ తరువాత ఎబోలా వ్యాధి కొన్ని దేశాలపై ముప్పేట దాడి చేసి అక్కడి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఎనలేని దెబ్బకొట్టింది. ఇలాంటి విపత్తునుండి ప్రపంచం బయటపడక ముందే రష్యాలో మరో వింత వ్యాధి అక్కడి ప్రజలను భయపెడుతోంది. తాజాగా సైబీరియాలోని ఓ పరిశోధన కేంద్రంలో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్ తెలియని ఇన్ఫెక్షన్‌తో మరణించడంతో, అధికారులు ముందు జాగ్రత్త చర్యగా వందల మందిని క్వారంటైన్‌లో ఉంచారు. అమెరికా విదేశాంగ శాఖ ఈ వార్తపై స్పందించింది. ఈ ఇన్‌ఫెక్షన్/ వ్యాధి గురించి కచ్చితమైన సమాచారాన్ని వెంటనే విడుదల చేయాలని మాస్కోను కోరింది. అమెరికా విదేశాంగ శాఖకు చెందిన ఓ అధికారి మీడియాతో మాట్లాడుతూ, ఆగ్నేయ సైబీరియాలో వెలుగుచూసిన ఈ ఇన్‌ఫెక్షన్ వ్యాధి గురించి తమకు సమాచారం ఉందని అన్నారు. ఈ పరిస్థితిని అమెరికా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రాల(సీడీసీ)తో పాటు ఇతర సంస్థలు నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ మాజీ అధికారి డాన్ హాఫ్ మెన్ మాట్లాడుతూ, ఈ ఘటనకు సంబంధించిన సమాచారాన్ని అమెరికా గూఢచార యంత్రాంగం సేకరిస్తున్నట్లు తెలిపారు. రష్యాలో అత్యంత ప్రమాదకర ప్లేగ్.. అవుట్ బ్రేక్ అయింది. భయానకంగా విస్తరిస్తోంది. ఓ మరణం సైతం సంభవించింది. వందలాదిమంది క్వారంటైన్ లోకి వెళ్లారు కూడా. ఈ సంఘటనతో ఉలిక్కిపడిందా దేశం. తక్షణ నివారణ చర్యలను తీసుకుంటోంది. అటు అమెరికా సైతం దీనిపై ఆరా తీస్తోంది. ప్లేగ్ అవుట్ వ్యాప్తి చెందిన ఉదంతంపై రష్యాతో సంప్రదింపులు జరుతున్నామని, సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటోన్నామని వైట్ హౌస్ వెల్లడించింది. సైబీరియాలో గల ఓ రహస్య ప్లేగ్ రీసెర్చ్ ల్యాబ్‌లో అనుకోకుండా చోటుచేసుకున్న ప్రమాదం వల్ల ప్లేగ్ అవుట్ బ్రేక్ అయినట్లు రష్యా చెబుతోంది. ఇర్కుట్స్క్ యాంటీ ప్లేగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తోన్న సైంటిస్ట్ దారియా షిపిలోవా దీని బారిన పడ్డారు. న్యుమోనియాతో హఠాత్తుగా మరణించారు. ఈ ల్యాబ్ నుంచి అత్యంత ప్రమాదకరమైన లైవ్ బ్యాక్టీరియా బయటకు వచ్చిందనే అనుమానాలతో వందలాది మందిని స్థానిక అధికారులు క్వారంటైన్‌లో ఉంచారు. ప్లేగ్ వ్యాప్తి చెందడానికి కారణం అయ్యే లైవ్ బ్యాక్టీరియా ఉన్న ల్యాబ్ టెస్ట్ ట్యూబ్‌ను ఆ సైంటిస్ట్ ప్రమాదవశాత్తూ పగలగొట్టినట్లు రీసెర్చ్ సెంటర్ ప్రాథమికంగా అంచనా వేసింది. మరణించడానికి కొద్ది గంటల ముందు ఈ విషయాన్ని దారియా స్వయంగా ఆసుపత్రి సిబ్బందికి వివరించినట్లు రష్యా మీడియా తెలిపింది. అప్పటివరకు ఆరోగ్యంగా ఉన్న ఆమె.. టెస్ట్ ట్యూబ్ పగిలిన తర్వాత తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. రెండు రోజుల్లోనే మరణించారు. మంగోలియా సరిహద్దుకు ఆనుకుని ఉండే బురియాటియాలో ఉంటుంది రీసెర్చ్ సెంటర్. దీంతో అటు మంగోలియా కూడా నివారణ చర్యలను తీసుకుంటోంది. ఆమె మరణం తరువాత రష్యా ప్రభుత్వం వేగంగా స్పందించింది. కాంటాక్ట్ ట్రేసింగ్‌ను ప్రారంభించింది. దారియాకు ట్రీట్మెంట్ అందించిన ఆసుపత్రిలో దాదాపు 200 మందిని క్వారంటైన్ చేసింది. ఈ రీజియన్ లోని ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసింది. ఈ మరణానికి గల అసలు కారణం న్యుమోనిక్ ప్లేగ్ అని ప్రాథమికంగా నిర్ధారించిందక్కడి ప్రభుత్వం. ఎర్సినియా పెస్టిస్ అనే ప్రమాదకరమైన బ్యాక్టీరియా వల్ల ప్లేగ్ వ్యాధి సంభవించినట్లు తేల్చింది. మధ్య యుగంలో పలువురి ప్రాణాలను బలిగొన్న బ్లాక్ డెత్ మహమ్మారికి ఈ బ్యాక్టీరియానే కారణం. సాధారణంగా ప్లేగ్‌లో బుబోనిక్, న్యుమోనిక్, సెప్టిసిమిక్ అనే మూడు రూపాలు ఉంటాయి. వీటిలో శ్వాసకోశ వ్యవస్థపై నేరుగా దాడి చేసే న్యుమోనిక్ ప్లేగ్ అత్యంత వేగంగా వ్యాపిస్తుంది. జ్వరం, శ్వాస ఆడకపోవడం, దగ్గు వంటి ప్రాథమిక లక్షణాలు ఇందులో కనిపిస్తాయి. అదే ఇప్పుడు రష్యాలో అవుట్ బ్రేక్ అయినట్లు వార్తలొస్తోన్నాయి. ఈ నేపథ్యంలో మాస్కో హెల్త్ నిపుణులు రంగంలోకి దిగారు. శానిటేషన్ వింగ్ చీఫ్ డాక్టర్ అన్నా పోపోవా స్వయంగా ఉన్నతాధికారులతో కలిసి సైబీరియా చేరుకుని ఈ ల్యాబ్ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నారు. ప్రస్తుతం పరిస్థితి నియంత్రణలోనే ఉందని, ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని కోరారు. సైబీరియాలోని యాంటీ-ప్లేగ్ పరిశోధన కేంద్రంలో ఇటీవల ఓ ప్రమాదం జరిగినట్లు సీఎన్ఎస్ వార్త సంస్థ నివేదించింది. ఆ తర్వాత అక్కడ పనిచేసిన ఒక ల్యాబరేటరీ టెక్నీషియన్ తెలియని ఇన్‌ఫెక్షన్‌తో మరణించారు. ఇర్కుట్స్క్ సమీపంలోని షెలెఖోవ్‌లో ఉన్న యాంటీ-ప్లేగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ ఘటన జరిగిందని రష్యా ప్రభుత్వ వార్త సంస్థ టాస్ పేర్కొంది. మరోవైపు అంటువ్యాధుల పర్యవేక్షణ సంస్థ రోస్పోట్రెబ్నాడ్జోర్ దీనిపై కీలక విషయాలు వెల్లడించింది. సదరు ఉద్యోగి మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పేర్కొంది. అతనికి న్యుమోనియా లాంటి లక్షణాలు మాత్రం కనిపించాయని, అయితే ఆ వ్యాధి లేదా ఇన్‌ఫెక్షన్ ఏమిటో ఇంకా నిర్ధరణ చేయాల్సి ఉందని పేర్కొంది. ఇర్కుట్స్క్ , షెలెఖోవ్ నగరాల్లో పారిశుద్ధ్యం లేక అంటువ్యాధులు బాగా ప్రబలుతున్నాయని రోస్పోట్రెబ్నాడ్జోర్ పేర్కొంది. ఏది ఏమైనపప్పటికీ, ల్యాబ్ ఉద్యోగి మృతి కేసులో తాము ప్రత్యేక ప్రోటోకాల్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపింది. అయితే న్యుమోనిక్ ప్లేగ్ సంభవించి ఉండవచ్చనే ఆందోళనలు చెలరేగాయి. మరణించిన ల్యాబ్ టెక్నీషియన్ ఒక 28 ఏళ్ల మహిళ అని, ఆమె బహుశా ప్లేగ్ వ్యాధితో మరణించి ఉంటుందని బురియాటియా రిపబ్లిక్ నాయకుడు అలెక్సీ సిడెనోవ్ పేర్కొన్నారు. ప్లేగ్ వ్యాధి వ్యాపిస్తోందని వార్తల నేపథ్యంలో, ప్రధాన వైద్యాధికారులతో స్థానిక అంటువ్యాధుల నివారణ మండలి అత్యవసర సమావేశం నిర్వహించింది. ఆ తర్వాత ఇర్కుట్స్క్ గవర్నర్ ఇగోర్ కోబ్జెవ్ మాట్లాడుతూ, ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రశాంతంగా ఉండాలని కోరారు. షెలెఖోవ్ పరిసర ప్రాంతాల్లో అదనపు భద్రతా చర్యలు ఏర్పాటు చేశామని చెప్పారు. మరోవైపు ఇన్‌ఫెక్షన్ ప్రబలిన పరిశోధన కేంద్రానికి సమీపంలో ఉన్న అల్యూమినియం కర్మాగారం తమ సిబ్బందిని ముఖానికి మాస్కులు ధరించాలని ఆదేశించింది. సదరు కర్మాగారం అధిపతి ఆర్టెమ్ ఫోమినిఖ్ మాట్లాడుతూ, ఈ ఇన్‌ఫెక్షన్ వ్యాప్తిపై దేశంలో ఊహాగానాలు, రూమర్లు, పరస్పర విరుద్ధంగా ఉన్న నివేదికలు ప్రచారంలో ఉన్నాయని అన్నారు. ప్రజలు వాటిని నమ్మవద్దని, ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాదు మరణించిన ల్యాబ్ టెక్నీషియన్‌తో సన్నిహితంగా ఉన్న వారందరినీ వైద్యుల పర్యవేక్షణలో ఉంచారని, ప్రస్తుతం వారిలో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించలేదని ఆయన అన్నారు. మరోవైపు అధికారులు ముందు జాగ్రత్త చర్యగా సమీపంలోని ప్రసూతి కేంద్రంలో ఐసోలేషన్ ప్రోటోకాల్ అమలు చేస్తున్నారు. మరోవైపు రష్యన్ అధికారులు అంతా బాగానే ఉందని చెబుతున్నప్పటికీ, అధికారులు చేపడుతున్న చర్యలు ప్రజల్లో ఆందోళన పెంచుతోంది. కాగా, గతంలో రోస్పోట్రెబ్నాడ్జోర్‌కు నాయకత్వం వహించిన ఒనిషెంకో మాట్లాడుతూ, ఇది ప్లేగ్ వ్యాధి కాకపపోవచ్చు అని అభిప్రాయపడ్డారు. ఇంకా ఇది ఏమిటో నిర్ధరించబడలేదని, కానీ ఆ వ్యాధి వ్యాపించే అవకాశం లేదని అన్నారు. యెర్సినియా పెస్టిస్ అనే బాక్టీరియా వల్ల ప్లేగ్ వ్యాధి సోకుతుంది. ఇందులో ఉండే మూడు రకాల్లో న్యుమోనిక్ ప్లేగ్ ఒకటి. ఈగలు, జంతువులు, సంపర్కం ద్వారా వ్యాపించే ప్లేగ్ కంటే, ఇది చాలా భిన్నంగా ఉంటుంది. న్యుమోనిక్ ప్లేగు శ్వాసకోశ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుంటుంది. అంతేకాదు గాలి ద్వారా మానవుల్లో ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ వారి పత్రాల ప్రకారం, న్యుమోనిక్ ప్లేగు సోకిన వారిలో అధిక జ్వరం, తలలో అసౌకర్యం, అలసట వంటి లక్షణాలు ఉంటాయి. ఆ తర్వాత వేగంగా న్యుమోనియా, శ్వాసతీసుకోవడంతో ఇబ్బందులు, ఛాతీలో అసౌకర్యం, దగ్గు, అప్పుడప్పుడు రక్త స్రావం లేదా ద్రవరూపంలో స్రావాలు బయటపడడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఏది ఏమైనా మరో పెనువిపత్తుగా మారకముందే హెల్త్ నిపుణులు అప్రమత్తమై వ్యాధి వ్యాప్తి చెందకుండా అరికట్టాలని విశ్లేషకులు సూచిస్తున్నారు.

## ఒక్కో ఉద్యోగికీ రూ.1,10,250 బోనస్

మొదటిపేజీ తరువాయి..

పెంచేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. రానున్న దసరా, దీపావళి, నవరాత్రుల పండుగల కానుకగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయమైనది. దేశానికి వెలుగులు పంచేందుకు పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ వెలకట్టలేనిది. సింగరేణి బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదు. సింగరేణి పరిశ్రమ మన తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారం. లక్షలాది కుటుంబాలకు జీవనాధారం. దేశాభివృద్ధిలో, తెలంగాణ అభివృద్ధిలో కీలక భాగస్వామి అని అన్నారు. దేశ ప్రగతిలో, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి మరింత కీలకపాత్ర పోషించాలని కిషన్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా సింగరేణికి ఇవ్వాల్సిన రూ.60 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు.

# అనుమతి ఎవరిచ్చారు?

మొదటిపేజీ తరువాయి..

ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది. ఫారమ్-6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని లేవనెత్తారు.

ఫారమ్-6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫారం 6లో మార్పులు వంటి పలు కీలక నిర్ణయాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మిగతా ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్నారని పిటిషనర్లు ఆరోపించారు. ఎన్నికల సంఘం వంటి బహుళ సభ్యుల కమిషన్‌లో నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన జరగాలని, కానీ ఇక్కడ అలా జరగలేదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈసీ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. "రాజ్యాంగబద్ధమైన సంస్థలు చట్టానికి లోబడి పనిచేయాలి. ఒకవేళ తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే, వాటిని రద్దు చేస్తాం" అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే, సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ విధులకు ఆటంకం కలిగించేలా లేదా ఆయనను సస్పెండ్ చేసేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి కోర్టు నిరాకరించింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను సీఈసీ ఒక్కరే కాకుండా, ముగ్గురు సభ్యుల కమిషన్ సంయుక్తంగా వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు తమ పిటిషన్‌లో కోరారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు నోటీసులతో ఈ వ్యవహారంపై కేంద్రం, ఈసీ ఎలాంటి వివరణ ఇస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

గత 10 నెలల్లో 'సర్'కు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఇటీవల ఓ కథనం వెలువడిన విషయం తెలిసిందే.

## బోగస్ ఫారం-7లపై చర్యలు తీసుకోండి

మొదటిపేజీ తరువాయి..

కార్యాలయం రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల ఎన్నికల అధికారులకు ఆదేశాలు జరిపింది. ఫారం-7లపై క్షుణ్ణంగా విచారణ జరిపిన తర్వాతే ఓటు తొలగించాలని స్పష్టం చేసింది. ఫారం-7తో పాటు కొత్త ఓటు కోసం ఫారం-6 ఇతర అప్లికేషన్‌లలో కూడా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమచారం, డిక్లరేషన్ ఇస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందేనని సీఈవో స్పష్టం చేశారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు ఎల్లుండితో ముగియనుంది. ర్‌లో భాగంగా తెలంగాణలో అనేక ప్రాంతాల్లో ఎవరి పేర్లు తొలగించాలో పేర్కొంటూ ప్రింటెడ్ ఫారం-7 పత్రాలు లభించాయి. హైదరాబాద్ పరిధిలోని ముషీరాబాద్ నియోజకవర్గంలోని పోలింగ్ బూత్ పరిధిలో పత్రాలు లభించాయని సుదర్శన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల విభాగం నేతలు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ బహదూర్‌పుర నియోజకవర్గంలో ప్రింటెడ్ పారం-7 పత్రాలు శుక్రవారం దర్శనమిచ్చాయి. తాజాగా శనివారం గోషామహల్ నియోజకవర్గంలోనూ లభించాయి. దీంతో అసలు ఈ పత్రాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి. ఎవరు వీటిని ప్రింట్ చేస్తున్నారు. బీఎల్‌వోలకు ఎవరు ఇస్తున్నారు. ఎవరైనా ప్రణాళిక ప్రకారం చేస్తున్నారా అనే అనుమానం రాజకీయ పార్టీల్లో నెలకొంది. ఫారం-6ను వినియోగించి కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అదే ఫారం-8 ను వినియోగించి అడ్రస్‌లో మార్పులు, పేర్లలో తప్పులను సరిచేసుకొనే అవకాశం ఉంది. అయితే ఫలానా వ్యక్తి ఓటును తొలగించాలని దరఖాస్తు చేసుకోవాంటే ఫారం-7ను వినియోగించుకోవాల్సి ఉంటుంది. సంబంధిత ఓటరుపై అనుమానం కలిగినా, అది నకిలీ ఓటు లేదా డూప్లికేట్ ఓటు అని సందేహం కలిగినా, సంబంధిత ఓటరు మృతి చెందినా, వ్యక్తులు సంబంధిత చిరునామాలో లేకపోయినా ఇలా అనేక కారణాలతో ఫారం-7 ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఇక్కడి లభించిన వాటిలో తొలగించాల్సిన ఓటరు వివరాలను ఫారం-7లో ప్రింట్ చేసి వాటిని కట్టలు కట్టలుగా తెచ్చి బీఎల్‌వోలకు ఇస్తుండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవగాహన ఉన్న బీఎల్‌వోలు ఎవరూ ఇలాంటి ప్రింటెడ్ పారాలను తీసుకోరు. ఈ విషయం తెలియని వారు స్వీకరించి ముందుకువెళ్లే అవకాశం ఉంది. అలా జరగడంతోనే ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఈ తరహా ఘటనలు బయటకు వస్తుండటంతో ఎన్నికల అధికారులు దృష్టి సారించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో జరిగిన ఘటనపై విచారణకు ఆదేశించారులో తెలంగాణలో ఇప్పటి వరకు ఫలానా వారి ఓట్లను తొలగించాలంటూ ఎన్నికల అధికారులకు దాదాపుగా 29 వేల దరఖాస్తులు అందాయి. దీంతో తప్పుడు ఫారాలు సమర్పిస్తే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఈవో ఆదేశించారు. ఓటర్ల జాబితా నుంచి నిజమైన ఓటర్ల పేర్ల తొలగింపునకు ప్రీ-ఫిల్డ్ ఫారం-7 దరఖాస్తుల కుట్రపై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్‌కు టీపీసీసీ ఫిర్యాదు చేసింది. టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్, సభ్యులు ఫిర్యాదు చేశారు. ముషీరాబాద్, బహదూర్‌పురా, గోషా మహల్ నియోజకవర్గాల్లో ఒకే తరహా ఘటనలు జరిగాయని ఆరోపించారు. ప్రీ-ఫిల్డ్ ఫారం-7లను ఎవరు తయారు చేశారు, ఎక్కడ ప్రింట్ చేశారు, ఎవరు పంపిణీ చేశారు? అనే దానిపై దర్యాప్తు చేయాలని కోరారు. ఓటర్ల వ్యక్తిగత ఎన్నికల సమాచారాన్ని ఎక్కడి నుంచి సేకరించారో తేల్చాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయం పాత్రపైనా కూడా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమైతే రాజకీయ హోదాతో సంబంధం లేకుండా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## మహిళలపై నేరాలను అరికట్టండి

మొదటిపేజీ తరువాయి..

ఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా పోలీసుల పనితీరుపై పలు సూచనలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ పార్థీవాలా మాట్లాడుతూ.. "మహిళలపై దాడులకు పాల్పడాలనుకునే దుండగులకు తాము పట్టుబడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం ఉండాలి. అలాంటి వాతావరణాన్ని మీరు కల్పించాలి" అని పోలీసులను ఆదేశించారు. నేరాలను అరికట్టేందుకు నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా న్యాయస్థానం నొక్కి చెప్పింది. ఢిల్లీలో మహిళల భద్రతకు సంబంధించి పలు నిర్దిష్ట ఆదేశాలను ధర్మాసనం జారీ చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, వెలుతురు సరిగా లేని ప్రదేశాలను గుర్తించి వెంటనే లైటింగ్ సౌకర్యం మెరుగుపరచాలని సూచించింది. అలాగే, నిఘా వ్యవస్థలను పటిష్ఠం చేయాలని తెలిపింది. దుండగులు, పోకిరీలు ఎక్కువగా గుమికూడే అక్రమ తినుబండారాల కేంద్రాలు, మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో అమ్మాయిలను వేధించే వారిపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేసింది. దేశ రాజధాని పరిధిలో మైనర్లపై జరిగిన లైంగిక దాడులతో సహా వరుస అత్యాచార ఘటనల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో కూడా కోర్టు మహిళల భద్రతపై ఆడిట్ నిర్వహించాలని, ఇతర తాత్కాలిక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా విచారణలో తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఢిల్లీ పోలీసులను ధర్మాసనం ఆదేశించింది.

## 9లోగా రూ.లక్ష కట్టకపోతే ఇందిరమ్మ ఇల్లు రద్దు!

మొదటిపేజీ తరువాయి..

16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 5,501 మందికి ప్రొవిజినల్ అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయగా, ఇప్పటివరకు 3,271 మంది (దాదాపు 59.46 శాతం) మాత్రమే తమ చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు కూడా వెంటనే స్పందించి, గడువులోగా ఆన్‌లైన్‌లో చెల్లింపులు పూర్తి చేయాలని ఆయన కోరారు. అక్టోబరు 9 తర్వాత గడువును పొడిగించే ప్రసక్తే లేదని కమిషనర్ గౌతమ్ తేల్చిచెప్పారు. గడువులోగా చెల్లించడంలో విఫలమైన వారి కేటాయింపులను రద్దు చేసి, ఆ ఖాళీలను వెయిటింగ్ లిస్టులో ఉన్న సుమారు 35 వేల మంది అర్హులైన దరఖాస్తుదారులకు కేటాయిస్తామన్నారు. రాబోయే నెలల్లో లాటరీ పద్ధతిలో ఈ కేటాయింపులు ఉంటాయని ఆయన వివరించారు. అయితే, ప్రభుత్వం ఆన్‌లైన్‌లో డబ్బు చెల్లించాలని చెబుతుండటంతో, ఆ పద్ధతి తెలియని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పథకం, కేటాయింపు, చెల్లింపులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం లబ్ధిదారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్ 040-24603572లో సంప్రదించాలని అధికారులు సూచించారు. కేటాయింపుదారులకు వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు వాట్సాప్ ద్వారా కూడా సమాచారం పంపుతున్నట్లు వారు తెలిపారు.

## ఏసీబీ వలలో మెహదీపట్నం జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్

మొదటిపేజీ తరువాయి..



వ్యవహారంలో లంచం డిమాండ్ చేసినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఏసీబీ అధికారులు పక్కా ప్లాన్‌తో వల పన్ని పట్టుకున్నారు. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ తులసీ రామ్ సునీత తన అధికారాన్ని దుర్వినియోగం చేయడమే కాకుండా అనుచిత లబ్ధి పొందేందుకు యత్నించినందుకుగాను ఆమెపై ఏసీబీ అధికారులు చట్టపరమైన కేసులు నమోదు చేశారు. ఈ మేరకు నిందితురాలిని నాంపల్లిలోని అడిషనల్ ప్రత్యేక జడ్జి ముందు హాజరుపర్చినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉన్నందున భద్రతా కారణాల రీత్యా ఫిర్యాదుదారు వివరాలను వెల్లడించడం లేదని స్పష్టం చేశారు. ఇదే రోజు అంతకుముందు రంగారెడ్డి జిల్లా స్వర్ణ కుమారి ఏసీబీ వలకు చిక్కారు. ఓ ప్రైవేట్ హాస్పిటల్ కు అనుకూలంగా వ్యవహరించేందుకు రూ. 2 లక్షల లంచం డిమాండ్ చేశారు. అయితే రూ. 2 లక్షల్లో భాగంగా రూ. 1 లక్ష ఇవ్వాలని స్వర్ణకుమారి కోరినట్లు బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. మొదటగా బాధితుడు రూ. లక్షను హెల్త్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ కు అందజేశాడు. ఆ తర్వాత ఆ నగదును డీఎంహెచ్‌ఓ డ్రైవర్ కృష్ణయ్యకు ఇచ్చినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆ డబ్బులను కారులో పెట్టేందుకు వెళ్తున్న సమయంలో కృష్ణయ్యను పట్టుకున్నారు. ఈ మేరకు ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. ఇక ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే దర్యాప్తులో వెలుగులోకి రానున్నట్లు తెలుస్తోంది.

## వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్..

మొదటిపేజీ తరువాయి..

పరిశోధనలకు అమెరికాకు చెందిన కార్ల్ డీసెరోత్ (54), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (71), జార్జ్ నాజెల్ (73) అనే శాస్త్రవేత్తలకు ఈ ప్రతిష్టాత్మక పురస్కారం వరించింది. 'లైట్-గేటెడ్ అయాన్ ఛానల్స్', 'ఆప్టోజెనెటిక్స్' అంశాలపై సమగ్ర పరిశోధనలు నిర్వహించిన ఈ శాస్త్రవేత్తలు జర్మనీ, అమెరికాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్నారు. 'మెదడులోని రహస్యాలను ఛేదించడానికి ఈ విధానాన్ని ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధనాశాలల్లో వినియోగిస్తున్నారు" అని శాస్త్రవేత్తల కృషిని 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా నోబెల్ కమిటీ కొనియాడింది. నోబెల్ కమిటీ వెల్లడించిన వివరాల ప్రకారం... డీసెరోత్ కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో, హెగెమాన్ బెర్లిన్‌లోని హంబోల్ట్ విశ్వవిద్యాలయంలో, నాజెల్ జర్మనీలోని వుర్జ్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో సేవలందిస్తున్నారు. విజేతలు ముగ్గురితోనూ సోమవారం ఫోన్‌లో మాట్లాడినట్లు వైద్య విభాగం నోబెల్ కమిటీ కార్యదర్శి థామస్ పెర్ల్‌మాన్ తెలిపారు. స్టాక్‌హోమ్‌లోని కరోలిన్స్కా ఇన్‌స్టిట్యూట్‌లో ఈ బహుమతిని ప్రకటించడంతో నోబెల్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. నోబెల్ బహుమతి కింద 12 మిలియన్ స్వీడిష్ క్రోనార్లు (సుమారు 1.2 మిలియన్ డాలర్లు) అందజేయనున్నారు. ఈ మొత్తాన్ని ముగ్గురికి మూడు సమాన భాగాలుగా పంపిణీ చేయనున్నారు. గతేడాది వైద్య శాస్త్రంలో రోగనిరోధక వ్యవస్థ పై పరిశోధనలు చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ అవార్డు దక్కిన సంగతి తెలిసిందే.

## హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి

మొదటిపేజీ తరువాయి..

చేపట్టనున్నారు. జస్టిస్ పి. సామ్ కోషికి సుదీర్ఘ న్యాయ అనుభవం ఉంది. 1967 ఏప్రిల్ 30న జన్మించిన ఆయన.. 1987లో కామర్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ, 1990లో న్యాయశాస్త్రంలో డిగ్రీ పూర్తి చేశారు. 1991 మార్చి 9న న్యాయవాదిగా నమోదు చేసుకుని న్యాయవృత్తిలోకి ప్రవేశించారు. సివిల్, రాజ్యాంగ, సర్వీస్, కార్మిక చట్టాలకు సంబంధించిన కేసుల్లో వాదనలు వినిపించారు. తొలుత మధ్యప్రదేశ్ హైకోర్టు జబల్‌పూర్‌లో 1991 నుంచి 2000 అక్టోబర్ వరకు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. అనంతరం 2000 నవంబర్ నుంచి ఛత్తీస్‌గఢ్ హైకోర్టు బిలాస్‌పూర్‌లో ప్రాక్టీస్ చేస్తూ దాదాపు 13 ఏళ్ల పాటు న్యాయవాదిగా కొనసాగారు. న్యాయవాదిగా ఉన్న సమయంలో ప్రభుత్వానికి కూడా న్యాయసేవలు అందించారు. 2002 నుంచి 2004 వరకు ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. 2005-06లో డిప్యూటీ అడ్వకేట్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. హిదాయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ, రాయ్‌పూర్ అకాడమిక్ కౌన్సిల్‌లో సభ్యుడిగా కూడా పనిచేశారు. న్యాయవాదిగా ఉన్న సమయంలో సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే, కోల్ ఇండియా లిమిటెడ్, సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం తదితర ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్



సంస్థలకు న్యాయపరమైన వ్యవహారాల్లో ప్రాతినిధ్యం వహించారు. సుదీర్ఘ న్యాయవాద వృత్తి అనంతరం 2013 సెప్టెంబర్ 16న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి నియమితులయ్యారు. అనంతరం 2016 మార్చి 8న శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. న్యాయమూర్తుల బదిలీలో భాగంగా తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయిన ఆయన.. 2023 జూలై 27న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి తెలంగాణ హైకోర్టులో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. జస్టిస్ సామ్ కోషికి తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు నిర్వహించడం ఇది మొదటిసారి కాదు. గతంలో 2025 జూలై 18 నుంచి 19 వరకు అప్పటి ప్రధాన న్యాయమూర్తి అందుబాటులో లేని సమయంలో తాత్కాలికంగా చీఫ్ జస్టిస్ విధులను నిర్వహించారు. ఇప్పుడు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన నేపథ్యంలో మరోసారి తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ పి. సామ్ కోషి బాధ్యతలు చేపట్టనున్నారు. దాదాపు మూడు దశాబ్దాల న్యాయవృత్తి అనుభవం, ప్రభుత్వ న్యాయవాదిగా, డిప్యూటీ అడ్వకేట్ జనరల్‌గా పనిచేసిన అనుభవం, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు అదనపు, శాశ్వత న్యాయమూర్తిగా నిర్వహించిన బాధ్యతలు, తెలంగాణ హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్న అనుభవం.. ఇవన్నీ జస్టిస్ సామ్ కోషి న్యాయ ప్రస్థానంలో కీలక మైలురాళ్లుగా నిలిచాయి. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఆయన బాధ్యతలు చేపట్టడంతో తెలంగాణ హైకోర్టు పరిపాలనా వ్యవహారాల్లో ఆయన సుదీర్ఘ న్యాయ అనుభవం కీలకంగా మారనుంది.

## కేబీఆర్ పార్క్ చుట్టూ శాశ్వతంగా వన్‌వే

మొదటిపేజీ తరువాయి..

వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా సుమారు రూ. 400 కోట్ల మేర ప్రజాధనం ఆదా కానుంది. సోమవారం కేబీఆర్ పార్క్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ మార్గాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడారు. వన్-వే విధానం, ఫ్రీ-లెఫ్ట్ టర్న్‌ల ఏర్పాటు వల్ల ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, వాహనాల రాకపోకలు మెరుగుపడ్డాయని ఆయన తెలిపారు. సవరించిన ప్రణాళిక ప్రకారం, నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఆరు వరుసల స్టీల్ బ్రిడ్జి (ఫ్లైఓవర్) నిర్మిస్తామని, దీనిని ఏడాది కాలంలోనే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అలాగే కేబీఆర్ పార్క్ సమీపంలో ఒక అండర్‌పాస్ ను కూడా నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో హెచ్-సిటీ ప్రాజెక్టు కింద రూ. 1,090 కోట్ల అంచనా వ్యయంతో కేబీఆర్ పార్క్ చుట్టూ పలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మాణాన్ని ప్రతిపాదించారు. అయితే, ప్రస్తుతం అమలు చేస్తున్న వన్-వే విధానం విజయవంతం కావడం, కోర్టు కేసుల వంటి పరిణామాల నేపథ్యంలో అధికారులు ఈ ప్రణాళికలను పునఃసమీక్షించారు. ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు అత్యవసరమైన చోట మాత్రమే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మార్పుల ద్వారా నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించడమే కాకుండా, పెద్ద ఎత్తున ప్రజాధనం ఆదా అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

CHANGE OF NAME

1. MUNJAM LAXMAN S/o Munjam Sammaiah R/o H.No. 4-12/3. Ramanujapur Post,Velthurlapalli,Village,Venkatapur Mandal, Mulugu District, Telangana- 506345 have changed the name of my Daughter (aged 19+ years, student)from MUNJAN RAVALI D/o MUNJAM LAXMAN to MUNJAM AKHILA D/o MUNJAM LAXMAN vide affidavit dated 18-09-20 26 sworn before Notary Public at Bholakpur Secunderabad to correct wrong entry in Aadhaar Card. Henceforth,she shall be known as MUNJAM AKHILA for all purposes.

Sd/- MUNJAM LAXMAN

## రోడ్లపైనే ధాన్యం, మొక్కజొన్న ఆరబోత




**మామడ అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి) :** నిర్మల్ జిల్లాలోని ప్రయాణికులు, వాహనదారులకు తప్పని ఇబ్బందులు -- ప్రమాదాలకు దారితీస్తున్న పరిస్థితులు నిర్మల్ జిల్లాలోని రైతులు పంట చేతికొచ్చిన ఆనందంలో రైతులు ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను ఆరబెట్టేందుకు రహదారులను వినియోగిస్తుండటంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లపైనా పంటలను పెద్ద ఎత్తున ఆరబెట్టడం వల్ల రహదారులపై రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది.

ధాన్యం, మొక్కజొన్నను రోడ్లపై విస్తరించి ఆరబెట్టడంతో వాహనాలు వెళ్లేందుకు రహదారి వెడల్పు తగ్గిపోతోంది. ముఖ్యంగా ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయంలో డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు అంచులకు వెళ్లాల్సి వస్తుండటంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోంది. ద్విచక్ర వాహనదారులు ధాన్యంపై వెళ్లే సమయంలో వాహనం అదుపుతప్పే అవకాశం ఉండటంతో పాటు, రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది.

**రాత్రివేళ మరింత ప్రమాదకరం :** పగటి సమయంలో రోడ్లపై ఉన్న ధాన్యం, మొక్కజొన్న కనిపించినప్పటికీ రాత్రివేళల్లో వాహనదారులకు అవి స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాలకు అవకాశం ఉంది.

వేగంగా వచ్చే వాహనాలు ఒక్కసారిగా పంటను గమనించి బ్రేకులు వేయాల్సి రావడం వల్ల వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదం కూడా ఉంది. ద్విచక్ర వాహనదారులు జారిపడి గాయపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రైతులకు ప్రత్యామ్నాయ స్థలాలు కల్పించాలి :** పంటలను ఆరబెట్టుకోవాల్సిన అవసరం రైతులకు ఉన్నప్పటికీ ప్రజల రాకపోకలకు ఉపయోగించే రహదారులను ఆక్రమించడం వల్ల ఇతరులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలు, వ్యవసాయ మార్కెట్ యార్డులు లేదా ఇతర సురక్షిత ప్రదేశాలను పంటలు ఆరబెట్టుకునేందుకు వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు.

**కల్లాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ సహకారం :** రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు కల్లాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోంది. పంటను రోడ్లపై ఆరబెట్టకుండా, సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు ఈ సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని రైతులు నిర్లక్ష్యం చేయకుండా, అర్హత ఉన్న ప్రతి రైతు కల్లాల ఏర్పాటుకు సంబంధించిన పథకాలను వినియోగించుకోవాలని కోరుతున్నారు. రోడ్లపై ధాన్యం, మొక్కజొన్నలను ఆరబెట్టడం వల్ల వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు కలగడంతో పాటు ప్రమాదాలకు అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. రైతులు కల్లాలను వినియోగించి పంటను ఆరబెట్టుకోవాలని సూచిస్తున్నారు.

**అధికారులు దృష్టి సారించాలి :**

రహదారులపై పంటలు ఆరబెట్టకుండా సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, ప్రధాన కూడళ్లు, గ్రామ ప్రవేశ మార్గాలు, రద్దీగా ఉండే రహదారులపై ధాన్యం, మొక్కజొన్న ఆరబెట్టకుండా కట్టడి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతుల పంటకు విలువ ఉన్నట్లే.. ప్రజల ప్రాణాలకు కూడా విలువ ఉందని, పంటలను రహదారులపై కాకుండా సురక్షిత ప్రదేశాల్లో ఆరబెట్టేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానికులు కోరుతున్నారు.

## అంగన్వాడీ టీచర్ల సేవలకు గుర్తింపు




**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజాజ్యోతి) :** నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సుపరిపాలన, అంకితభావాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సేవా సంకల్ప్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా 43, 44 డివిజన్ల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల్లో సేవలందిస్తున్న టీచర్లు పాత రమాదేవి, చిందం పద్మ, చెల్ల సుజాత, సిరిపురం రాజేశ్వరి (ఆయా), వంజరి నాగజ్యోతిలు అందిస్తున్న సేవలను, చేస్తున్న కృషిని గుర్తించి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు జోగుల శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 43వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి ఆడెపు శ్రీలత--రాజబాబు, 44వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి, గర్మిళ్ల జోన్ ప్రధాన కార్యదర్శి బింగి సత్యనారాయణ, బూత్ అధ్యక్షులు పానకంటి రాకేష్, కాసం శ్రీనివాస్, జైన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవల్లో టీచర్లు, సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

## పేకాటపై టాస్క్‌ఫోర్స్, నెన్నెల పోలీసుల దాడి

- ఏడుగురు అరెస్ట్.. రూ.10,110 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం



**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** నెన్నెల మండలం అవడం గ్రామంలో డబ్బులు పందెంగా పెట్టి అక్రమంగా మూడు ముక్కలాట ఆడుతున్న ఏడుగురిని టాస్క్‌ఫోర్స్, నెన్నెల పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి అవడం గ్రామంలో పేకాట నిర్వహిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం అందడంతో నార్తర్న్ టీమ్/టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్ఐలు దీకొండ రమేష్, లచ్చన్న, సిబ్బంది నెన్నెల పోలీసు సహకారంతో దాడి నిర్వహించారు. ఈ దాడిలో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10,110 నగదు, 52 పేకముక్కలు, నాలుగు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టుబడిన ఏడుగురితో పాటు స్వాధీనం చేసుకున్న నగదు, పేకముక్కలు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నెన్నెల పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. అక్రమ పేకాట, జూదం వంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ప్రజల దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు.

# రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై మంత్రుల సమీక్ష

- ప్రజా సమస్యలను గడువులోగా పరిష్కరించాలి - భూ సమస్యల పరిష్కారం.. ఇళ్ల నిర్మాణం వేగవంతంపై సమీక్ష
- రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5, (ప్రజాజ్యోతి) :** నిర్మల్ జిల్లాలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలకు సంబంధించిన వివిధ అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం నిర్మల్ కలెక్టరేట్‌లో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో కొనసాగుతున్న కార్యక్రమాలు, సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రులు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రెవెన్యూ శాఖకు సంబంధించి భూ సమస్యలు, భూ పరిపాలన, రికార్డుల నిర్వహణ, భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారం, రిజిస్ట్రేషన్లు, స్టాంపులు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

గృహ నిర్మాణ శాఖకు సంబంధించి ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను వేగవంతం చేయడం తదితర అంశాలపై మంత్రులు సమీక్షించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్మాణాలు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పనితీరుపై మంత్రులు సమీక్షించారు. జిల్లాల వారీగా చేపడుతున్న కార్యక్రమాలు, పురోగతిని కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని, శాఖల మధ్య సమన్వయంతో పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్లు, స్టాంపులు) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి,

ఐటీడీఏ పీవో మంద మకరందు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పరుగులు.. రూ.23.35 కోట్ల పనులకు శ్రీకారం

- పుష్కరాల పనులు, రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలు, ఆరోగ్య ఉపకేంద్రాలకు శ్రీకారం
- రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5, (ప్రజాజ్యోతి) :**

నిర్మల్ జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రులు సోమవారం శంకుస్థాపనలు చేశారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి దాదాపు రూ.23.35 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించి శంకుస్థాపనలు చేశారు.

వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించిన రహదారుల నిర్మాణ పనులతో పాటు రిజిస్ట్రార్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలకు సంబంధించిన నిర్మాణ పనులకు మంత్రులు శ్రీకారం చుట్టారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు అందించేందుకు చేపడుతున్న ఈ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

జిల్లా పర్యటనకు సోమవారం ఉదయం నిర్మల్ చేరుకున్న రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల ఉన్నతాధికారులు డి.ఎస్. లోకేష్‌కుమార్, రాజీవ్‌గాంధీ హనుమంతు, వి.పి. గౌతమ్‌లకు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అధికారులు ఘన స్వాగతం పలికారు.

మంత్రులు, ఉన్నతాధికారులకు కలెక్టర్ భవేశ్ మిశ్రా పూల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అక్కడి నుంచి మంత్రులు, ఉన్నతాధికారులు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు భవేశ్ మిశ్రా, రాజర్షి షా, హరిత,

నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, ఆర్ ఎస్ చిత్రు, చంద్రయ్య, రాములు, డేవిడ్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జ పటేల్, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఉట్నూర్ ఐటిడిఎపిఓ మంద మకరందు, సబ్ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్), అనుబంధ సంస్థల ఎగ్జిక్యూటివ్ కేడర్ అధికారులకు శుభ వార్త ..

- పే స్కేల్ అప్‌గ్రేడేషన్‌కు సంబంధించిన ఏరియర్స్ చెల్లింపుపై కీలక నిర్ణయం..
- అక్టోబర్ 10లోగా కోల్ అధికారులకు ఏరియర్స్....!
- మూడు విడతల్లో చెల్లింపు.. తొలి విడత 40 శాతం
- నిధుల కొరత ఉన్నా 31లోగా చెల్లించాల్సిందే!




**మంచిర్యాల, 5, అక్టోబర్ (ప్రజాజ్యోతి) :** కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్)తో పాటు దాని అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్ కేడర్ అధికారులకు పే స్కేల్ అప్‌గ్రేడేషన్‌కు సంబంధించిన ఏరియర్స్ చెల్లింపుపై కీలక నిర్ణయం వెలువడింది. పే స్కేల్ అప్‌గ్రేడేషన్ బకాయిలను మూడు విడతల్లో చెల్లించాలని కోల్ ఇండియా పాలసీ సెల్ నిర్ణయించింది. ఈ మేరకు 2026 అక్టోబర్ 4న అన్ని అనుబంధ సంస్థలకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం విధుల్లో ఉన్న అధికారులకు మొదటి విడత బకాయిలను అక్టోబర్ 10లోగా చెల్లించాలని ఆదేశించింది. ఒకవేళ నిధుల కొరత కారణంగా ఆ తేదీలోగా చెల్లింపు సాధ్యం కాకపోతే ఎట్టి పరిస్థితుల్లోనూ అక్టోబర్ 31, 2026లోగా మొదటి విడత చెల్లింపును పూర్తి చేయాలని స్పష్టం చేసింది. పే స్కేల్ అప్‌గ్రేడేషన్ వల్ల ఉద్యోగులకు రావాల్సిన మొత్తం ఏరియర్స్‌ను 40 శాతం, 40 శాతం, 20 శాతం చొప్పున మూడు విడతల్లో చెల్లించనున్నారు. ఇందులో మొదటి విడతగా 40 శాతం మొత్తాన్ని 2026 అక్టోబర్‌లో, రెండో విడతగా మరో 40 శాతం మొత్తాన్ని 2026 డిసెంబర్‌లో, చివరి 20 శాతం మొత్తాన్ని 2027 మార్చిలో చెల్లించేలా షెడ్యూల్ రూపొందించారు. ఈ మేరకు సంబంధిత అధికారులు తమ సంస్థల్లో చెల్లింపు ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు. ఈ పే స్కేల్ అప్‌గ్రేడేషన్‌కు సంబంధించిన ఆర్థిక ప్రయోజనం 2023 ఆగస్టు 23 నుంచి అమల్లోకి వచ్చింది. 2023 ఆగస్టు 23న జరిగిన కోల్ ఇండియా బోర్డు 457వ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ కేడర్ అధికారుల పే స్కేల్ అప్‌గ్రేడేషన్‌కు ఆమోదం లభించింది. ఆ నిర్ణయానికి అనుగుణంగా 2023 ఆగస్టు 23 నుంచి అమలయ్యే ఆర్థిక ప్రయోజనాలను లెక్కించి, అప్పటి నుంచి పేరుకుపోయిన బకాయిలను ఇప్పుడు విడతలవారీగా చెల్లించేందుకు చర్యలు చేపట్టారు. కోల్ ఇండియా ప్రధాన కార్యాలయంలోని ఎగ్జిక్యూటివ్ కేడర్ అధికారులతో పాటు దాని ప్రధాన అనుబంధ సంస్థలైన ఈసీఎల్, బీసీసీఎల్, ఎస్ఈసీఎల్, సీసీఎల్, ఎన్సీఎల్, డబ్ల్యూసీఎల్, ఎంసీఎల్, సీఎంపీడీఐఎల్ సంస్థల్లో పనిచేస్తున్న అధికారులకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. ఆయా సంస్థల్లో ప్రస్తుతం ఆన్-రోల్‌లో ఉన్న ఎగ్జిక్యూటివ్ కేడర్ ఉద్యోగుల ఖాతాల్లో పే స్కేల్ అప్‌గ్రేడేషన్ బకాయిలను జమ చేయనున్నారు.

- నిధుల కొరత ఉన్నా గడువు తప్పదు

అనుబంధ సంస్థల్లో నిధుల లభ్యతను బట్టి చెల్లింపులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని కోల్ ఇండియా స్పష్టం చేసింది. అక్టోబర్ 10లోగా మొదటి విడత 40 శాతం చెల్లింపు చేయడం ప్రాధాన్యతగా పేర్కొనగా, నిధుల కొరత వంటి కారణాలతో ఆ తేదీలోగా చెల్లించలేని సంస్థలు కూడా అక్టోబర్ 31లోగా తప్పనిసరిగా తొలి విడతను చెల్లించాలి అని ఆదేశించింది. దీంతో కోల్ ఇండియా, అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న అధికారులకు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న పే స్కేల్ ఏరియర్స్ చెల్లింపుపై స్పష్టత ఏర్పడింది.

- రిటైర్డ్ అధికారులకు ఆడిట్ తర్వాత

ఇక పదవీ విరమణ చేసిన అధికారుల పే స్కేల్ అప్‌గ్రేడేషన్ ఏరియర్స్ చెల్లింపు విషయంలోనూ కోల్ ఇండియా స్పష్టమైన ప్రకటన చేసింది. రిటైర్డ్ అధికారులకు సంబంధించిన ఏరియర్స్ ఆడిట్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రత్యేకంగా చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రస్తుతం జారీ చేసిన ఆదేశాలు ప్రధానంగా ఆన్-రోల్‌లో ఉన్న ఎగ్జిక్యూటివ్ కేడర్ అధికారులకు సంబంధించినవిగా స్పష్టం చేసింది. మొత్తంగా చూస్తే, 2023 ఆగస్టు 23 నుంచి వర్తించే పే స్కేల్ అప్‌గ్రేడేషన్ ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన బకాయిలలో 80 శాతం మొత్తాన్ని 2026లోనే రెండు విడతల్లో, మిగిలిన 20 శాతాన్ని 2027 మార్చిలో చెల్లించేలా కోల్ ఇండియా కార్యాచరణ రూపొందించింది. దీంతో సీఐఎల్, దాని అనుబంధ సంస్థల్లోని అధికారులకు పే స్కేల్ ఏరియర్స్ చెల్లింపునకు సంబంధించిన ప్రక్రియ అధికారికంగా ముందుకు సాగుతోంది.

# మంచిర్యాలలో ఘనంగా కాకా జయంతి వేడుకలు




**మంచిర్యాల, 5, అక్టోబర్ (ప్రజాజ్యోతి) :** కేంద్ర కార్మిక, జౌళి శాఖ మాజీ మంత్రి, దివంగత గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి వేడుకలను మంచిర్యాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంతెన జగన్మోహన్ రావు పాల్గొని కాకా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో ఆయన నివాసం నుంచి భారీ జన సమీకరణతో డప్పు చప్పుళ్ల మధ్య ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా మంచిర్యాల రైల్వే స్టేషన్ ఎదుట ఉన్న కాకా విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రావు మాట్లాడుతూ, కాకా ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. కార్మికులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కాకా చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కాకా రాజకీయ వారసత్వాన్ని రాష్ట్ర మంత్రి శ గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కొనసాగిస్తూ, ఆయన ఆశయాల సాధన కోసం కృషి చేస్తున్నారని తెలిపారు.

## బాధితుల సమస్యలపై సత్వర చర్యలు చేపట్టాలి

- చట్ట పరిధిలో న్యాయం అందించాలి
- సీపీ అంబర్ కిషోర్ ఝా




**మంచిర్యాల, 5, అక్టోబర్ (ప్రజాజ్యోతి) :** ప్రజలు, బాధితులు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీసులను ఆశ్రయించాలని, ప్రతి ఫిర్యాదును పరిశీలించి చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో సీపీ అంబర్ కిషోర్ ఝా బాధితుల నుంచి సోమవారం ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, బాధితుల సమస్యలను చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సీపీ సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు, బాధితుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లా బిజెపి నాయకులపై ఆరోపణలు



**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజాజ్యోతి) :** బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరబల్లి రఘునాథ్, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేష్‌గౌడ్ తీరుపై ఆ పార్టీ సీనియర్ నాయకులు బొలిశెట్టి తిరుపతి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మడిపల్లి సత్యనారాయణలు సోమవారం ఆరోపణలు చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా పార్టీలో వెరబల్లి రఘునాథ్ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని, ఆయనకు జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ అండగా ఉంటూ పనిచేస్తున్నారని ఆరోపించారు. బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లో పార్టీని బలహీనపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని, మంచిర్యాల నియోజకవర్గంలో బీసీ నాయకులను అణచివేస్తూ, రఘునాథ్‌కు అనుకూలంగా వ్యవహరించే వారికి ప్రాధాన్యం కల్పిస్తున్నారని విమర్శించారు. రఘునాథ్ చుట్టూ ఉన్న కొంతమంది వ్యక్తులపై వివిధ రకాల ఆరోపణలు, కేసులు, వివాదాలు ఉన్నప్పటికీ వారికి పార్టీ పదవులు, బాధ్యతలు కల్పిస్తున్నారని వారు ఆరోపించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే నిజాయితీపరులైన కార్యకర్తలను పక్కనపెట్టి, వ్యక్తిగత విధేయత చూపేవారికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పార్టీకి నష్టం జరుగుతోందన్నారు. ఎన్‌హెచ్--63 రహదారి అలైన్‌మెంట్ మార్పు విషయంలో కూడా రఘునాథ్‌పై వారు తీవ్ర ఆరోపణలు చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పెట్టుబడిదారులు, ఇతర వర్గాల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు గతంలో పత్రికల్లో ప్రచురితమయ్యాయని తెలిపారు. అలైన్‌మెంట్ మార్పుల కారణంగా అమాయక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సంబంధిత వర్గాలు వెల్లడించాల్సి ఉందన్నారు. గత మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయంలో పార్టీ నిధుల వినియోగంలో భారీగా అవకతవకలు జరిగాయని, దీనిపై ఇప్పటికే బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదులు చేసినట్లు వారు తెలిపారు. పార్టీ వ్యవహారాల్లో జరుగుతున్న అంశాలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినందుకే తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మంచిర్యాల నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులను అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని బొలిశెట్టి తిరుపతి ఆరోపించారు. సీనియర్ నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం, పార్టీతో సంబంధం లేదంటూ బహిరంగ ప్రకటనలు చేయడం పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమన్నారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు మడిపల్లి సత్యనారాయణపై ఎలాంటి కారణం లేకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడి సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. జిల్లా అధ్యక్షుడు తరచూ కొందరిపై ప్రకటనలు విడుదల చేయడం వల్లే వాటికి సమాధానంగా తాము కూడా మీడియా ముందుకు రావాల్సి వచ్చిందని తెలిపారు. ఇకపై పార్టీ కార్యకర్తలపై జరుగుతున్న అన్యాయాలను సహించబోమని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్‌ను వెంటనే ఆ బాధ్యతల నుంచి తప్పించాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వ్యవహారశైలిపై కూడా రాష్ట్ర పార్టీ ప్రత్యేక దృష్టి సారించి, పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా జరుగుతున్న చర్యలను నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు. మంచిర్యాలలో బీసీ నాయకులు, కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం కల్పించేలా రాష్ట్ర నాయకత్వం తగిన నిర్ణయాలు తీసుకోవాలని, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఈ వ్యవహారంపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## రేవల్లి మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా రఫీక్

రేవల్లి, అక్టోబరు 5 (ప్రజాజ్యోతి):
రేవల్లి మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఎండీ రఫీక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు



ఎండీ సుల్తాన్ అలీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనారిటీల అభివృద్ధి, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్య, ఉపాధి, మహిళా సాధికారత పథకాలను మైనారిటీలకు చేరేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడు అబ్దుల్ సలీం, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పర్వతాలు, సర్పంచ్ రాజయ్య, గురునాథ్‌రెడ్డి, బండారు శ్రీను, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఆర్జీలను సకాలంలో పరిష్కరించాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల అక్టోబర్ 05(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ప్రజావాణికి వచ్చే ఆర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.సోమవారం





ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్,నర్సింగరావుతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఈ వారం ప్రజావాణికి మొత్తం 44 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.వివిధ శాఖలకు సంబంధించి జిల్లా ప్రజావాణిలో మొత్తం 94 ఆర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని,వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.మండల స్థాయిలో ప్రజావాణికి అందిన ఫిర్యాదులపై సంబంధిత శాఖల అధికారులు తమ సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహించి,వాటిని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్‌కుమార్ రెడ్డి,రాజ్‌కుమార్,వివిధ శాఖల జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## రామ్ భూపాల్ రెడ్డి మృతికి సంతాపం తెలిపిన

### ఆలంపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే విజయుడు





ఆలంపూర్ అక్టోబర్ 5(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)
జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం పెద్ద ఆముదలపాడు గ్రామానికి చెందిన బీఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రామ్ భూపాల్ రెడ్డి హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు.ఇట్టి విషయం తెలుసుకున్న అలంపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే విజయుడు పెద్ద ఆముదలపాడు గ్రామానికి చేరుకుని రామ్ భూపాల్ రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం చెప్పారు.
ఈ కార్యక్రమంలో బీఆర్.ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ లో సత్తా చాటిన

### 10వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ బి.శ్రీను

ఇటిక్యాల,ఎర్రవల్లి (ప్రజాజ్యోతి)<
అక్టోబర్ 05: 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ – 2026లో 10వ బెటాలియన్‌కు చెందిన అసిస్టెంట్ కమాండెంట్ బి.శ్రీను విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. 2026 సెప్టెంబర్ 27 నుండి 30వ తేదీ వరకు నిర్వహించిన ఈ క్రీడా పోటీలలో గెజిటెడ్ ఆఫీసర్లు పాల్గొనగా, బ్యాడ్మింటన్ సింగిల్స్ మెన్ 40



విభాగంలో బి.శ్రీను గారు గోల్డ్ మెడల్ సాధించారు. అదేవిధంగా 50 సింగిల్స్ మెన్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించి తన ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా 10వ బెటాలియన్ కమాండెంట్ బి.ఆదినారాయణ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీ బి.శ్రీను ని అభినందించి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.క్రీడల్లో ప్రతిభ కనబరిచి బెటాలియన్‌కు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని కమాండెంట్ పేర్కొన్నారు.ఈవిజయాలు బెటాలియన్ సిబ్బందిలో క్రీడా స్ఫూర్తిని మరింత పెంపొందించడంతో పాటు,క్రీడా రంగంలో మరిన్ని విజయాలు సాధించేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పార్థసారథి రెడ్డి, వెంకటరమణ రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ఆర్పి సింగ్, శ్రీనివాస్,రాజేశం ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం శాఖల పనితీరు నివేదికలు అందజేయాలి:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

### జల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

గద్వాల అక్టోబర్ 05(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ఎల్‌నినో వంటి పరిస్థితులను అధిగమించేందుకు జల సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో జిల్లా నీరు,పారిశుధ్య మిషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,వీఎంజీ రాంజీ పథకం కింద జల సంరక్షణ పనులను చేపట్టాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్ ద్వారా తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు రైతులకు ప్రయోజనం చేకూరేలా పంట కుంటలు,ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తోందన్నారు.నీటిని పొదుపుగా వినియోగిస్తూ భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా ముందుచూపుతో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లాలోని వసతి గృహాలు,గురుకులాలు,కస్తూర్బా పాఠశాలలు,ఇతర విద్యాసంస్థలతో పాటు ఆసుపత్రులను సంబంధిత శాఖల అధికారులు,ప్రత్యేక అధికారులు తరచూ పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎంఎస్‌కేవైకి సంబంధించి జిల్లాలో చేపట్టిన వివిధ పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని సూచించారు.అలాగే వివిధ శాఖల పనితీరుపై నివేదికలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్,నర్సింగరావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్‌కుమార్ రెడ్డి,రాజ్‌కుమార్, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రెడ్డి,ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.





## ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

### - సత్వరమే పరిష్కరించి ఫిర్యాదుదారులకు సమాచారం ఇవ్వాలి: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి):
ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి, సంబంధిత ఫిర్యాదుదారులకు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సోమవారం వనపర్తి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, వినోద్‌కుమార్‌లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. తమ శాఖ పరిధిలో లేని ఫిర్యాదులను సంబంధిత శాఖలకు లేఖ ద్వారా పంపించాలని సూచించారు. నిబంధనల ప్రకారం పరిష్కరించలేని సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, లేదా పరిష్కారం సాధ్యం కాని కారణాన్ని ఫిర్యాదుదారులకు స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. ఎట్టి



పరిస్థితుల్లోనూ దరఖాస్తులను తమ వద్ద పెండింగ్‌లో ఉంచొద్దని ఆదేశించారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి ప్రజావాణి ద్వారా వచ్చిన పెండింగ్ అర్జీలను సైతం సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజావాణికి 70 దరఖాస్తులు అందాయి.
ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 7 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అలంపూరులో డిగ్రీ కళాశాల ఏర్పాటు, 2009 వరద బాధితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి.

ఆలంపూర్ అక్టోబర్ 5(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)
అలంపూరు పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, అలాగే



2009 నాటి వరద బాధితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని అలంపూర్ డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో "సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు తమ విజ్ఞప్తి పత్రాన్ని సమర్పించారు.
ప్రతినిధులు మాట్లాడుతూ అలంపూరు పరిసర ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, ఇక్కడ డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు, ముఖ్యంగా విద్యార్థినులు తీవ్రంగా నష్టపోతున్నారని అదేవిదంగా 2009 వరదల వల్ల సర్వస్వం కోల్పోయిన బాధితులకు ఇప్పటివరకు ఇళ్ల పట్టాలు అందకపోవడం విచారకరమని, ప్రభుత్వం స్పందించి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని వారుకోరారు.
ఈ కార్యక్రమంలో ఏడిసి కమిటీ అధ్యక్షులు కృష్ణమూర్తి , ఉపాధ్యక్షులు ఇస్మాయిల్ , గౌరవ సలహాదారులు ఆంజనేయులు, కమిటీ ప్రతినిధులు రజిని బాబు, ముస్తఫా, సురేష్, సంజీవ నాయుడు, విజయ్ రెడ్డి, వెంకట స్వామి, పాండు, వెంకటేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త జాబ్ కార్డ లు కొరకు దరఖాస్తు లు చేసుకోండి

ఆలంపూర్ అక్టోబర్ 5(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)
రాజోలు మండల పరిధిలో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారికి వీబీ జీరాంజీ పథకం కింద కొత్తగా జాబ్ కార్డులు మంజూరు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎల్‌నివో పరిస్థితుల క్రమంలో కొత్త జాబ్ కార్డులు మంజూరుకు ప్రభుత్వం నుండి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎల్‌నివో ప్రభావంతో గతంతో పోలిస్తే సాధారణ వర్షపాతం భారీగా పడిపోయింది. దీని వల్ల రైతులు పంట సాగుకు దూరం కావడంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని 18 జిల్లాల్లోని 265 మండలాల్లో కరువు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది.దీంతో అలాంటివారికి ఉపయోగపడేందుకు కొత్త జాబ్ కార్డులు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు చేసుకున్న వారికి 15 రోజుల్లో జాబ్ కార్డు అందించేలా ప్రణాళికలు రచించింది. దీని వల్ల వారికి వెంటనే ఉపాధి లభించనుంది. ప్రస్తుతం మండలంలో 9729 జాబ్ కార్డులు ఉండగా మరి కొంతమందికి జాబ్ కార్డులు ఇవ్వాలని. కరువు పరిస్థితుల క్రమంలో కొత్తగా ఉపాధి పొందాలనుకునే



వారికి జాబ్ కార్డులు జారీ చేయనున్నారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆదాయం లభించనుంది. ఉపాధి అవసరం ఉన్నవారిని గుర్తించి ఈ పథకంలో నమోదు చేయించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలను ప్రభుత్వం ఆదేశించింది.
(జాబ్ కార్డు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి..?)
ఈ పథకంలో చేరాలంటే 18 ఏళ్లు తప్పని సరిగా నిండి ఉండాలి. దరఖాస్తు ఫారంను పూర్తి చేసి ఆధార్ కార్డ్ జిరాక్స్, ఫొటోను జత చేయాలి. ఆ తర్వాత దరఖాస్తును ఫారంను మీ గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమర్పించాల్సి ఉంటుంది. పంచాయతీ కార్యదర్శి పరిశీలన అనంతరం మీ దరఖాస్తును మండల కార్యాలయానికి పంపిస్తారు. ఎంపీడీవో దరఖాస్తును పరిశీలించి మీ అర్హతలను తనిఖీ చేస్తారు. అర్హతలు ఉంటే జాబ్ కార్డు జారీ చేస్తారు. అనంతరం మీకు ఈ జాబ్ కార్డును అందిస్తారు. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోగా జాబ్ కార్డు అందించాలని ప్రభుత్వం నిబంధనలు విధిస్తోంది.ప్రతి గ్రామం నుంచి రోజుకు 100 నుంచి 150 మందికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. దీని వల్ల గ్రామీణులకు ఉపాధి లభిస్తుందని తెలిపింది. అయితే కేంద్రం వీబీ జీరాంజీ పథకంలో అనేక మార్పులు చేసింది. పనిదినాలతో పాటు కనీస వేతనాన్ని కూడా పెంచింది. వారం రోజుల్లో డబ్బులు క్రెడిట్ చేసేలా కొత్త మార్గదర్శకాలు రూపొందింది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కేంద్రం ఈ స్కీమ్ అమలు చేస్తోంది.

## బాడీ బిల్డర్ పోటీలలో అయిజ ప్రభాకర్ టైటిల్ విన్నర్

ఆలంపూర్ అక్టోబర్ 5(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)
అయిజ పట్టణానికి చెందిన ఆర్ .ఎస్ .జిమ్ నిర్వాహకులు సర్టిఫైడ్ ట్రైనర్ ప్రభాకర్ కు ఫిజిక్స్ నందు టైటిల్ విన్నర్ సాధించారు ఆదివారం బెంగుళూరులో వాలార్ క్లాసిక్ 2026టు బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగం ఫిజిక్స్ నందు టైటిల్ విన్నర్ సాధించారు బెంగళూరులోని బి.ఆర్.ఎస్ ఆడిటోరియం నందు జరిగిన ఈ పోటీలలో వివిధ రాష్ట్రాలకు చెందిన బాడీ బిల్డర్లు పాల్గొన్నారు . ఇందులో ప్రభాకర్ టైటిల్ విన్నర్ సాధించారు పథకాలను వాలర్ క్లాసిక్ ఫౌండర్ ఒలంపియా వరల్డ్ మెన్స్ ఫిజిక్స్ టైటిల్ విన్నర్ హర్భజన్ , ప్రొఫెషనల్ ట్రైనర్ యాదవ్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది మొదటిసారిగా అయిజ కు రావడం గర్వకారణం గా ఉంది అంటున్న అయిజ వాసులు






## రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చే కుబోటా ఎం .యు సిరీస్ ట్రాక్టర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న

### ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు

ఆలంపూర్ అక్టోబర్ 5(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)
జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం లో అయిజ పట్టణ కేంద్రంలో నూతన కుబోటా ఎం. యు సిరీస్ ట్రాక్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు రిబ్బన్ కట్ చేసి నూతన ట్రాక్టర్‌ను ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడుమాట్లాడుతూ ఆధునిక వ్యవసాయానికి అనుగుణంగా రూపొందించిన కుబోటా ఎం .యు సిరీస్ ట్రాక్టర్లు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. దుక్కి దున్నడం, విత్తనాలు వేయడం, కలుపు నివారణ, రవాణా తదితర వ్యవసాయ పనులను తక్కువ సమయంలో సమర్థవంతంగా పూర్తి చేసుకునేందుకు ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అలాగే ట్రాక్టర్‌తో వ్యవసాయ పనుల్లో సమయం, కూలీల ఖర్చు ఆదా కావడంతో పాటు, రైతుల పనిభారం తగ్గి ఉత్పాదకత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. వివిధ వ్యవసాయ పనులకు అనుగుణంగా పరికరాలను అనుసంధానం చేసుకునే సౌకర్యం ఉండటంతో రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అయిజ మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్ గ, బిఆర్ .ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏ క్లాస్ పురం నరసింహారెడ్డి , కౌన్సిలర్లు, కోఆప్షన్ నెంబర్లు, మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచ్లు ,ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు,రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.





## కుమ్మరి వృత్తికి ప్రభుత్వ అండ కావాలి

### - బంకమట్టి ఉచితంగా అందించాలి.. ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేయాలి
### - కలెక్టర్‌కు జిల్లా కుమ్మరి సంఘం వినతి

వనపర్తి, అక్టోబరు 5 (ప్రజాజ్యోతి):
సంప్రదాయ కుమ్మరి వృత్తిని పరిరక్షించడంతోపాటు వృత్తిదారులకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరుతూ జిల్లా కుమ్మరి సంఘం నాయకులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు రాములు కుమ్మర ఆధ్వర్యంలో సంఘం నాయకులు, కుల పెద్దలు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. కుమ్మరి వృత్తిదారులకు అవసరమైన బంకమట్టిని ఉచితంగా సేకరించేందుకు అనుమతులు మంజూరు చేయడంతోపాటు గ్రామాలకు తరలించేందుకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. కుండలు, ప్రమిదలు, దీపాలు, కూజాలు, మట్టి గణపతి విగ్రహాలు తదితర ఉత్పత్తుల విక్రయానికి ప్రత్యేక మార్కెట్ సదుపాయం కల్పించాలని



విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంక్షేమ పథకాల కార్యక్రమాలు, జాతరలు, ఉత్సవాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రదర్శనల్లో కుమ్మరులు తయారు చేసిన మట్టి ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్లాస్టిక్, ఇతర ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగం పెరగడంతో మట్టి పాత్రలకు డిమాండ్ తగ్గి కుమ్మరి కుటుంబాల జీవనోపాధిపై ప్రభావం పడుతోందని తెలిపారు. యువత సంప్రదాయ వృత్తిలో కొనసాగేందుకు శిక్షణ, ఆర్థిక సాయం, రుణ సదుపాయం, ఆధునిక పరికరాలు, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కుమ్మరి వృత్తిని పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుమ్మరి సంఘం నాయకులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

## నిష్పక్షపాత విచారణతో బాధితులకు న్యాయం చేయాలి:ఎస్పీ టి.శ్రీనివాసరావు

గద్వాల అక్టోబర్ 05(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం అందించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు భరోసా కల్పిస్తోంది.సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 18 మంది ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఫిర్యాదులను శ్రద్ధగా పరిశీలించిన ఎస్పీ, సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్‌లో మాట్లాడి,ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజల నమ్మకమే పోలీస్ శాఖకు బలమని,సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం,జాప్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు.స్థానిక పోలీస్ స్టేషన్లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎస్పీ తెలిపారు.ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భూ వివాదాలకు సంబంధించి 5, వ్యక్తిగత గొడవలకు 2,భర్త వేధింపులకు 2,కుటుంబ తగాదాలకు 3,చీటింగ్‌కు 3,ఇతర సమస్యలకు సంబంధించి 3 ఫిర్యాదులు అందాయి.ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి,వాటి పురోగతిని జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఎస్పీ తెలిపారు.ప్రతి ఫిర్యాదుదారుడికి న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తుందని హామీ ఇచ్చారు.



## ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

- ప్రజాస్వామ్య పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి
- పాదయాత్రలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి







**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 10, (ప్రజా జ్యోతి) :** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, విద్యార్థులు ఐక్యంగా పోరాడాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్రలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. అంబేద్కర్ జంక్షన్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఎన్నికల వ్యవస్థపై వస్తున్న ఆరోపణలు, అభ్యంతరాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల్లో మార్పులు, ఓట్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజల్లో అనుమానాలు తలెత్తకుండా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్నారు.

గుడి, బడి దోచుకున్న బీజేపీ ఇప్పుడు ఓట్లను కూడా దోచుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రజల ఓటు హక్కుపై దాడి జరిగితే కాంగ్రెస్, ఇండియా కూటమి చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి బలోపేతమై దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఓడితల ప్రణవ్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బక్కి నర్సమ్మ కుటుంబానికి 25 కిలోల బియ్యం అందజేత



**పర్వతగిరి, అక్టోబర్ 05 (ప్రజాజ్యోతి) :** ఇటీవల పర్వతగిరి గ్రామానికి చెందిన బక్కి నర్సమ్మ మృతి చెందడంతో, ఆమె కుటుంబాన్ని స్థానిక సర్పంచ్ చీదురు శంకర్, వార్డు మెంబర్ రజనీకాంత్ పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సమ్మ కుటుంబానికి 25 కిలోల బియ్యం బ్యాగును అందజేసి తమ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో నర్సమ్మ మనవళ్లు బక్కి యాకాంబరం, బక్కి రాజు, ఎర్రబెల్లి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత్‌ను పరామర్శించిన పల్లా సుందర్ రాంరెడ్డి



- ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

**దేవరుప్పుల, అక్టోబర్ 05 (ప్రజాజ్యోతి) :** దేవరుప్పుల మండలం మాధాపురం గ్రామానికి చెందిన వర్రే ప్రశాంత్ (తండ్రి: కొమ్మురయ్య) ఇటీవల ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి సోమవారం బాధితుడి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రశాంత్ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య సేవలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితుడు త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి తన సాధారణ జీవితంలోకి అడుగుపెట్టాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విజయ డైరీ విక్రయ కేంద్రాలు ప్రారంభం





**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి) :** హనుమకొండ జిల్లాలో విజయ డైరీ పాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి ముఖ్య అతిథులుగా హాజరై కేంద్రాలను ప్రారంభించారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విజయ డైరీ విక్రయ కేంద్రాలను ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించి అక్కడ అందుబాటులో ఉన్న వివిధ రకాల పాల ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన పాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడంలో విజయ డైరీ కీలక పాత్ర పోషిస్తోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు, ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులు, సిబ్బందికి ఈ కేంద్రాల ద్వారా విజయ డైరీ ఉత్పత్తులు సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి విక్రయ కేంద్రాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉత్పత్తుల నాణ్యతలో రాజీ లేకుండా ప్రమాణాలను పాటించాలని విజయ డైరీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఈవీ శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, వేముల శ్రీనివాస్, నాయకులు తోట పవన్, నలుబోల సతీష్, విజయ డైరీ డీడీ ధనరాజ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదుపై బీఆర్ఎస్ ఫోకస్..

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి..
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి..





**పరకాల అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి) :** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం పరకాలలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి వార్డులో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా నమోదైన వారు సైతం తాజా జాబితా కోసం మళ్లీ నమోదు చేసుకోవాల్సి ఉన్నందున ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వార్డుల వారీగా బాధ్యతలు తీసుకుని నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని, ప్రతి పట్టభద్రుడిని కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. వార్డుల వారీగా ఇన్‌చార్జీలు: 1,2,13 దుబాసి వెంకటస్వామి; 3,12,14,22 కొక్కిరాల రాకేష్‌రావు; 4,5,16 బండి సారంగపాణి; 5,20,21 శనిగరం నవీన్; 6,7,8 దుంపేటి నాగరాజు; 9,10,11 చందుపట్ల తిరుపతిరెడ్డి; 17,18,19 రేగురి విజయపాల్‌రెడ్డిని నియమించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, క్లస్టర్, వార్డు ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం.. సామాజిక నాయకుడి చొరవ!

- స్వచ్ఛందంగా వంతెన గుంతకు మరమ్మతులు చేయించిన ఏల సోమసుందర్
- పత్రికల్లో కథనాలు వచ్చినా స్పందించని ప్రజాప్రతినిధులు
- సొంత ఖర్చులతో గుంతను పూడ్చివేసిన వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, గ్రామస్తులు



**దేవరుప్పుల, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని హైలెవల్ వంతెనపై ఏర్పడిన ప్రమాదకరమైన గుంతకు మోక్షం లభించింది. గుంత కారణంగా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై వివిధ పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. అయినా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి కనీస స్పందన కరువైన నేపథ్యంలో సామాజిక సేవకుడు, 'ఏల సుందర్ చారిటబుల్ ట్రస్ట్' చైర్ పర్సన్, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ఏల సోమసుందర్ స్వచ్ఛందంగా ముందుకొచ్చి సోమవారం నిత్యం రద్దీగా ఉండే మార్గంలో వాహనదారులు పడుతున్న అవస్థలను గుర్తించిన ఆయన, ట్రస్ట్ ఆధ్వర్యంలో వెంటనే మరమ్మతులు చేపట్టారు. జేసీబీ సహాయంతో పగిలిన కాంక్రీట్‌ను పూర్తిగా తొలగించి గుంతను చదును చేయించి అందులో కొత్తగా కాంక్రీట్ పోయించి వంతెనకు పటిష్టంగా మరమ్మతులు చేయించారు. అధికారులు పట్టించుకోకపోయినా, ప్రజా సమస్య పరిష్కారానికి సామాజిక బాధ్యతతో ముందుకొచ్చిన ఏల సోమసుందర్‌కు గ్రామస్తులు, వాహనదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వంతెన మరమ్మతులతో తమకు పెద్ద ముప్పు తప్పిందని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ మండల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతులను ఆదుకోండి.. క్వింటాల్‌కు రూ.475 బోనస్ ఇవ్వాలి!

- రైతు సంఘం మండల కార్యదర్శి పయ్యావుల బిక్షపతి
- సీసీఐ (CCI) కొనుగోలు నిబంధనలు సడలించాలి
- తహసిల్దార్ కు వినతి పత్రం అందజేత



**దేవరుప్పుల, అక్టోబర్ 05 (ప్రజాజ్యోతి) :** ఎల్ నినో ప్రభావంతో దిగుబడి తగ్గి తీవ్ర నష్టాల పాలవుతున్న పత్తి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి పయ్యముల బిక్షపతి డిమాండ్ చేశారు. పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సీసీఐ (CCI) కేంద్రాలు ప్రారంభించి, తేమ శాతంతో నిమిత్తం లేకుండా పత్తిని కొనుగోలు చేయాలన్నారు. కేంద్రం నిబంధనల ప్రకారం ఎకరాకు 7 క్వింటాళ్లు కాకుండా, గతంలోలాగా 12 క్వింటాళ్ల పత్తిని కొనాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి క్వింటాల్‌కు రూ.475 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు రవాణా ఖర్చులతో నష్టపోకుండా తమకు సమీపంలోని మిల్లుల్లో స్వేచ్ఛగా పత్తి అమ్ముకునేలా L1 నుంచి ఎల్5 నిబంధనలను, జిల్లాల వారీ జియో మ్యాపింగ్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. కాపస్ కిసాన్ యాప్' స్లాట్ బుకింగ్ వల్ల రైతులు రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని, ఆ సమస్యలు తొలగించి ఫిజికల్ నిల్వల ఆధారంగా వేగంగా కొనుగోళ్లు జరపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుగులోతు కిషన్, గుగులోతు నరసింహ, గుగులోతు భాష, గోపాల్, ఆబోతుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎన్నిక

- వడుప్సా ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక - మండల ప్రైవేట్ పాఠశాల అధ్యక్షుడు రాము



**రాయపర్తి అక్టోబర్ 5 ప్రజాజ్యోతి :** ప్రతి సంవత్సరం గురుపుజోత్సవ మును పురస్కరించుకొని వడుప్సా వరంగల్ జిల్లా అన్ ఏడెడ్ ప్రవేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రతి పాఠశాలల నుండి ఉత్తమ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను ఎన్నుకోవడం జరుగుతుంది ఈ సంవత్సరం మన రాయపర్తి మండలం నుండి లహరి పబ్లిక్ స్కూల్ నుండి వి.శ్వేత మరియు కే.స్రవంతి, శ్రీ మహాత్మా హైస్కూల్ నుండి కే.శైనిక మరియు ఎస్.శివ బ్లూమింగ్ బర్డ్స్ స్కూల్ నుండి ఆర్.రాజు, జి.సుమలత మరియు ఏం.చైతన్య సెయింట్ మేరీస్ స్కూల్ కాట్రపల్లి నుండి ఎస్.మోతిలాల్, మరియు కే.సుధాకర్, నేతాజీ పబ్లిక్ స్కూల్ కొలనుపల్లి నుండి ఎస్.మల్లికార్జున్ మొదలగువారు ఉత్తమ ఉపాధ్యాయ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్టు మండల ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షుడు ఏ.రాము సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వడుప్సా ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల నుండి ఎంపికైన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను రాష్ట్ర మరియు జిల్లా ట్రస్మ కార్యవర్గం చే పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిగ చే మరియు వరంగల్ డిఈఓ బి.రంగయ్య నాయుడు చే సన్మానించడం జరిగిందన్నారు. ప్రైవేటు యజమాన్యాలు వీరిని అభినందించారు. సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ యాజమాన్య సభ్యులు తంగేళ్ల రవి చందర్, ఉమారాణి, శిబు పాల్, సోమయ్య ,కుంట రమేష్, శ్రీనివాస్ రెడ్డి, శంకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడు సోమయ్య కుటుంబానికి అండగా ఉంటాం

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి
- బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



**దేవరుప్పుల, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి) :** ఇటీవల మృతి చెందిన ధర్మపురం గ్రామపంచాయతీ సిబ్బంది దండు సోమయ్య కుటుంబానికి అండగా ఉంటామని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి అన్నారు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి సోమయ్య మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అనంతోజు కృష్ణమూర్తి గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుడి చేతికి గ్రామ పగ్గాలు..

విద్యార్థి ఉద్యమం నుంచి సర్పంచ్ స్థాయికి సనత్..



**పరకాల అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి) :** విద్యార్థి దశ నుంచే తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని పోరాటం చేసిన అలియాబాద్ గ్రామ సర్పంచ్ శాతరాశి సనత్‌కుమార్ పటేల్‌ను తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర ఐక్యవేదిక అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది గుడిమల్ల రవికుమార్ ఘనంగా సన్మానించారు. అలియాబాద్‌లోని సనత్‌కుమార్ పటేల్ నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గుడిమల్ల రవికుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి దశ నుంచే చురుకైన పాత్ర పోషించిన సనత్‌కుమార్ పటేల్ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఉద్యమకారులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉద్యమకారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తే మా లక్ష్యం!

- ప్రధానోపాధ్యాయురాలు పద్మ
- పెద్దమదూరు బడిలో ఉదయం 8:15 కు స్టడీ అవర్స్



**దేవరుప్పుల, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి):** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే మా ప్రథమ లక్ష్యం" అని పెద్దమదూరు ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి అన్నారు. పిల్లల అభ్యాస సామర్థ్యాలను పెంచేందుకు బడి వేళల కంటే ముందే.. ఉదయం 8:15 గంటలకే పాఠశాలలో సోమవారం ప్రత్యేక స్టడీ అవర్స్ ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. విద్యార్థులు చెట్ల నీడన ఆహ్లాదకరమైన వాతావరణంలో శ్రద్ధగా చదువుకుంటున్నరని ఉదయం పూట చదవడం వల్ల పిల్లల మెదడు చురుగ్గా పనిచేస్తుందని, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో సాగే ఈ తరగతులు వారిలో మరింత క్రమశిక్షణను పెంచుతాయని హెచ్ఎం వివరించారు. ఉపాధ్యాయులు తీసుకున్న ఈ వినూత్న చొరవపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు.. ఇంకుడుగుంటకు శ్రీకారం



**పర్వతగిరి, అక్టోబర్ 05 (ప్రజాజ్యోతి) :** భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు మండలంలోని అనంతారం గ్రామంలో కమ్యూనిటీ ఇంకుడుగుంట నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఇంకుడుగుంటకు సోమవారం సర్పంచ్ శ్రీమతి తౌటి శ్రీలత దేవేందర్ ముగ్గుపోసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించేలా ఇంకుడుగుంటలు ఏర్పాటు చేయడం వల్ల భూగర్భ జలమట్టాలు పెరిగే అవకాశం ఉందన్నారు. గ్రామంలో నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పంచాయతీ ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రతన్ బాబు, పంచాయతీ కార్యదర్శి కవిత, ఈసీ రాజు, ఎఫ్ఏ తిరుపతి, వార్డు సభ్యులు జ్యోతి యుగంధర్, కుమారస్వామి, ఆలయ ఉపాధ్యక్షుడు చందర్ రావు, కార్యదర్శి మల్లికార్జున్, అనంతరావు, ఆలయ పురోహితులు లక్ష్మణచారి తదితరులు పాల్గొన్నారు.

## 191 మంది లబ్ధిదారులకు రూ.85.30 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ




**నల్లగొండ అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 191 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.85 లక్షల 30 వేల 500 విలువైన చెక్కులను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధి పొందుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన ఆర్థిక సేవలు అందించాలి



**నల్లగొండ అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి ప్రతినిధి) :** నకిరేకల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెరమల్ గోల్డ్ లోన్స్ (ఫైనాన్స్) సంస్థను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలకు నాణ్యమైన ఆర్థిక సేవలు అందించడంతో పాటు తక్కువ వడ్డీకి రుణాలు అందించి సంస్థ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంస్థ సిబ్బంది, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 804 సర్వే నెంబర్ బహార్పేట దళితుల శ్మశాన వాటిక లో బోర్డులు నాటాలి శ్రీ

**- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ**

**భువనగిరి, అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి) :** పట్టణంలోని బహార్పేట, 26వ వార్డులో సర్వేనెంబర్ 804 దళితుల స్మశాన,వాటిక కబ్జాకు గురి అవుతున్నదని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ గతంలో తహెసిల్దార్ కి కలెక్టర్ కి తెలియజేయడం జరిగింది తహెసిల్దారు సర్వేయర్ ని పంపించి సర్వే చేయమని చెప్పడం జరిగిందని సర్వే చేసి కబ్జా కు గురైనటువంటి జాగాలో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి ఈ స్థలం దళితుల స్మశాన వాటిక భూమి అని బోర్డులు నాటాలని అక్రమ నిర్మాణాలను చేసిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.తహెసిల్దారు కి సిపిఎం భువనగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గంధ మల్ల మాతయ్య,బందెల ఎల్లయ్య, వనం రాజు,పట్టణ కమిటీ సభ్యులు దండు గిరి,దండు అమరేందర్,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కుక్కడం గ్రామ శివారులో గుర్తు తెలియని మృతదేహం



**మాద్గులపల్లి//నల్గొండ//అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి) :** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామ శివారులో కబ్రస్థాన్ సమీపంలో గుర్తుతెలియని మృతుదేహం లభ్యమవడంతో స్థానికంగా కలకలం రేగింది మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో కుళ్లి పోయి ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడి వివరాలు అతడు ఏ ప్రాంతానికి చెందిన వ్యక్తి అనే సమాచారం ప్రస్తుతానికి తెలియరాలేదు మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. మృతదేహం గుర్తింపు మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## గొర్రెల కాపరికి "బీర్ల ఫౌండేషన్ 50వేల సాయం"



**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి) :** రైలు పట్టాలపై సుమారు 400 గొర్రెలు మృతి చెంది తీవ్రంగా నష్టపోయిన భూదాన్ పోచంపల్లి మండలంలోని జూలూరు గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బాలమోని కిష్టయ్య యాదవ్ కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ అండగా నిలిచింది. ఘటనపై స్పందించిన ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత బాధిత కుటుంబాన్నికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ఆపదలో ఉన్న గొర్రెల కాపరి కుటుంబానికి అండగా నిలిచిన బీర్ల అనితకు స్థానికులు, యాదవ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం కూడా ఆదుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో పోచంపల్లి సింగిల్ విండో చైర్మన్ పాక మల్లేష్ యాదవ్, జిల్లా యాదవ సంఘం నాయకులు గుండెబోయిన అయోధ్య యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, పాక జంగయ్య యాదవ్, సోము రమేష్ కురుమ, కొత్తపల్లి జంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్పటల్‌కు బయలుదేరిన పేషంట్స్



**ఆలేరు అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో శనివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరం లో పేషంట్లను మెడిసిటీ హాస్పిటల్ కు తీసుకువెళ్లే క్రమంలో కొల్లూరు గ్రామం నుండి ప్రైవేటు బస్సు ద్వారా గ్రామ సర్పంచ్ జనగాం సుధారాణి శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గ్రామం నుండి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాజుల దశరథ, మాజీ వైస్ ఎంపీపీ లావణ్య వెంకటేష్, మాజీ సర్పంచ్ శంకరయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు ఆంజనేయులు, నిర్వాహకులు మల్లేష్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## కొలనుపాక చెరువులకు తపాస్పల్లి ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని వినతి




**ఆలేరు అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని పిన్న చెరువు, అయ్యోరు చెరువు, కొచ్చెరువులను తపాస్పల్లి ప్రాజెక్టు ద్వారా నీటితో నింపి రైతులకు, గ్రామ ప్రజలకు నీటి కొరతను తీర్చాలని కోరుతూ ఎంపీడీవో కి వినతిపత్రం అందజేశారు.సర్పంచ్ బెదిరబోయిన యాకమ్మ వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ చెరువులు నీటితో నిండితే ఆయకట్టు రైతులకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి గ్రామ ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, భైరీ కాలేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హోమియోపతి సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలి

**బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు మామిడాల బానుచందర్**




**ఆలేరు అక్టోబర్ 5(ప్రజా జ్యోతి) :** ప్రభుత్వ హోమియోపతి వైద్యశా లలో సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు మామిడాల భానుచందర్ అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో ప్రభుత్వ హోమియోపతి వైద్యశాల పరిశీలించి మాట్లాడుతూ హాస్పటల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవు అన్నారు పరిసర ప్రాంతాల్లో చెట్లను తొలగించి శుభ్రం చేయాలన్నారు. ఒక నర్సు అటెండర్ ప్రతిరోజు అందుబాటులో ఉండేలా నియమించాలన్నారు. రోగులకు కనీస అవసరాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేషెంట్లు తదితరులు పాల్గొన్నారు

# పట్టభద్రుల ఓటు నమోదు.. బీఆర్ఎస్ గెలుపునకు తొలి అడుగు!

**- నవంబర్ 6 లోపు అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలి: బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుజ్జ యుగంధర్ రావు**

**- తుంగతుర్తి నుంచే బీఆర్ఎస్ ఓటర్ల నమోదు కార్యాచరణకు శ్రీకారం**





**తుంగతుర్తి, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి) :** త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఖచ్చితంగా విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు గుజ్జ యుగంధర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం తుంగతుర్తి బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటర్ల నమోదు హెల్ప్‌డెస్క్‌ను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా యుగంధర్ రావు మాట్లాడుతూ... అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 31, 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు అర్హులని తెలిపారు. ఓటర్ల నమోదు కోసం నవంబర్ 6 చివరి తేదీ కావడంతో సమయం తక్కువగా ఉందని, పార్టీ శ్రేణులు వేగంగా పనిచేయాలని సూచించారు. గ్రామాల వారీగా పార్టీ ముఖ్య నాయకులు, ఇన్‌చార్జీలు పట్టభద్రులను సమీకరించి వారి ఓట్లను నమోదు చేయించే బాధ్యత తీసుకోవాలని కోరారు. పట్టభద్రుల ఓటర్ల నమోదులో తుంగతుర్తి మండలం రాష్ట్రంలోనే ముందువరుసలో నిలిచేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల బీఆర్ఎస్ ఇన్‌చార్జీలు సేకరించిన పట్టభద్రుల ఓటు దరఖాస్తులను తుంగతుర్తిలోని గునిగంటి సంతోష్ ఇంటర్నెట్ షాప్‌లో ఆన్‌లైన్ చేయించాలని సూచించారు. ఏ ఒక్క అర్హుడి ఓటు కూడా నమోదు కాకుండా మిగలకుండా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అనంతరం తూర్పు గూడెం గ్రామ వాస్తవ్యుడు గుండగాని క్రాంతి కుమార్ ఏర్పాటు చేసుకున్న పెయింటింగ్ షాపును ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య, నాయకులు గుండగాని రాములు గౌడ్, గుండగాని దుర్గయ్య, తునికి సాయిలు, గుడిపాటి వీరయ్య, మల్యాల రాములు, గునిగంటి యాదగిరి, పూర్ణనాయక్, గోపగాని రమేష్, ఉప్పుల నాగమల్లు, పట్టణ అధ్యక్షులు గోపగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల ఇన్‌చార్జీలు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి - టీఎస్‌యూటీఎఫ్




**నల్లగొండ అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి ప్రతినిధి) :** శాలిగౌరారం మండల నూతన అధ్యక్షుడు రాగి రాకేష్‌కుమార్ నకిరేకల్: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని టీఎస్‌యూటీఎఫ్ శాలిగౌరారం మండల నూతన అధ్యక్షుడు రాగి రాకేష్‌కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి నకిరేకల్‌లో నిర్వహించిన ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ శాలిగౌరారం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల వెంకటేశం, పరిశీలకుడిగా జిల్లా కార్యదర్శి నలపరాజు వెంకన్న వ్యవహరించారు.

ఈ సందర్భంగా రాగి రాకేష్‌కుమార్ మాట్లాడుతూ జి.ఓ. నెం.25ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు తగినంత మంది ఉపాధ్యాయులను నియమించాలని అన్నారు. ఉపాధ్యాయులపై పెరుగుతున్న బోధనేతర పనులు, యాప్‌ల భారం తగ్గించి పూర్తిస్థాయిలో బోధనా కార్యక్రమాలకు పరిమితం చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీని తక్షణమే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు, బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రాథమిక పాఠశాలల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలల విలీనాలు, కుదింపుల వల్ల గ్రామీణ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యలను కేవలం వ్యక్తిగత సమస్యలుగా కాకుండా విద్యారంగ సమస్యలుగా ప్రభుత్వం గుర్తించాలని రాకేష్‌కుమార్ అన్నారు. సమస్యల పరిష్కారం కోసం మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంఘటిత ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహతో పనిచేస్తూ ఉపాధ్యాయుల హక్కులు, విద్యార్థుల భవిష్యత్తు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణకు నూతన కమిటీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. శాలిగౌరారం మండలంలో టీఎస్‌యూటీఎఫ్‌ను మరింత బలోపేతం చేసి ఉపాధ్యాయులను సంఘటితం చేస్తామని తెలిపారు.

## వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన

**- ఆధునిక సాంకేతికతతో అధిక దిగుబడులు సాధించాలి**

**- రైతులకు ప్రభుత్వ విప్ వేముల వీరేశం సూచన**





**నల్లగొండ అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి ప్రతినిధి) :** వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకొని అధిక దిగుబడులు సాధించాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. సోమవారం నకిరేకల్‌లోని కమలా గార్డెన్‌లో నకిరేకల్ డివిజన్ ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ యాంత్రీకరణలో ఆధునిక పద్ధతులు, ఉద్యాన పంటల సాగు, పశుపోషణ, నానో యూరియా, నానో డీఏపీ వినియోగం, డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ, ప్రకృతి వ్యవసాయం, నూనెగింజల సాగు, అధిక దిగుబడినిచ్చే వంగడాలు, సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆర్‌పీఎల్ (పూర్వ అభ్యసన గుర్తింపు) ద్వారా నైపుణ్యాభివృద్ధి అంశాలను వివరించారు.

కంపసాగర్ శాస్త్రవేత్త బి. అనిల్ కుమార్ రైతులకు పలు వ్యవసాయ సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి వి. వినోద్ కుమార్ రైతులకు మార్గదర్శనం చేశారు. నాబార్డ్ డీడీఎం ఎం.వినయ్ కుమార్ రైతులకు ఉపయోగకరమైన ప్రభుత్వ పథకాలు, శిక్షణ కార్యక్రమాలు, సబ్సిడీ అవకాశాలను వివరించారు. కార్యక్రమానికి ఆత్మ చైర్మన్ కంచర్ల మహేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా, సహాయ వ్యవసాయ సంచాలకులు టి.విజయేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమా రెడ్డి, చిట్యాల మున్సిపల్ చైర్మన్ పందిరి గీతా రమేష్, పశువైద్యాధికారి ఎన్. శ్రీనివాస్ రెడ్డి, ఉద్యానాధికారి ప్రవీణ్, వ్యవసాయ శాఖ అధికారులు, ఆత్మ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా పసల ఫౌండేషన్ చైర్మన్ అర్జున్ పుట్టినరోజు వేడుకలు

**ఆలేరు అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో పసల ఫౌండేషన్ చైర్మన్ మాదాను అర్జున్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఫౌండేషన్ ఆఫీస్ ఆలేరు నందు ఆలేరు రీజినల్ హెడ్ పసల ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ



కార్యక్రమంలో మండల హెడ్స్ చిన్న బత్తిని వినయ్ కుమార్, పసల సందీప్, గణేష్ జాన్సన్ పృథ్వి రాజు అర్జున్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.




## ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపు కోసం కాంగ్రెస్ సైనికులు కృషి చేయాలి




**- ఎమ్మెల్యే బి ఎల్ ఆర్**

**- సర్వోత్తమ్ రెడ్డితో కలిసి విస్తృతస్థాయి సమావేశం**

**మిర్యాలగూడ, అక్టోబర్ 05, (ప్రజాజ్యోతి) :** నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపు కోసం ప్రతి కాంగ్రెస్ సైనికుడు కృషి చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్ )కోరారు. ప్రచారంలో భాగంగా సోమవారం మిర్యాలగూడ కు వచ్చిన సర్వోత్తమ్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ తన క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మిర్యాలగూడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు,ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు హాజరయ్యారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమాలు, పట్టభద్రుల ఓటు నమోదు మరియు ఓటర్లను చైతన్యపరిచే అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం లోని ప్రతి పట్టభద్రుడిని సంప్రదించి, ఓటు హక్కు ఉన్న వారందరూ తమ ఓటును నమోదు చేసుకునేలా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. సర్వోత్తమ్ రెడ్డి విజయానికి సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రచారాన్ని మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకుని వెళ్లి సర్వోత్తమ్ రెడ్డి గెలుపుకు సమన్వయంతో పనిచేసి విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి, గుడిపాటి నవీన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోడి రెక్క ఇంద్ర కుమార్, మోయిజ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు బెజ్జం సాయి, పలు మండలాల అధ్యక్షులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా బర్డ్ వాచింగ్ ఫుట్ పెట్రోలింగ్

**ఇందల్వాయి, ప్రజా జ్యోతి అక్టోబర్ 5,** ఇందల్వాయి మండల కేంద్రంలోని సిర్నాపల్లి వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా ఎఫ్ ఆర్ ఓ. ఇందల్వాయి రేంజ్ ఆధ్వర్యంలో ఈరోజు అటవీ శాఖ సిబ్బందితో కలిసి పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్నాపల్లి వాటర్‌ఫాల్ వద్ద బర్డ్ వాచింగ్ కార్యక్రమం నిర్వహించి, అక్కడ కనిపించిన వివిధ రకాల పక్షులను పరిశీలించారు. పక్షులు ఇతర వన్యప్రాణుల సంరక్షణ, వాటి సహజ ఆవాసాల పరిరక్షణపై సిబ్బందికి అవగాహన కల్పించారు.









అనంతరం నల్లవెల్లి బీట్, కంపార్ట్‌మెంట్ నంబర్ 438లో అటవీ శాఖ సిబ్బందితో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణ, అక్రమ కార్యకలాపాల నివారణ, అటవీ రక్షణ చర్యలను పరిశీలించారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రజలు మరియు అటవీ శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎఫ్ ఆర్ ఓ రవి మోహన్ బట్ అన్నారు ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ రాకేష్ సెక్షన్ ఆఫీసర్ సురేందర్. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుల తనిఖీలు

**ఇందల్వాయి: ( ప్రజా జ్యోతి ) అక్టోబర్. 5.** ఇందల్వాయి మండల కేంద్రంలో ఎస్సై సుమలత ఆధ్వర్యంలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలకు సరైన పత్రాలు లేకుండా నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ఘటనలను అరికట్టేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై సుమలత తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని ఆమె పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపినా, సరైన పత్రాలు లేకుండా రోడ్డుపైకి వచ్చినా వాహనాన్ని సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ గంగాధర్, కానిస్టేబుల్ రఘు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## కొత్తపల్లి పీఏసీఎస్‌లో 2026 వర్షాకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

**కోటగిరి, అక్టోబర్ 5, ప్రజా జ్యోతి.** కోటగిరి మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ( పీ ఏసీ ఎస్ ) కొత్తపల్లి గ్రామంలో 2026 వర్షాకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ కొత్తపల్లి సంఘం చైర్మన్ డాక్టర్ వెనిగళ్ళ సునీల్ కుమార్ చౌదరి గారు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోటగిరి మండల తహసీల్దార్ ఎమ్మార్వో కె. గంగాధర్ హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచులు పి. గంగాధర్ , కోర్ర రవి , వెల్లంకి సీతాకుమారి రంగదాస్ చౌదరి , శ్యామ్ కీ శంకర్ , డైరెక్టర్లు వల్లేపల్లి శ్రీనివాసరావు , గుగులోతు తుకారాం గారు, మండల వ్యవసాయ అధికారి రాజు గారు, ఏ ఈ ఓ, రాంపూర్ షేక్ గౌస్ , ఏఈఓ కొత్తపల్లి ప్రశాంత్ , సీఈవో కమలేష్ , సుదర్శన్ , రైతులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ వెనిగళ్ళ సునీల్ కుమార్ చౌదరి మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం వరి ధాన్యానికి మార్కెట్లో లభిస్తున్న ధరలను దృష్టిలో ఉంచుకొని, దొడ్డు వడ్ల నుంచి సన్న వడ్ల వరకు రైతులకు కనీసం ₹4,500 నుంచి ₹5,000 వరకు అధికారిక మద్దతు ధరను



ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. ఈ అంశంపై పీఏసీఎస్ జనరల్ బాడీ సమావేశంలోనూ, ఇతర సమావేశాల్లోనూ తీర్మానం చేసి, రైతుల తరఫున ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు కూడా ఇదే అంశంపై తీర్మానాలు చేసి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేస్తానని చెప్పారు. ప్రభుత్వం అధికారికంగా ₹4,500--₹5,000 మద్దతు ధరను ప్రకటిస్తే, రైతులకు ప్రభుత్వ కొనుగోలు ద్వారా ఒక భరోసా ఏర్పడటమే కాకుండా, ప్రైవేటు వ్యాపారులు కూడా ఆ ధరకు మించి కొనుగోలు చేసే అవకాశం ఏర్పడుతుందని, తద్వారా రైతులకు మరింత మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని చైర్మన్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రైవేటు మార్కెట్లో క్వింటాల్‌కు సుమారు ₹4,000 వరకు ధర లభిస్తున్న పరిస్థితుల్లో, రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వ మద్దతు ధర ఒక కనీస ధరకు భరోసా కల్పిస్తుందని అన్నారు. "రైతు బాగుంటేనే వ్యవసాయం బాగుంటుంది... వ్యవసాయం బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. రైతుకు సరైన ధర లభించడమే రైతు కుటుంబానికి నిజమైన భరోసా" అని చైర్మన్ పేర్కొన్నారు. రైతులు తమ ధాన్యాన్ని నాణ్యత, తేమ శాతం, మార్కెట్ ధరలను పరిశీలిస్తూ, అందుబాటులో ఉన్న మంచి ధరకు విక్రయించుకోవాలని సూచించారు. రైతుల అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక భద్రతే కొత్తపల్లి పీఏసీఎస్ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏర్పడే పాలకవర్గాలు కూడా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రతిపాదనను కొనసాగిస్తూ, ప్రభుత్వంపై సానుకూల ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు మెరుగైన మద్దతు ధర సాధించేందుకు కృషి చేయాలని చైర్మన్ కోరారు.

## హనుమాన్ ఆలయం ఎదుట మాంసం దుకాణాలు తొలగించాలి

♦ ప్రజావాణిలో ఎంపీడీఓకు గ్రామస్తుల వినతి

**బీర్కూర్, అక్టోబర్ 05 (ప్రజాజ్యోతి):** బీర్కూర్ మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో హనుమాన్ ఆలయం ఎదురుగా కొనసాగుతున్న మాంసం విక్రయ దుకాణాలను తొలగించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీఓ శ్రీనిధికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సుధాకర్ యాదవ్, ప్రశాంత్ యాదవ్ మాట్లాడుతూ.. హనుమాన్ ఆలయం ఎదురుగా మాంసం దుకాణాలు కొనసాగుతుండటంతో ఆలయానికి వచ్చే భక్తులు, స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. మాంసం వ్యర్థాలను సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొనే అవకాశం ఉందని, ఆలయ పరిసరాల ప్రశాంత వాతావరణం దెబ్బతింటోందని పేర్కొన్నారు. ఆలయం పరిసరాల్లో పరిశుభ్రత, ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని మాంసం విక్రయ దుకాణాలను మరో ప్రాంతానికి తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సమస్యను పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ యాదవ్, ప్రశాంత్ యాదవ్, గొల్ల రాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.





## సమాచార హక్కు చట్టం వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలి

♦ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :** తెలంగాణ సమాచార కమిషన్ కార్యదర్శి ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టం--2005పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు నేటి (అక్టోబర్ 5) నుంచి 12వ తేదీ వరకు సమాచార హక్కు చట్టం - ఆర్.టి.ఐ వారోత్సవాలు --2026 నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ సంగీత తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులతో ఆర్టీఐ వారోత్సవాల నిర్వహణపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం--2005పై సాధారణ ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, చట్టం ప్రకారం ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన బాధ్యతలపై చైతన్యం కల్పించడం వారోత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలలో సంబంధిత శాఖలు, పబ్లిక్ అథారిటీస్ భాగస్వాములను చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు స్వచ్ఛందంగా సమాచారాన్ని వెల్లడించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 9 న రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు జిల్లా కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఏ పి ఐ ఓ లు , పి ఐ ఓ లు , ఫస్టు అప్పీలేట్ అథారిటీ అధికారులు




తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. ఆర్టీఐ వారోత్సవాలను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కరెంట్ కోతలపై రైతుల ఆగ్రహం.. సబ్‌స్టేషన్ ముట్టడి



**హత్నూర ప్రజా జ్యోతి ప్రతినిధి:** హత్నూర మండల పరిధిలోని నాస్తిపూర్ సబ్‌స్టేషన్ కేంద్రంలో విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలపై మంగపూర్ రైతులు సోమవారం నాడు ఆందోళనకు దిగారు. వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆరోపిస్తూ నాస్తిపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి నిరసన తెలిపారు. వ్యవసాయ మోటార్లకు తరచూ లోవోల్టేజీ రావడంతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల కారణంగా పంటలకు నీరందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సబ్‌స్టేషన్‌కు చేరుకుని రైతులు, నాయకులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నచ్చజెప్పారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలలో ప్రజలు పాల్గొన్నారు.

## హత్నూర అధికారుల వేధింపులు ఆపాలి

♦ కాసాల వివోఏను కొనసాగించాలి

♦ వివోఏ మాధవి పై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి

♦ వివోఏలకు ప్రభుత్వ హామీని అమలు చేయాలి

♦ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం నగేష్



**హత్నూర 6 అక్టోబర్ (ప్రజాజ్యోతి)** మండలంలో సోమవారం నాడు కాసాల వివోఏ పై సిసి వేధింపులు ఆపాలని ఎలాంటి అవినీతికి పాల్పడకుండా పేదలకు సేవలందిస్తున్న వివో ఏను కొనసాగించాలని ప్రభుత్వ హామీలు అమలు చేయాలని ఈరోజు మండల సమైక్య కార్యాలయం ముందు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ధర్నా నిర్వహించి ఏపిఎంకు మెమొరం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం నగేష్ మాట్లాడుతూ 24 సంవత్సరం నుంచి కష్టపడుతున్న వివోయిలకు నేటికీ కనీస వేతనం లేదని ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనాలు ఉద్యోగ భద్రత చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు నల్గొండ జిల్లాలో మాధవి పై అన్యాయంగా దాడి చేసిన మాజీ సర్పంచును వెంటనే అరెస్టు చేయాలని కాసాల గ్రామ వి ఓ ఏ ను కొనసాగించాలని,సీసీ వేధింపులు ఆపాలని లేకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి సాయిలు సిఐటియు మండల నాయకులు షబ్బీర్ శేఖర్ యూనియన్ నాయకులు మంజుల ఆంజనేయులు కిష్టయ్య నరేందర్ గౌడ్ కృష్ణ భాగ్యలక్ష్మి మల్లయ్య ప్రవీణ్ మల్లారెడ్డి విజయ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## బోర్డులు ఉన్నా గ్రామాల పేర్లు కనిపించవు !

**కల్హేర్, అక్టోబర్ 5, ప్రజాజ్యోతి:** కల్హేర్ నుంచి నారాయణఖేడ్ వెళ్లే ప్రధాన రహదారిపై పలు గ్రామాల సూచిక బోర్డులు చెట్ల కొమ్మల చాటున కనిపించకుండా పోయాయి. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు గ్రామాల పేర్లను గుర్తించడంలో ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. సూచిక బోర్డులపై కమ్ముకున్న చెట్ల కొమ్మ లను తొలగించ కపోవడంతో సమస్య కొనసా గుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి బోర్డులకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించి, ప్రయాణికులకు స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.




## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

♦ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :** ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను స్వయంగా ఆలకించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులకు అర్జీలను పంపించి వెంటనే చర్యలు





తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి నిర్ణీత సమయంలో సత్వర పరిష్కారం చూపాలన్నారు. జిల్లా ప్రజావాణి దరఖాస్తులతో పాటు పెండింగ్‌లో ఉన్న సీఎం ప్రజావాణి దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 81 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో కలెక్టరేట్‌కు 53, సంగారెడ్డి డివిజన్‌కు 22 , నారాయణఖేడ్ డివిజన్‌కు 5 , జహీరాబాద్ డివిజన్‌కు 1 వినతి అందగా, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని అధికారులు వెల్లడించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, బీసీ సంక్షేమాధికారి జగదీష్, సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, పీడీ గృహనిర్మాణ శాఖ చలపతిరావు, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ ఎస్.బి. రామాచారి, జిల్లా సంక్షేమాధికారిణి లలిత కుమారి, అదనపు డీఆర్డీఓ బాలరాజ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



## రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తి

- 15 మంది సభ్యులు ఎన్నిక
- 688 మందిలో 295 మంది ఓటు హక్కు వినియోగం
- 42.88 శాతం పోలింగ్ నమోదు






మెదక్ (ప్రజా జ్యోతి) మెదక్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎన్నికల అధికారి, మెదక్ ఆర్డీవో డా. కె. రమాదేవి తెలిపారు. మెదక్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో మొత్తం 688 మంది ఓటర్లకు గాను 295 మంది తమ ఓటు హక్కును వినియోగించు కున్నట్లు తెలిపారు. దీంతో 42.88 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు.పోలైన ఓట్లలో 22 ఓట్లు చెల్లని ఓట్లుగా గుర్తించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో తుది బరిలో ఉన్న అభ్యర్థులలో 15 మంది మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైనట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియను సంబంధిత నిబంధనల ప్రకారం పారదర్శకంగా, ప్రశాంతంగా, క్రమబద్ధంగా నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సహకరించిన అధికారులు, సిబ్బంది మరియు ఓటర్లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## కరెంట్ కోతలతో వరి పంటకు తీవ్ర నష్టం

- గంగాయిపల్లిలో పంటను పరిశీలించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి
- ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలని డిమాండ్



శివ్వంపేట, ప్రజాజ్యోతి అక్టోబర్ 05: విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయాల కారణంగా దెబ్బతిన్న వరి పంటలను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సోమవారం పరిశీలించారు. శివ్వంపేట మండలం గంగాయపల్లి గ్రామానికి చెందిన రైతులు గొల్ల బిక్షపతి యాదవ్,పెద్ద దాసరి రవికి చెందిన సుమారు మూడు ఎకరాల్లో ఎండిపోయిన వరి పంటను పరిశీలించి,రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడులు చేతికందే సమయంలో విద్యుత్ సమస్య కారణంగా పంటకు అవసరమైన నీరు అందక నష్టం వాటిల్లిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.రైతుల పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.దెబ్బతిన్న పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి,నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కోరారు.విద్యుత్ కోతల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నష్టపరిహారం అందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే హెచ్చరించారు.

## దివ్యాంగుల పింఛన్ ఆరు వేలకు పెంచాలి

- దివ్యాంగుల మహా ధర్నాను విజయవంతం చేయాలి
- తోట కమలాకర్ రెడ్డి



మిరుదొడ్డి, అక్టోబర్ 5, (ప్రజా జ్యోతి): దివ్యాంగుల పింఛన్‌ను నెలకు రూ.ఆరు వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6వ తేదీ మంగళవారం నిర్వహించనున్న దివ్యాంగుల మహా ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తోట కమలాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం దివ్యాంగులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల సాధన కోసం చేపడుతున్న ఈ ధర్నాకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి దివ్యాంగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా దివ్యాంగుల పింఛన్‌ను రూ.ఆరు వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కుల కోసం నిర్వహిస్తున్న మహా ధర్నాకు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల దివ్యాంగులు పెద్ద ఎత్తున హాజరై మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల డిమాండ్లను పరిశీలించి, పింఛన్ పెంపుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ ధర్నా ద్వారా దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో దివ్యాంగుల ఐక్య వేదిక నాయకులు వల్లాల సత్యనారాయణ, బాలరాజు, రాములు, ఐలయ్య, మైసయ్య, చంద్రారెడ్డి, వెంకట్ రెడ్డి, రాజేశ్వరరావు, ఎల్లం, చార్వక కుమార్, మల్లయ్య, ఎల్లయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

### చేర్యాల ఏఎంసీ చైర్మన్‌గా

## కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం



చేర్యాల, అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి): చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా బోయిని శ్రీనివాస్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి రవికుమార్ నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి, ప్రజాప్రతినిధులకు, రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని, పంటలకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేస్తానన్నారు. మార్కెట్ యార్డులో రైతులకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలను మెరుగుపరిచి రైతులకు అనుకూలంగా మార్కెట్ కమిటీని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని అధికారుల సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తానని, వ్యవసాయ రంగం అభివృద్ధితో పాటు రైతుల ఆర్థికాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వ్యాపారస్తులు నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వివిధ మండలాల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నేడు గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

- అధికారుల సమన్వయంతో గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్






మెదక్ (ప్రజా జ్యోతి) దేశంలోనే తొలిసారి.. జాతీయ రహదారి వెంట 35 వేల జీడిమామిడి మొక్కలు - రామాయంపేట--సిద్దిపేట మధ్య చీఎ-765ఙ+ వెంట భారీ ప్లాంటేషన్ కార్యక్రమన్నీ ఈ నెల 6న ప్రారంభించనున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని, అధికారుల సమన్వయం తో గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారుకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గవర్నర్ పర్యటన విజయవంతం పై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా, మెదక్ ఎంపీ రఘునందన్ రావు లు ఈ నెల 6న మెదక్ జిల్లాలో పర్యటించనున్నారనీ, పర్యటనలో భాగంగా దేశంలోనే తొలిసారిగా జాతీయ రహదారి వెంట 35 వేల జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని రామాయంపేటలో ప్రారంభించనున్నారని తెలిపారు.జాతీయ రహదారి వెంట ఒకేసారి ఇంత భారీ స్థాయిలో జీడిమామిడి మొక్కలు నాటడం దేశంలోనే ఇదే తొలిసారన్నారు.జాతీయ రహదారి వెంబడి అందుబాటులో ఉన్న భూమిని ఉత్పాదకంగా వినియోగించుకోవడంతో పాటు పచ్చదనాన్ని,పర్యావరణ సుస్థిరత. ప్రోత్సహించే లక్ష్యంతో భారతదేశంలో చేపట్టిన మొట్టమొదటి కార్యక్రమాన్ని గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా సాయంత్రం 3.30 గంటలకు రామాయంపేటలోని అమోఘ్ హోటల్ సమీపంలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద ప్రారంభిస్తారు. సాయంత్రం 3.30 నుంచి 4.30 గంటల వరకు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

**×ణూజ లో నషా ముక్త్ భారత్ ర్యాలీ ప్రారంభం**

మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా గవర్నర్ మధ్యాహ్నం 2.30 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)కి చేరుకుంటారనీ,2.40 గంటలకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించే నషా ముక్త్ భారత్ ర్యాలీని ప్రారంభిస్తారన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. 2.50 గంటలకు ఐడీఓసీలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి స్టాళ్లను సందర్శించి, స్వయం సహాయక సంఘాల సభ్యులతో భేటీ అవుతారు. అనంతరం నూతనంగా ఎన్నికైన భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో సమావేశమవుతారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఐడీఓసీ నుంచి రామాయంపేటకు బయలుదేరి, 3.30 గంటలకు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారనీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గవర్నర్ పర్యటనను విజయవంతం కోసం పటిష్ట భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సెక్యూరిటీ,ట్రాఫిక్ ,లాంటి పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశ అనంతరం ఐ డి వో సి లో గవర్నర్ పర్యటన ఏర్పాట్లను. అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి ,డీఎస్పీ ప్రసన్నకుమార్, ఇతర అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా అటవీ అధికారి జో జి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, సంక్షేమ అధికారి హేమా భార్గవి,డి ఎస్ పి ప్రసన్న కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కరెంట్ కోతలతో వరి పంటలు ఎండిపోయే పరిస్థితి

- రైతులను ఆదుకునేందుకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి
- తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్య యాదవ్ డిమాండ్



శివ్వంపేట ప్రజాజ్యోతి అక్టోబర్ 05: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు విద్యుత్ కోతలు తీవ్రం కావడంతో మెదక్ జిల్లాలో వరి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంటోందని తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. శివ్వంపేట మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ,,రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మెదక్ జిల్లాలో వరి సాగు అధికంగా ఉంటుందని,ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో పంటలకు సాగునీరు అందించేందుకు విద్యుత్‌పై రైతులు ఆధారపడుతున్నారని తెలిపారు. అయితే ఈ నెలలో విద్యుత్ కోతలు తీవ్రంగా పెరగడంతో రోజుకు మూడు, నాలుగు సార్లు సరఫరా నిలిచిపోతోందని అన్నారు. దీంతో మోటార్లు సక్రమంగా పనిచేయక పంటలకు నీరందక అక్కడక్కడా వరి పంటలు ఎండిపోవడం ప్రారంభమైందని పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్లు, సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వ్యవసాయానికి ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలు కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించకపోతే రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు,ఆందోళనలు చేపట్టే పరిస్థితి ఏర్పడుతుందని మైసయ్య యాదవ్ స్పష్టం చేశారు. రైతుల పక్షాన తెలంగాణ రైతు రక్షణ సమితి ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి,పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

# రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలి

- ఏడు గంటల కరెంటుతో పంటలు ఎండిపోతున్నాయి..
- రహదారుల దిగ్బంధానికి వెనుకాడం
- వంటేరు ప్రతాప్‌రెడ్డి
- మాదాస్ శ్రీనివాస్





గజ్వేల్, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి): రైతుల పంటలకు ఏడు గంటల విద్యుత్ ఏమాత్రం సరిపోవడం లేదని, నాణ్యమైన విద్యుత్ అందక పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం అందించిన విధంగా రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.సోమవారం గజ్వేల్ పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వంటేరు ప్రతాప్‌రెడ్డి, మదాస్ శ్రీనివాస్ బిఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ సరఫరా లాగ్‌బుక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి,మాట్లాడుతూ, రైతులకు 12 గంటల విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం కేవలం ఏడు గంటల విద్యుత్ సరఫరాతో సరిపెడుతోందని విమర్శించారు. విద్యుత్ కోతలు, తక్కువ వోల్టేజీ కారణంగా మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, పంటలకు సకాలంలో నీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టుల నుంచి కాలువలకు నీటిని విడుదల చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్, సాగునీరు అందకపోతే రైతులు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి నష్టపోయే పరిస్థితి ఉ ందన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్, సాగునీరు అందించాలని కోరారు.రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం అన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రాబోయే రోజుల్లో వేలాది మంది రైతులతో కలిసి మండల, నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి రహదారులను దిగ్బంధిస్తామని హెచ్చరించారు.

**రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలి**

**- గజ్వేల్ ఏఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్**

రైతులకు ఆరుగాలం పంటకు అవసరమైన 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని గజ్వేల్ ఏఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. విద్యుత్ కోతల కారణంగా రైతులు సాగులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పొలాలకు సకాలంలో నీరు అందాలంటే నిరంతర విద్యుత్ ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే వేలాది మంది రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి, కొండపాక మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, మాజీ ఎంపీపీ లత,మండల ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు మామిడి శ్రీధర్, బొగ్గుల స్వప్న సురేష్, కప్ప మమత పోచయ్య, మరికంటి కనకయ్య, మాజీ సర్పంచ్ స్వామి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి నీటి బొట్టును పొదుపు చేయాలి

- మఱ్రిముచ్చాలలో జలసిరి, స్వచ్ఛతపై సారధి కళాజాత అవగాహన



కొమురవెల్లి, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి): నీటిని పొదుపుగా వినియోగిస్తూ ప్రతి నీటి బొట్టును సంరక్షించుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం ప్రజలకు అవగాహన కల్పించింది. జిల్లా కలెక్టర్, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ, ఎంపీడీఓ శ్రీనివాస్ వర్మ ఆదేశాల మేరకు జలసిరి, స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా మఱ్రిముచ్చాల గ్రామంలో నీటి పొదుపు, సీజనల్ వ్యాధుల నివారణపై కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ జంగని రవి హాజరై మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాలకు నీటి వనరులను అందించేందుకు ఇంకుడు గుంతలు, పంట కుంటలు నిర్మించుకోవాలని సూచించారు. అలాగే మన ఇల్లు, మన వీధి, మన గ్రామం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్త, ఈ-వేస్ట్‌ను వేర్వేరుగా సేకరించి పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని సూచించారు. మనం బాగుంటే ఊరంతా బాగుంటుంది.. స్వచ్ఛమైన గ్రామం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి" అని సర్పంచ్ జంగని రవి ప్రజలను కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారధి కవి గాయకులు పిన్నింటి రత్నం, గజ్వేల్ సారధి టీమ్ లీడర్ శ్యామ్ సుందర్, పుల్లూరు యాదగిరి, సనువాల కనకయ్య, గెంటే హరిప్రసాద్, పన్నీరు శ్రీనివాస్, ఎల్ల సిద్దులు, తండ బిక్షపతి, బండారు నర్సింలు, పద్మ, శైలజ, మమత తదితరులు కళా ప్రదర్శనల ద్వారా ప్రజలకు నీటి పొదుపు, పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు.

## సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

– బాధితులకు సత్వర న్యాయం అందించాలి

– ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** వికారాబా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పి వారి సమస్యలను ఓపికగా విని వివరాలను తెలుసుకున్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, చట్టపరిధిలో సమగ్రంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో మాట్లాడిన ఎస్పీ.. సమస్యల పరిష్కారాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన సందర్భాల్లో ఫిర్యాదుదారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకు ప్రాధాన్యతనిస్తూ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వారికి సత్వర న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యతల్లో ఒకటని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని భరోసా కల్పించారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత: ఎమ్మెల్యే

– పోల్కంపల్లిలో 50 లక్షలతో సీసీ రోడ్ల ప్రారంభం

– ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి తక్షణ స్పందన

– గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు వెచ్చిస్తా: ఎమ్మెల్యే





**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 5 ప్రజాజ్యోతి :** ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ప్రత్యేకంగా సమావేశాలు అవసరం లేదని, ప్రజల మధ్యకు వస్తే తెలుస్తాయని ఎమ్మెల్యే అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం, పోల్కంపల్లి గ్రామంలో 50 లక్షలతో నిర్మించి సిసి రోడ్లని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. పోల్కంపల్లి అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్బంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ద్రుష్టికీ గ్రామస్తులు తమ సమస్యలు తీసుకెళ్లారు. ఈ మేరకు అక్కడిక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ప్రత్యేకంగా సమావేశాలు అవసరం లేదని, ప్రజల మధ్యకు వచ్చినప్పుడే సమస్యలను విని అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రజా పాలనకు నిదర్శనం అని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం

మల్కాజ్గిరి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకార అరుణ్ పటేల్



**ఉప్పల్,అక్టోబర్ 5, ప్రజా జ్యోతి :** ఉప్పల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ అధ్యక్షతన ఉప్పల్ యువజన కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం ఘనంగా జరిగింది.మల్కాజి గిరి పార్లమెంట్ నుండి రేవంత్ రెడ్డి ని ఎలా గెలిపించామో రానున్న ఎమ్మెల్సీ ఎలక్షన్లో కూడా విజయం సాధించాలని సమావేశంలో చెప్పడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇన్చార్జ్, ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ నేషనల్ సెక్రటరీ భవ్య,బొమ్మక్ అజయ్ నాగార్జున,మునీర్ లు హాజరై, యువజన కాంగ్రెస్ బలోపేతం భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు నిఖిల్ సాయి సచిన్ కిషోర్, నియోజకవర్గ వివిధ డివిజన్ల అధ్యక్షులు జయంత్ ప్రశాంత్ భాను ఉప్పల్ ప్రశాంత్ వాసు యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# ప్రజావాణికి గైర్హాజరైతే షోకాజ్ నోటీసులు





జిల్లా అధికారులకు కలెక్టర్ దీపక్ తివారి ఆదేశం

**వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి) :** ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. ముందస్తు అనుమతి లేకుండా ప్రజావాణికి గైర్హాజరయ్యే అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణికి అధికారులు సమయానికి హాజరై ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. స్వీకరించిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, పరిష్కార పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో మొత్తం 103 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై మండల ప్రత్యేక అధికారులు పూర్తి బాధ్యత వహించాలని, అందిన ఫిర్యాదుల జాబితాను సమర్పించాలని ఆదేశించారు. అలాగే 'మీ ప్రమాణం' యాప్‌లో అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, జెడ్పీ సీఈవో సుధీర్, డీఆర్‌డీఏ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కెవిపిఎస్ 29వ ఆవిర్భావ వేడుకలు

– దేశంలో కుల రాకాసిని అంతమొందించాలి

– మహాత్మా జ్యోతిబాపూలే, భారత రాజ్యాంగ నిర్మాత ఆశయాలు నెరవేరుద్దాం

– కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య



**తాండూరు అక్టోబర్ 5 ప్రజా జ్యోతి :** తాండూరు పట్టణంలో కెవిపిఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం రోజు పట్టణంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య ఆధ్వర్యంలో కుల వివక్ష పోరాట సమితి (కెవిపిఎస్) జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా అనగారిన అంటరాని కులం అంటూ దేశంలో కుల వివక్షత రోజుకు పెరిగి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఏ దేశంలో లేనివిధంగా మన భారత దేశంలో కుల రాక్షసి రాజ్యమేలుతుందని విమర్శించారు. పేద బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న మహాత్మా జ్యోతిబాపూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లాంటి మహానుభావులే కుల రాకాసిని అంతమొందించాలనే సంకల్పంతో ముందుకు వెళ్లారని చెప్పారు. 80 ఏళ్ల స్వాతంత్రం తర్వాత కూడా దాడులు దౌర్జన్యాలు అంటరానితనం కొనసాగడం బాధాకరమన్నారు.

**దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన 13 ఏళ్ల కాలంలో సుమారు :** 6 లక్షలకు పైగా దళితులపై దాడులు జరిగాయని గుర్తు చేశారు. కుల వివక్షతను ప్రశ్నించినందుకు 2 వేల మంది దళితులు ప్రాణాలు పోగొట్టుకున్నారని చెప్పారు. ప్రతి ఏటా దళిత మహిళలపై 5 వేలకు పైగా దాడులు దౌర్జన్యాలు కొనసాగుతున్నాయన్నారు. దళితులు పేదలకు హక్కులు కల్పించిన భారత రాజ్యాంగాన్ని రద్దుచేసి తిరిగి మనువాద రాజ్యాంగానికి పురుడు పోసే కుట్ర బిజెపి ప్రభుత్వం చేస్తుందన్నారు. ప్రజా సంఘులే లేకుంటే ఇంకా ఎన్ని దాడులు జరిగేవొ అని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు. బుగ్గప్ప,ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య,కేవీపీఎస్ జిల్లా నాయకులు గుమ్మడి రత్నం, ఎంఎస్పి జిల్లా ఉపాధ్యక్షుడు పి నర్సింలు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బురుగుదొడ్డి చంద్రయ్య,తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి తాండూర్ ఇంచార్జ్ సాదిక్,వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, కేవీపీస్ నాయకులు పిట్ల నర్సిములు, ఎన్ నర్సింలు, బలరాం, రాజు, వెంకటయ్య,చంద్రమ్మ,బాల్ రాజ్,భాస్కర్,నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# టేకులపల్లిలో రేషన్ కార్డుల పంపిణీ




**మోమిన్‌పేట్, అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి) :** మోమిన్‌పేట్ మండల పరిధిలోని టేకులపల్లి గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో భాగంగా అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామ జిపిఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రేషన్ కార్డు పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

రేషన్ కార్డు ద్వారా ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులు పొందడంతో పాటు, అర్హతను బట్టి వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. అర్హులైన కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో మోమిన్‌పేట్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కే. మహేందర్ చారి, మోమిన్‌పేట్ సొసైటీ డైరెక్టర్ మన్నె వెంకటేశం, శ్రీకాంత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ భూములను ఆక్రమిస్తూ అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదు







– రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

– చింతల్‌మెట్ లోని వీరభద్ర స్వామి ఆలయంలో అక్రమ నిర్మాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, అక్టోబర్ 05 (ప్రజా జ్యోతి) :** దేవాలయ భూములను ఆక్రమిస్తూ అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం చింతల్‌మెట్‌లోని శ్రీ ఆస్థాన వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సోమవారం స్వయంగా పరిశీలించారు. ఆలయ పరిధిలో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో రెవెన్యూ, జిహెచ్‌ఎంసి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాలయ భూములను, ఆస్తులను ఆక్రమిస్తూ అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.ఆలయ పరిధిలో జరిగిన ఈ అక్రమ కట్టడాలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి, వాటిని నిలువరించడంతో పాటు బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆలయ పవిత్రతను, దేవాదాయ ఆస్తులను కాపాడటం మనందరి బాధ్యత అని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో రెవెన్యూ, జిహెచ్‌ఎంసి అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మి,షాది ముభారక్ చెక్కుల పంపిణీ

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,అక్టోబర్ 5, (ప్రజాజ్యోతి) :** డాక్టర్ ఎ ఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉప్పల్ మండలానికి చెందిన 09 కల్యాణ లక్ష్మి, షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్కుల పంపిణీ కార్యాలయం పారదర్శకంగా జరగాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా లక్ష నూట పదహారు రూపాయలతో తులం బంగారం ఇవ్వాలి అని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో కాప్రాయం ఆర్ ఓ,ఎస్ ఏ మథీన్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అప్రాధికలాన్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**మోమిన్‌పేట్, అక్టోబర్ 5, ప్రజా జ్యోతి :** మోమిన్‌పేట్ మండల పరిధిలోని అప్రాధికలాన్ గ్రామంలో అర్హులైన గ్రామస్తులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ శంకరప్ప, సర్పంచ్ షౌకత్ అలీ, జూనియర్ అసిస్టెంట్ అలవేలు, మాజీ సర్పంచ్ అనంతయ్య గ్రామస్తులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రేషన్ సదుపాయాలు మరింత సులభంగా పొందేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పొన్నం తరుణ్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



**ఉప్పల్,అక్టోబర్ 5, ప్రజాజ్యోతి :** యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం తరుణ్ గౌడ్ ఆ దేవుడి ఆశీస్సులతో ఆయురారో గ్యాలతో, సుఖ సంతోషంగా ఉం డాలని కోరుకుంటూ భవిష్యత్తులో మరింత రాజకీయ ఉన్నతన్ని సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి.

## శంషాబాద్ విమానాశ్రయానికి సీఐఐ నేషనల్ అవార్డ్స్

2026లో వరుసగా ఎనిమిదో ఏడాది 'నేషనల్ ఎనర్జీ లీడర్'గా శంషాబాద్ విమానాశ్రయం




**రాజేంద్రనగర్, అక్టోబర్ 05 (ప్రజా జ్యోతి) :** జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ కు 27వ సీఐఐ నేషనల్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ 2026లో వరుసగా ఎనిమిదో ఏడాది ప్రతిష్ఠాత్మక 'నేషనల్ ఎనర్జీ లీడర్' అవార్డు లభించింది. అలాగే, వరుసగా పదో ఏడాది 'ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్' గా కూడా గుర్తింపు పొందింది. ఎనర్జీ మేనేజ్‌మెంట్ మరియు ఎనర్జీ కన్జర్వేషన్‌పై విమానాశ్రయం కొనసాగిస్తున్న నిరంతర దృష్టికి ఈ గుర్తింపులు మరింత బలాన్ని చేకూర్చాయి.

సీఐఐ నేషనల్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ అనేది ఎనర్జీ ఎఫిషియెన్సీ, ఎనర్జీ మేనేజ్‌మెంట్ మరియు సస్టైయినబిలిటీ రంగాల్లో అత్యుత్తమ పనితీరును గుర్తించే భారతదేశంలోని ప్రముఖ వేదికల్లో ఒకటి. ఎనర్జీ పెర్ఫార్మెన్స్‌ను మెరుగుపరచడం, ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించడం మరియు సస్టైయినబుల్ ప్రాక్టీసెస్‌ను అవలంబించడంలో కొలిచే స్థాయిలో పురోగతి, ఆవిష్కరణలు మరియు నిబద్ధతను ప్రదర్శించే సంస్థలకు ఈ అవార్డులు అందజేస్తారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 700కు పైగా కంపెనీలు పాల్గొనగా, అవార్డుల కార్యక్రమం 16--18 సెప్టెంబర్ 2026 మధ్య హైదరాబాద్‌లో నిర్వహించబడింది. శంషాబాద్ విమానాశ్రయం తన కార్యకలాపాల్లో ఎనర్జీ ఎఫిషియెన్సీ మరియు సస్టైయినబిలిటీని సమగ్రంగా అనుసంధానించడంపై నిరంతరం దృష్టి సారిస్తోంది. ఇన్నోవేటివ్ టెక్నాలజీస్, ఎనర్జీ కన్జర్వేషన్ చర్యలు, రెన్యూవబుల్ ఎనర్జీ మరియు ఎఫిషియెంట్ ఆపరేషనల్ ప్రాక్టీసెస్‌ను అవలంబించడం ద్వారా విమానాశ్రయం ఎనర్జీ కన్జంప్షన్‌ను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గించేందుకు కృషి చేస్తోంది. ఈ చర్యలు ఎనర్జీ పెర్ఫార్మెన్స్‌లో నిరంతర మెరుగుదలకు దోహదపడటంతో పాటు, ఆర్జీఐఏను బాధ్యతాయుతమైన మరియు సస్టైయినబుల్ ఎయిర్‌పోర్ట్‌గా మరింత బలోపేతం చేశాయి.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సీఈఓ కథీర్ కథీరవన్ మాట్లాడుతూ.. సస్టైయినబిలిటీ అనేది మా కార్యకలాపాల విధానంలో అంతర్భాగం. బాధ్యతాయుతమైన అభివృద్ధి మరియు సీమ్‌లెస్ ప్యాసింజర్ ఎక్స్‌పీరియన్స్ రెండూ సమాంతరంగా సాగాలనే నమ్మకంతో ఎనర్జీ ఎఫిషియెన్సీపై మా నిబద్ధత కొనసాగుతోంది. గత కొన్నేళ్లుగా, రిసోర్స్ కన్జంప్షన్‌ను ఆప్టిమైజ్ చేయడంతో పాటు విమానాశ్రయం అంతటా ఎఫిషియెన్సీని మెరుగుపరిచేందుకు ఎనర్జీ ఎఫిషియెంట్ టెక్నాలజీస్, రెన్యూవబుల్ ఎనర్జీ మరియు స్మార్టర్ ఆపరేషనల్ ప్రాక్టీసెస్‌లో నిరంతరం పెట్టుబడులు పెడుతున్నాం. మా విజన్ సమర్థవంతమైన, రెసిలియెంట్ మరియు సస్టైయినబుల్ ఎయిర్‌పోర్ట్ ఎకోసిస్టమ్‌ను నిర్మించడంతో పాటు, మా ప్రయాణికులకు కంఫర్టబుల్ మరియు సీమ్‌లెస్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించడం. వరుసగా ఎనిమిదో ఏడాది 'నేషనల్ ఎనర్జీ లీడర్'గా, వరుసగా పదో ఏడాది 'ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్'గా కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నుంచి గుర్తింపు పొందడం మా సిబ్బంది మరియు భాగస్వాముల సమష్టి కృషికి నిదర్శనం. ఈ గుర్తింపులు సస్టైయినబుల్ ఎయిర్‌పోర్ట్ ఆపరేషన్స్‌లో మరింత ఇన్నోవేషన్‌కు, అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పేందుకు మాకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని అన్నారు.

# ప్రజావాణికి 145 దరఖాస్తులు

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 5( ప్రజాజ్యోతి ):
పాత కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 145 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అర్జీదారుల నుండి దరఖాస్తులు



స్వీకరించారు. ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో కలెక్టర్ తో పాటు అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వచ్చే వారం నుండి నూతన కలెక్టరేట్ మీటింగ్ హాల్ లో నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే సోమవారం నుండి నూతన కలెక్టరేట్ సమావేశ మందిరం పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని, ప్రజావాణి కార్యక్రమం అక్కడే నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## క్రీడల్లో సత్తా చాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

★ జిల్లా స్థాయికి ఒకరు.. జోనల్స్‌కు ముగ్గురు
★ అభినందించిన ప్రిన్సిపాల్

కొడిమ్యాల,అక్టోబర్ 05,(ప్రజాజ్యోతి):
మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటారు.కళాశాలకు చెందిన దుబ్బాక రిశ్వంత్ నెట్ బాల్‌లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యాడు. సెప్టెంబర్ 30న మల్యాల మండలం వాగ్దేవి స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన పోటీల్లో రిశ్వంత్ ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు,అదేవిధంగా అండర్–17 విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి ఉమ్మడి కరీంనగర్ జోనల్స్ మీట్‌కు కబడ్డీలో



విశ్వంత్, వాలీబాల్‌లో సురేష్, ఖోఖోలో లక్ష్మణ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గోపాల్ తెలిపారు.ఈ సందర్భంగా రిశ్వంత్‌ను ప్రిన్సిపాల్ గోపాల్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి బి.భాస్కర్, క్లాస్ టీచర్ చెలిమల జయపాల్‌రెడ్డి, గ్రూప్ ఇన్‌చార్జి చెట్టె నర్సయ్య అభినందించారు.

## పేదల పక్షాన నిలిచిన ప్రజా నాయకుడు గడ్డం వెంకటస్వామి 'కాకా'

భీమారం , అక్టోబర్ 5:(ప్రజాజ్యోతి )
మహానేత గడ్డం వెంకటస్వామి 'కాకా' 97వ జయంతి సందర్భంగా గోవిందారంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నెల్లుట్ల ప్రభాకర్ మాట్లాడుతూ పేదలు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వెంకటస్వామి జీవితాంతం కృషి చేశారని అన్నారు. ఎంపీగా, కేంద్ర మంత్రిగా పనిచేసినా సామాన్య ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. పేదలకు గృహ వసతి, విద్య, కార్మికుల సంక్షేమం కోసం విశేష కృషి చేశారని పేర్కొన్నారు. కాకా సేవలు, ప్రజా సంక్షేమం కోసం చేసిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లూరి ఉమారాణి దేవయ్య, ఉప సర్పంచ్ బింగి స్వామి, వార్డు సభ్యులు గుమ్మడి మధు, బియ్య సత్తమ్మ, తోగారి శకుంతల, అంబేద్కర్ సంఘం నాయకులు నెల్లుట్ల లింగయ్య, పల్లటి రాజు, రాగుల రాజం, అశోక్, గంధం భూచి గంగారాం, భూమేష్, గన్నరపు గంగాధర్, పల్లటి రాకేష్, బిటుకు రవితేజ, తోగారి నవదీప్ తదితరులు పాల్గొన్నారు.

## పండుగ వేళ.. బంగారం భద్రం

ఎస్సై నరేష్ కుమార్




కొడిమ్యాల,అక్టోబర్ 05,(ప్రజాజ్యోతి):
దసరా పండుగ సందర్భంగా మహిళలు పుట్టింటికి వెళ్లే సమయంలో బంగారు ఆభరణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నరేష్ కుమార్ సూచించారు. చుట్టుపక్కల మండలాలు, జిల్లాల్లో బంగారు ఆభరణాల చోరీలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఇంట్లో ఆభరణాలు ఉంటే వాటిని సురక్షితంగా భద్రపరచుకోవాలని, ఇంటికి తాళం వేసి వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్సై సూచించారు.

## ప్రజావాణికి అనూహ్య స్పందన

ఆరు అర్జీలు.. సమస్యల పరిష్కారానికి హామీ

ఎండపల్లి, అక్టోబరు 5, ప్రజాజ్యోతి:
ప్రజా సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఎండపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఆరు అర్జీలు అందాయి. ఎంపీడీవో డి.కృపాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.అందిన అర్జీల్లో మూడు మండల ప్రజా పరిషత్‌కు సంబంధించినవి కాగా, రెండు తహశీల్దార్ కార్యాలయానికి, మరో అర్జీ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించినది. అర్జీలను పరిశీలించి ఆయా శాఖల పరిధిలోని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీడీవో అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే అర్జీలను కేవలం స్వీకరించడానికే పరిమితం కాకుండా, నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ,వివిధ శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని,ఎంపీడీవో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.అనిల్‌కుమార్ అలాగే పలువురు మండలస్థాయి అధికారులు,తదితరులు పాల్గొన్నారు.




# పెండింగ్ నోటీసుల హియరింగ్ త్వరగా పూర్తి చేయండి

**100 శాతం ప్రక్రియ పూర్తయ్యేలా మరింత దృష్టి సారించాలి**
**నోటీసులపై తదుపరి చర్యలు ఆలస్యం కాకుండా చూడాలి..**
**బిసి సంక్షేమ శాఖ కమిషనర్, ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాల మాయా దేవి**

కరీంనగర్ బ్యూరో,అక్టోబర్ 5(ప్రజాజ్యోతి ):
కరీంనగర్ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న నోటీసుల హియరింగ్‌ను నిర్ణీత సమయంలోగా త్వరగా పూర్తి చేయాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, బీసీ సంక్షేమ శాఖ




కమిషనర్ బాల మాయా దేవి సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నోటీసులపై తదుపరి చర్యలు ఎలాంటి జాప్యం లేకుండా చేపట్టాలని ఆదేశించారు.
సోమవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, డి. శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో బాల మాయా దేవి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారీగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు.

**జిల్లా కలెక్టర్, యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు**

కరీంనగర్ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పక్కా ప్రణాళికతో ముందుకు తీసుకెళ్తున్న జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, జిల్లా యంత్రాంగాన్ని బాల మాయా దేవి ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేసి 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. జిల్లాలో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఆకట్టుకుంది. కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల వారీగా ప్రక్రియ పురోగతి, పెండింగ్ అంశాలను వివరించారు. మిగిలిన ప్రక్రియను కూడా త్వరగా పూర్తి చేసేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

**పెండింగ్ నోటీసులపై ప్రత్యేక దృష్టి**

ఎస్ఐఆర్‌లో భాగంగా నోటీసులు అందుకున్నప్పటికీ నిర్ణీత సమయంలో హియరింగ్‌కు హాజరుకాని ఓటర్ల విషయంలో బీఎల్ఓలు మరోసారి వారి ఇళ్లకు వెళ్లాలని బాల మాయా దేవి సూచించారు. వారికి నోటీసులు అందించి, అవసరమైన వివరాలు, ధ్రువీకరణ పత్రాలను సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. నోటీసులపై తదుపరి చర్యలు ఆలస్యం కాకుండా క్షేత్రస్థాయిలో ఈఆర్వోలు, ఏఈఆర్వోలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఓటర్లకు అందించిన ప్రతి నోటీసుకు సంబంధించిన వివరాలను పక్కాగా రికార్డు చేసి, ఫైలింగ్ నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విచారణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని తెలిపారు.

**అర్హత కలిగిన ప్రతి ఓటరుకు చోటు**



అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా ఓటర్ల జాబితాలో చోటు కోల్పోకుండా అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని బాల మాయా దేవి సూచించారు. నోటీసులు సంబంధిత ఓటర్లకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని ఈఆర్వోలు, ఏఈఆర్వోలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, ఓటర్లకు అవసరమైన పత్రాలు, నోటీసులకు సంబంధించిన అంశాలపై స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. ఫారం–6, ఫారం–7, ఫారం–8 ద్వారా స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిశీలించి పరిష్కరించాలని బాల మాయా దేవి ఆదేశించారు. ఎలాంటి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

**ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నాం**

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా యంత్రాంగం ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించిందని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా నిబంధనల ప్రకారం ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి నోటీసుల పరిశీలన, సంబంధిత పత్రాల స్వీకరణ, దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పూర్తి చేస్తున్నారని తెలిపారు. పెండింగ్ నోటీసుల పరిష్కారంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ, మిగిలిన ప్రక్రియను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.
ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, డి. శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో షర్మిల, తహసీల్దార్లు, అసిస్టెంట్ ఈఆర్వోలు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాకా ఆశయాల సాధనకు కృషి చేయాలి

ఎండపల్లి, అక్టోబరు 5(ప్రజా జ్యోతి):
పేదల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన దివంగత



మాజీ ఎంపీ కాకా వెంకటస్వామి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, మాజీ సింగిల్ విండో చైర్మన్ మద్దుల గోపాల్‌రెడ్డి అన్నారు. కాకా వెంకటస్వామి జయంతిని పురస్కరించుకుని సోమవారం ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజారాంపల్లిలోని మినీ క్యాంప్ కార్యాలయంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గోపాల్‌రెడ్డి కాకా వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.
కాకా వెంకటస్వామి పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడిన మహనీయుడని కొనియాడారు. ఆయన వారసులు సైతం అదే స్ఫూర్తితో విశాఖ ట్రస్ట్‌ను స్థాపించి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కాకా ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సేవలో కాంగ్రెస్ కార్యకర్తలు ముందుండాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గెల్లు



చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, కాంగ్రెస్ నాయకులు ఏలేటి చంద్రారెడ్డి,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంగ రమేష్, సర్పంచులు బాలసాని శారద,మల్లేశం, పడిదం లావణ్య,మొగిలి, కొంగల జగదీశ్వర్‌రెడ్డి, కోడిపెల్లి కొమురమ్మ,శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు,కార్యకర్తలు అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లోకి పెద్దకల్వల ఉపసర్పంచ్, వార్డు సభ్యులు

పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 5 ప్రజా జ్యోతి:
పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ లక్ష్మి తో పాటు పలువురు వార్డు సభ్యులు, వారి అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ



విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సమక్షంలో వారు కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారంగుల రమేష్, మాజీ ఉపసర్పంచ్ ఆర్కుటి సంతోష్‌తో పాటు వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహనీయుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ప్రతినిధి అక్టోబర్–05 ప్రజా జ్యోతి;
మహనీయుల స్ఫూర్తిని మనమంతా ఆదర్శంగా తీసుకోవాలని★జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష★ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన గడ్డం.వెంకట స్వామి (కాక) జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మారు మూల ప్రాంతంలో జన్మించినప్పటికీ జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగిన మహనీయులు గడ్డం.వెంకట స్వామి (కాక) కేంద్ర మంత్రిగా, వివిధ పదవులు చేపట్టి, ప్రజలకు సేవ చేశారని, అటువంటి మహనీయులు మన ప్రాంతంలో జన్మించడం మనందరికీ గర్వ కారణమని అన్నారు. జి.వెంకట స్వామి అందించిన స్ఫూర్తితో మనందరం పని చేయాలని, విధులు నిర్వహించే సమయంలో అట్టడుగు వర్గాల వారికి మన వంతు సహకారం అందేలా చూడాలని కలెక్టర్ సూచించారు. మన ప్రాంతంలోని పేదలకు వెంకటస్వామి అనేక సేవలు అందించారని, ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర స్థాయి ప్రభుత్వాలలో కీలక పాత్ర పోషించి, పేదల అభ్యున్నతి కోసం, తెలంగాణ రాష్ట్రం కోసం నిరంతరం తపించి పని చేశారని, తెలంగాణ సమాజం పడే బాధలను అర్థం చేసుకున్నారని, ప్రజల కష్టాల నివారణకు కృషి చేశారని అన్నారు. కోల్



బెల్ట్ ఏరియాలో కార్మికుల గుండెల్లో చిరస్థాయి స్థానం పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్, సిపిఓ రవీందర్, ఇంటర్మీడియట్ అధికారిణి కల్పన, యువజన, క్రీడా శాఖ అధికారి సురేష్, కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

## కబడ్డీ స్టేట్ మీట్ పాల్గొన్న కేజీబీ విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):
ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్పూర్ కేజీబీవీ విద్యార్థులు ఐదుగురు కబడ్డీ స్టేట్ మీట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలవేములవాడక జరిగే పోటీలకు



ఎన్నికయ్యారు ఆడుతున్నారు .వారికి జిల్లా జె సి డి ఓ అధికారి పద్మజ,ఎస్ ఓ అజంతా పిఈటి శ్రీలత ఉపాధ్యాయులు విద్యార్థులు వారిని అభినందించారు. ఈ పోటీల్లో ప్రతిభను చాటాలని కోరారు

# ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

మహిళా సంఘాలకు రూ.6.94 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కు పంపిణీ: ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు

సుల్తానాబాద్, అక్టోబరు 5:( ప్రజా జ్యోతి):
మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సోమవారం సుల్తానాబాద్‌లోని యశోద నరహరి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం మహిళా సంఘాలకు రూ.6.94 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రూ.5 కోట్లతో ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు,



ఇందిరమ్మ బస్సులు, మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇటీవల భూపతిపూర్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో చైతన్య పెట్రోల్ పంపును ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా నాణ్యమైన ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మున్సిపల్ చైర్మన్, బిరుదు రాధాకృష్ణ వైస్ చైర్మన్, అంతటి పుష్పలత కమిషనర్, రమేష్ మార్కెట్ చైర్మన్, ప్రకాష్ రావు సింగిల్‌విండో చైర్మన్లు, చిలక సతీష్ కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉష మృతికి ఎమ్మెల్యే మట్టా రాగమయి నివాళి

● అనారోగ్యంతో అంగన్వాడి టీచర్ ఉష మృతి



**సత్తుపల్లి అక్టోబర్05(ప్రజా జ్యోతి)** సీనియర్ జర్నలిస్ట్ ఎస్.కే ఖాదర్ బాబా వారి సతీమణి ఉష అంగన్వాడి టీచర్ గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో హైదరాబాదులో ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. ఆదివారం రాత్రి అనారోగ్య కారణంగా ఆమె మృతి చెందడంతో, సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ వారి స్వగృహము రాజీవ్ కాలనీ కి వెళ్లి, ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆమె అనారోగ్యంగా ఉండగానే శాసన సభ్యురాలు హాస్పిటల్ కి వెళ్లి ఆమెను పరామర్శించి, అండగా నేనుంటాను అని ధైర్యం ఇచ్చినా దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధైర్యంగా ఉండాలని కుమారుడు రాహుల్, భర్తకు ఖాదర్ కు ధైర్యాన్ని అందించి, ఓదార్పునిచ్చారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు, మీడియా సభ్యులు ఉన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి అక్టోబర్05(ప్రజా జ్యోతి)** మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామానికి చెందిన కిలారి కేశవరావు కాంగ్రెస్ నాయకులు వారి మనవడు మొదటి పుట్టినరోజు వేడుకలను ఘనంగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మాట్టా రాగమయి దయానంద్ హాజరై చిన్నారి పుట్టినరోజు వేడుకలు సందర్భంగా, చిన్నారిని ఆశీర్వదించి,అక్షింతలు వేసి దీవించారు. నిండు నూరేళ్లు మంచి ఆరోగ్యం, అష్టైశ్వర్యాలతో, వర్ధిల్లాలని అభినందించారు. అదేవిధంగా గుడిపాడు రోడ్డు కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మువ్వా అశోక్ అనారోగ్యంతో బాధపడుతుంటే, ఆ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వారి స్వగృహానికి వెళ్లి, ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని పలు సూచనలు,సలహాలు అందజేశారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు, కిలారు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, బేతిని శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

### గంజాయి అక్రమ రవాణా కేసులో
# ముగ్గురు నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష

ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురు నిందితులకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ పుల్లాభట్ల పోగడ కృష్ణార్జున్ తీర్పు వెలువరించారు.మధిర టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2024 ఆగస్టు 2వ తేదిన ఒరిస్సా నుండి 2.5 కేజీల గంజాయి అక్రమ రవాణా చేస్తూ మధిర లో పట్టుబడిన ముగ్గురు నిందితులపై నమోదైన క్రైమ్ నంబర్ 133/2024 కేసులో ఎన్‌డీపీఎస్ చట్టం 1985లోని సెక్షన్ 8 సి రెడ్‌విత్ 20ఎ (ii) బి ప్రకారం విచారణ చేపట్టారు.ఈ కేసులో మధిరకు చెందిన కల్యాణపు వంశీ 20, తమ్మిశెట్టి కిరణ్ 19, రెంటపల్లి మహేష్ ఆనంద్ 20 నిందితులుగా ఉన్నారు.నిందితులపై నేరం రుజువు కావడంతో కోర్టు ముగ్గురికీ మూడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో ఒరిస్సా ప్రాంతానికి చెందిన నిందితుడు హంతాల్ మధు పరారీలో ఉన్నాడు.కేసు దర్యాప్తును ఇన్‌స్పెక్టర్ దోమల రమేష్, ఇన్‌స్పెక్టర్ డి. మధు నిర్వహించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. కోర్టు లైజన్ అధికారిగా ఎస్ఐ కె. శ్రీకాంత్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ నాగేశ్వరావు, అయాబ్ హోంగార్డ్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# ఏపీ క్లోరోక్విన్ విషాదంపై సుప్రీం సీరియస్

● హైకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తునకు ఆదేశం

● పోలవరం ఘటనపై నల్లపు మణిదీప్ నివేదికకు సుప్రీంకోర్టు ఆమోదం..పిల్‌గా నమోదు..!

● ఏడేళ్ల జమున మృతిపై సుప్రీం చీఫ్ జస్టిస్ ధర్మాసనం కీలక ఉత్తర్వులు..

● ఏపీలో 100 మంది చిన్నారులకు క్లోరోక్విన్ వికటింపు..సుప్రీం దృష్టికి తెలంగాణ పినపాక లాయర్ పోరాటం..

● క్లోరోక్విన్ కేసును ఏపీ హైకోర్టుకు బదిలీ చేసిన సుప్రీంకోర్టు.. నిరంతర పర్యవేక్షణకు ఆదేశం..






**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / పినపాక, అక్టోబర్ 5, ప్రజాజ్యోతి...**ఆంధ్రప్రదేశ్ లోని పోలవరం ఏజెన్సీలో క్లోరోక్విన్ మాత్రలు వికటించి 53 గ్రామాల్లో 100 మందికి పైగా గిరిజన చిన్నారులు ఆసుపత్రుల పాలవడం, ఏడేళ్ల బాలిక మాడివి జమున మృతి చెందిన విషాద ఘటనపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలకంగా స్పందించింది. మృతురాలి కుటుంబానికి ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదని, స్థానికంగా అత్యవసర వైద్య సదుపాయాలు లేకపోవడంతో చిన్నారుల ను తెలంగాణకు తరలించాల్సి వచ్చిందని తెలంగాణ హైకోర్టు న్యాయవాది పినపాకకు చెందిన నల్లపు మణిదీప్ సమర్పించిన నివేదికను సుప్రీంకోర్టు పరిగణన లోకి తీసుకుంది. ఈ నివేదిక ఆధారం గా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వం లోని త్రిసభ్య ధర్మాసనం డబ్ల్యూపీ సీరియల్ నెం 386/2026 కింద దీనిని ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్ ) గా నమోదు చేసి విచారణ చేపట్టింది.

**నల్లపు మణిదీప్ పోరాటం గిరిజనులకు న్యాయం..**
ఈ ఘటన సాధారణమైంది కాదని, గిరిజన చిన్నారుల ప్రాణాలకు సంబంధించిన అంశం కాబట్టి నిరంతర న్యాయ పర్యవేక్షణ అవసరమని ధర్మాసనం అభిప్రాయపడింది.అందులో భాగంగా ఈ కేసును ముఖ్యమైన కేసుగా పరిగణించి దర్యాప్తును ప్రత్యక్షంగా పర్యవేక్షించే బాధ్యతను ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ లాయర్, పినపాకకి చెందిన నల్లపు మణిదీప్ చేసిన పోరాటానికి సుప్రీం స్థాయిలో గుర్తింపు లభించడంతో గిరిజన కుటుంబాలకు న్యాయం జరిగే అవకాశం ఏర్పడిందని న్యాయవర్గాలు చెబుతున్నాయి.

**తెలంగాణ హైకోర్టులో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే పినపాక యువ న్యాయవాది గా నల్లపు మణిదీప్ కు మంచి గుర్తింపు లభించింది. ముఖ్యంగా గిరిజన, పేద ప్రజల హక్కుల కోసం అనేక పిల్ లు వేసి న్యాయం సాధించారు. న్యాయవాద వృత్తినే కాకుండా సామాజిక సేవను బాధ్యతగా తీసుకుని ముందుకు సాగుతున్నారు. ఏపీ పోలవరం ఏజెన్సీలో క్లోరోక్విన్ వికటించి 100 మంది చిన్నారులు ఆసుపత్రి పాలైన ఘటనలో ఆయన స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి వివరాలు సేకరించి సుప్రీంకోర్టుకు నివేదిక ఇవ్వడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. గిరిజన బాలిక జమున మృతికి పరిహారం ఇవ్వకపోవడం, వైద్య సదుపాయాల లేమిని ఆయన నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. దీంతో ఆయన నివేదికను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం స్వీకరించి పిల్ గా నమోదు గమనార్హం.**

# తల్లీబిడ్డల ఆరోగ్యమే సమాజానికి బలమైన పునాది

● సుబ్లేడులో ఘనంగా పోషణ మాసోత్సవం

● గర్భిణులకు సామూహిక సీమంతాలు.. ● 12 చీరలు అందజేసిన సర్పంచ్ స్వాతిరెడ్డి





**తిరుమలాయపాలెం, అక్టోబర్ 5, ప్రజా జ్యోతి:** తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణ, గర్భిణులు బాలింతల్లో పోషకాహారంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా సుబ్లేడు గ్రామపంచాయతీలో పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి, వారిని సన్మానించారు. సీమంతాల సందర్భంగా గ్రామ సర్పంచ్ స్వాతిరెడ్డి 12 మంది గర్భిణులకు చీరలను అందజేశారు. దీంతో కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో సాగింది.

**పోషకాహారంతోనే తల్లీబిడ్డల ఆరోగ్యం: సూపర్‌వైజర్ లక్ష్మి**
ఈ సందర్భంగా సూపర్‌వైజర్ లక్ష్మి మాట్లాడుతూ గర్భధారణ సమయంలో మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార ప్రాధాన్యాన్ని కుటుంబ సభ్యులు కూడా తెలియజేయాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తారని, అందువల్ల గర్భధారణ ప్రారంభ దశ నుంచే తల్లుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. పోషకాహారం, పరిశుభ్రత, వైద్యుల సూచనలు పాటించడం వంటి అంశాలపై గ్రామస్థుల్లో నిరంతరం అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

**వైద్య పరీక్షలను నిర్లక్ష్యం చేయొద్దు: డాక్టర్ వసుంధర**
పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వసుంధర మాట్లాడుతూ గర్భిణులు వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రక్తహీనతకు దూరంగా ఉండేందుకు వైద్యుల సూచన మేరకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవాలని సూచించారు.గర్భిణులు తీసుకునే ఆహారం తల్లి ఆరోగ్యంతో పాటు గర్భంలోని శిశువు ఎదుగుదలపై కూడా ప్రభావం చూపుతుందని తెలిపారు. సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు తగిన విశ్రాంతి తీసుకోవాలని, ఆరోగ్యానికి సంబంధించిన ఏ సమస్య ఎదురైనా వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు వైద్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

**గర్భిణులకు అండగా ఉంటాం: సర్పంచ్ స్వాతిరెడ్డి**
గ్రామ సర్పంచ్ స్వాతిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. పోషణ మాసోత్సవంలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గర్భిణులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 12 చీరలను అందజేసినట్లు తెలిపారు. గ్రామంలో మహిళలు, చిన్నారులకు సంబంధించిన ఆరోగ్య, పోషకాహార కార్యక్రమాలకు గ్రామపంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని సర్పంచ్ స్వాతిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు నిర్వహించే అవగాహన కార్యక్రమాలను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కనీల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, , ఆరోగ్య కార్యకర్త వినయ్‌కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పుష్పవతి, గాయత్రి, పద్మ, లలిత, దస్మా, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నెట్‌బాల్‌లో పిండిప్రోలు కళాశాల విద్యార్థినుల సత్తా

● జిల్లా అండర్-19 జట్టుకు ముగ్గురి ఎంపిక ● రాష్ట్రస్థాయి పోటీల్లో ఖమ్మం తరఫున ప్రాతినిధ్యం





**తిరుమలాయపాలెం, అక్టోబర్ 5 ప్రజా జ్యోతి:** క్రీడల్లో పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 4న నిర్వహించిన అండర్--19 నెట్‌బాల్ ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపికల్లో కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ప్రతిభ కనబరిచి ఖమ్మం జిల్లా అండర్--19 ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఏ. మహేశ్వరి, టి. సింధు, బి. నందిని జిల్లా జట్టులో చోటు సంపాదించి కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపికల్లో వివిధ కళాశాలలు, విద్యాసంస్థలకు చెందిన క్రీడాకారిణులు పాల్గొనగా, పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఆటలో చురుకుదనం, సమన్వయం, పట్టుదలతో రాణించి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ముగ్గురు విద్యార్థినులు ఒకేసారి జిల్లా జట్టుకు ఎంపిక కావడం పట్ల కళాశాల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.జిల్లా జట్టుకు ఎంపికైన ఏ. మహేశ్వరి, టి. సింధు, బి. నందిని వచ్చే నెలలో మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్--19 నెట్‌బాల్ పోటీల్లో ఖమ్మం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్రస్థాయిలో వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రతిభావంతులైన క్రీడాకారిణులతో పోటీపడే అవకాశం వారికి లభించనుంది.జిల్లా స్థాయిలో సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రస్థాయిలోనూ మరింత కష్టపడి సాధన చేయాలని కళాశాల అధ్యాపకులు విద్యార్థినులకు సూచించారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, చదువుతో పాటు క్రీడలకు కూడా సముచిత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**అభినందించిన కళాశాల అధ్యాపక బృందం**
జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి పి. నారాయణరావు, తెలుగు అధ్యాపకులు నరసింహారావు, అధ్యాపక బృందం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లోనూ ఎంతో ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం, శిక్షణ లభిస్తే వారు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించగలరని అన్నారు. కళాశాల విద్యార్థినులు జిల్లా జట్టుకు ఎంపిక కావడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా సమష్టి కృషితో రాణించి ఖమ్మం జిల్లాకు, పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థినులు మరింత పట్టుదలతో సాధన చేసి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికైన ముగ్గురు విద్యార్థినుల విజయంతో పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది.

# అర్ధరాత్రి గోవుల తరలింపుపై నిఘా ఏదీ?

● చీకటి మాటున గోవుల తరలింపుపై గ్రామస్థుల్లో అనుమానాలు

● నిబంధనల ప్రకారం రవాణా జరుగుతుందో లేదో తేల్చాలని డిమాండ్

● రాత్రివేళ వాహనాల తనిఖీలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి





**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 5, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలో అర్ధరాత్రి వేళ గోవులను వాహనాల్లో తరలిస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. పగటి వేళల్లో కాకుండా రాత్రి సమయంలో గోవులను తరలిస్తుండటంతో గ్రామస్థుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గోవుల రవాణాకు సంబంధించిన నిబంధనలు, అనుమతులు పాటిస్తున్నారా లేదా అనే విషయాలను సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. రాత్రి వేళల్లో గోవులను తరలిస్తున్న వాహనాలపై పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లోనూ రాత్రి సమయంలో తనిఖీలు నిర్వహిస్తే వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వస్తాయని వారు పేర్కొంటున్నారు. గోవులను తరలించే వాహనాలకు అవసరమైన అనుమతులు, పత్రాలు ఉన్నాయా? ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం రవాణా జరుగుతుందా? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. అక్రమ రవాణా జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో నిజమైన రైతులు పెంచుకుంటున్న గోవులు కూడా కొన్ని ప్రాంతాల్లో కనిపించకుండా పోతున్నాయని అక్కడక్కడ స్థానికులు చెబుతున్నారు. గోవుల అక్రమ తరలింపును అడ్డుకోవడంతో పాటు రైతుల పశువులకు భద్రత కల్పించేలా అధికారుల నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని వారు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా లేదా అనుమతులు లేకుండా గోవులను తరలిస్తున్నట్లు తేలితే బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో చట్టబద్ధంగా గోవుల రవాణా జరుగుతున్నట్లయితే ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసేలా అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. అర్ధరాత్రి వేళల్లో అనుమానాస్పదంగా ప్రయాణించే వాహనాలను తనిఖీ చేసి, అందులో తరలిస్తున్న గోవులకు సంబంధించిన పత్రాలను పరిశీలించాలని గ్రామస్థులు సూచిస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి రాత్రి వేళల్లో నిఘా పెంచడంతో పాటు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా రైతుల గోవులు కనిపించకుండా పోతున్నాయనే ఫిర్యాదులపై కూడా అధికారులు దృష్టి సారించి, గ్రామస్థాయిలో పశువుల రవాణాపై పర్యవేక్షణ పెంచాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన బెనోవాలెంట్ ప్రయోజనాలు

● రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.2 లక్షలకు.. డెత్ బెనోవాలెంట్ రూ.4.50 లక్షలకు పెంపు




**బూర్గంపహాడ్, అక్టోబర్ 05 (ప్రజా జ్యోతి):** ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ భద్రాచలంలో కాంట్రాక్ట్ కార్మికులకు రిటైర్మెంట్,డెత్ బెనోవాలెంట్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.గుర్తింపు సంఘం టీఎన్‌టీయూసీ,మిత్రపక్షాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కాంట్రాక్ట్ కార్మికులకు పెంచిన మొత్తాలతో కూడిన చెక్కులను అందజేశారు.కాంట్రాక్ట్ కార్మికుల కంట్రిబ్యూషన్‌తో నిర్వహిస్తున్న బెనోవాలెంట్ ఫండ్‌లో భాగంగా ఇప్పటివరకు రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.1.50 లక్షలు అందజేస్తుండగా,దీనిని రూ.2 లక్షలకు పెంచారు. అదేవిధంగా డెత్ బెనోవాలెంట్ ఫండ్‌ను ప్రస్తుతం ఉన్న రూ.4 లక్షల నుంచి రూ.4.50 లక్షలకు పెంచారు.కాంట్రాక్ట్ కార్మికుల బెనోవాలెంట్ ఫండ్ కమిటీ నిర్ణయం మేరకు పెంచిన మొత్తాలతో కూడిన చెక్కులను సంబంధిత కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.గుర్తింపు సంఘం అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్లు చాంద్ పాషా,వెంకట రామారావు,మురళి,సౌరబ్ ముఖర్జీ పాల్గొన్నారు. అలాగే బెనోవాలెంట్ ఫండ్ కమిటీ సభ్యులు పాకాలపాటి దుర్గాప్రసాద్,పీవీ చందు, గాదే రామ కోటిరెడ్డి,సముద్రాల అనిల్ కుమార్,గుర్తింపు సంఘ కార్యవర్గ సభ్యులు, కాంట్రాక్ట్ కార్మిక సంఘ నాయకులు నరేంద్ర, నిరంజన్, సోమిరెడ్డి, వెంకటరెడ్డి,సర్వేశ్వరరావు,సతీష్ తదితరులు పాల్గొన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బెనోవాలెంట్ ప్రయోజనాలను పెంచడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.రిటైర్మెంట్ సమయంలో,అలాగే అనుకోని పరిస్థితుల్లో కార్మికుల కుటుంబాలకు ఈ నిధులు ఆర్థికంగా కొంత భరోసా కల్పిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

# ఖమ్మం రెడ్‌క్రాస్ ఎన్నికల్లో కె ఎస్ ఎఫ్ ప్యానెల్ ప్రభంజనం

## 584 ఓట్లతో రికార్డు విజయం సాధించిన ప్రముఖ పిల్లల వైద్యులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్

ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి

ఖమ్మం జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పాలకవర్గ ఎన్నికల్లో 'ఖమ్మం సర్వీస్ ఫ్రంట్ ' ప్యానెల్ చారిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకుంది. వైరా రోడ్‌లోని టీటీడీసీ భవన్‌లో అత్యంత ఉత్సాహభరితమైన, ప్రజాస్వామ్య బద్ధమైన వాతావరణంలో జరిగిన ఈ ఎన్నికల్లో పోటీ చేసిన మొత్తం 15 మేనేజింగ్ కమిటీ స్థానాలనూ కె ఎస్ ఎఫ్ ప్యానెల్ అభ్యర్థులే దక్కించుకొని క్లీన్ స్వీప్ చేశారు.అత్యధిక ఓట్లతో అగ్రస్థానంలో డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్

ఈ ఎన్నికల్లో ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు, కూరపాటి చిల్డ్రన్స్ అండ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ రికార్డు స్థాయి మెజారిటీ సాధించారు.



రికార్డు పోలింగ్: పోటీ చేసిన మొత్తం 39 మంది అభ్యర్థుల్లో డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ 584 ఓట్లు సాధించి ఎన్నికల బరిలో ప్రథమ స్థానంలో నిలిచారు.

నమ్మకానికి ప్రతీక: సమాజంలో ఒక ప్రముఖ వైద్యుడిగా, నిరంతరం చిన్నారుల ఆరోగ్య రక్షణతో పాటు రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, పలు సామాజిక కార్యక్రమాల్లో (యువం ఫౌండేషన్ ద్వారా) చురుగ్గా పాల్గొంటున్న ఆయనకు సభ్యులు బ్రహ్మరథం పట్టారు.

తన అమోఘ విజయంపై డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ స్పందిస్తూ రెడ్‌క్రాస్ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ ఘన విజయం కేవలం ఒక వ్యక్తి విజయం కాదు మానవతా విలువలు, ప్రజాసేవ, రెడ్‌క్రాస్ సేవారంగంపై జిల్లా ప్రజలు, సభ్యులు ఉంచిన అపారమైన విశ్వాసానికి ప్రతీక.584 ఓట్లతో నన్ను అగ్రస్థానంలో నిలిపిన ప్రతి ఒక్కరికీ నా శిరస్సు వంచి ప్రణామాలు అర్పిస్తున్నాను. ఈ విజయం నాపై, మా కే ఎస్ ఎఫ్ ప్యానెల్‌పై బాధ్యతను మరింత పెంచింది.

రక్తనిధి సేవలు: జిల్లాలోని ఏ పేద,ఆపదలో ఉన్న బాధితుడికి రక్త కొరత రాకుండా ఉచిత, తక్షణ రక్త సరఫరాను విస్తృతం చేయడం.అనాథ,

పేద వర్గాలకు చేయూత: సమాజంలో వెనుకబడిన, అనాథలకు ఉచిత వైద్య సహాయం నిత్యావసర మద్దతు అందించడం.

రెడ్‌క్రాస్ విస్తరణ: ఖమ్మం జిల్లాలోని మూలమూలలకూ రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలను తీసుకెళ్లి, మరింత మంది యువతను సేవా దృక్పథంలో భాగస్వాములను చేయడం. గెలుపొందిన కె ఎస్ ఎఫ్ ప్యానెల్ విజేతలకు జిల్లాలోని పలువురు ప్రముఖులు, వైద్య లోకం, సామాజిక వేత్తలు శుభాకాంక్షలు తెలిపారు.

# బ్యాంక్ అధికారులమంటూ సైబర్ మోసాలు- నిందితుడి అరెస్ట్

**క్రెడిట్ కార్డు వివరాలు, ఓటి పి లు ఆదిలాబాద్ బాధితు ని వద్ద రూ.73,279 మోసం**

**మహారాష్ట్ర, గోవా, తెలంగా ణ రాష్ట్రాలలో దాదాపు 15 0 ఫిర్యాదులు నమోదు**

**మూడు రాష్ట్రాల బాధితుల వద్ద 95 లక్షల వరకుమోసం**

**మహారాష్ట్రలో నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఆది లాబాద్ 1 టౌన్ పోలీసులు**

**నిందితుడి వద్ద నుంచి రెం డు సెల్‌ఫోన్లు, కారు స్వాధీ నం**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 5, (ప్రజా జ్యోతి):

చైతన్య ప్రమోద్ కుటె (25), S/o ప్రమోద్ కుటె, డబ్కి రో డ్డు, గురుకృప ప్రొవిజన్ స మీపంలో, మెహరేనగర్,భూ రడ్ పోస్ట్, అకోలా గ్రామీణ, అకోలా జిల్లా, మహారాష్ట్ర. (ప్రస్తుతం పింప్రి- చించ్వా డ్, పూణే, మహారాష్ట్ర అనే నిందితున్ని అరెస్టు చేసి రి మాండ్ కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహజన్ తెలి పారు.బ్యాంక్ అధికారుల మంటూ ప్రజలకు ఫోన్ చే సి, వారి క్రెడిట్ కార్డులు, బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన వివరాలు, ఓటిపి లు సేకరించి డబ్బులు కాజే స్తున్న సైబర్ నేరస్థుడిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అ ఖిల్ మహాజన్ ఐపిఎస్ ప త్రిక సమావేశంలో వివరాల ను వెల్లడించారు. ఆదిలా బాద్ బ్రాహ్మణవాడకు చెం దిన బాధితుడు ప్రఫుల్ పా టిల్కు 2026 జూలై నెలలో బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తు న్నామని చెప్పి, అతని క్రెడి ట్ కార్డును యాక్టివేట్ చేస్తా మని నమ్మించి సైబర్ మో సా నికి పాల్పడి రూ.73,27 9/- కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదిలాబా ద్ 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం.633/2026 న మోదు చేసి దర్యాప్తు చేప ట్టారు.దర్యాప్తులో భాగంగా ఎన్ సి




ఆర్ పి పోర్టల్ ద్వా రా లభించిన సాంకేతిక ఆ ధారాల ఆధారంగా నిందితు డిని గుర్తించారు. పై అధికా రుల ఆదేశాల మేరకు ఆది లాబాద్ 1 టౌన్ ఆధ్వర్యం లోని పోలీసు బృందం మ హారాష్ట్రకు వెళ్లి నిందితుడి ని అదుపులోకి తీసుకుని ఆ దిలాబాద్‌కు తీసుకువచ్చిం ది.పోలీసుల విచారణలో నిందితుడు తాను గతంలో యాక్సిస్ బ్యాంక్‌లో పని చే సిన సమయంలో కస్టమర్ల తో మాట్లాడిన అనుభవాన్ని ఉపయోగించుకుని, బ్యాంక్ కస్టమర్లకు సంబంధించిన మొబైల్ నంబర్లను సేకరించినట్లు తెలిపాడు. అనంతరం వివిధ సిమ్ కార్డులు, మొ బైల్ ఫోన్లు ఉపయోగిస్తూ బ్యాంక్ అధికారులమంటూ కస్టమర్లకు ఫోన్ చేసి, వారి క్రెడిట్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటిపి లను తె లుసుకుని డబ్బులను వివి ధ యుపిఐ, అమెజాన్ ఖాతాలకు బదిలీ చేసుకున్నట్లు తెలిపాడు. నిందితడు తె లంగాణ, మహారాష్ట్ర,గోవా రాష్ట్రాలలో దాదాపు 150 మంది బాధితుల వద్ద రూ 95,33,651/- నగదు నష్టపోయినట్లు జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు లను నమోదు అయినట్లు తెలిపారు.అదేవిధంగా 23. 07.2026న బాధితుడికి ఎచ్ డి ఎఫ్ సి బ్యాంక్ నుం చి మాట్లాడుతున్నామని చె ప్పి, క్రెడిట్ కార్డు యాక్టివేష న్ పేరుతో నమ్మించి, ఓటిపిలను తెలుసుకుని ఐదు లా వాదేవీల ద్వారా మొత్తం రూ.73,279/- బదిలీ చేసుకున్నట్లు విచారణలో తెలిపి నట్లు పోలీసులు వెల్లడించా రు.నిందితుడు మోసాలకు ఉపయోగించినట్లు తెలిపిన మొబైల్ ఫోన్‌ను ధ్వంసం చేసినట్లు కూడా విచారణ లో వెల్లడించాడు. అలాగే వివిధ మొబైల్ నంబర్లతో సిమ్ కార్డులు మార్చుతూ, మొబైల్ ఫోన్లు మార్చుతూ సైబర్ మోసాలకు పాల్పడి నట్లు తెలిపాడు.

**నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నవి:**

టొయోట హైరైడర్ కారు – రి. నం. ఎంఎచ్ -14- ఎంసి -1167, ఏపుల్ ఐ ఫోన్ 13 మొబైల్ ఫోన్, మోటో జి 67 మొబైల్ ఫోన్,వివిధ సిమ్ కార్డులు స్వాదీనం చేసుకు న్నట్లు తెలిపారు. నిందితుడి పై చట్టపరమైన చర్యలు కొ నసాగుతున్నాయని ఎస్పీ తెలిపారు. ప్రజలు బ్యాంక్ అధికారులు, పోలీసు అధి కారులు లేదా ఇతర సంస్థల పేరుతో వచ్చే అనుమానా స్పద ఫోన్ కాల్స్‌ను నమ్మవ ద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటిపి, పిన్,సివివి, క్రెడిట్ /డె బిట్ కార్డు వివరాలు ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు.సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించా రు.కేసు లో కీలకంగా వ్యవ హరించిన సిబ్బంది ప్రతి ఒక్కరికి జిల్లా ఎస్పీ ప్రత్యేకం గా నగదు రివార్డులను అం దజేసి అభినందించారు.ఈ కార్యక్రమం లో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్. జీవన్ రెడ్డి, ఆ దిలాబాద్ 1 టౌన్ ఇన్స్పెక్టర్ బి.సునీల్ కుమార్, ఎస్ఐ లు గోపికృష్ణ, అశోక్, పోలీ సు సిబ్బంది, సైబర్ క్రైమ్ కీలకంగా వ్యవహరించారు.

# యెమెన్ అంతర్యుద్ధం ఉద్ధృతం

మొదటిపేజీ తరువాయి..

స్థానిక ప్రభుత్వానికి కేంద్రంగా ఉన్న ఏడెన్‌ను, తైజ్‌ను కలిపే కీలక రహదారిపై తుర్బా ఉంది. తైజ్‌ను హౌతీల నుంచి రక్షించే ప్రభుత్వ బలగాలకు కీలక స్థావరంగా ఉంటూ వచ్చింది. అంతకుముందు తైజ్ శివార్లలోని అనేక ప్రాంతాలను హౌతీలు స్వాధీనం చేసుకున్నారు. గత నెలఎర్ర సముద్రంలోని పోర్టు సిటీ మోఖా, బాబ్ ఎల్ మండెబ్ జల సంధిని తమ నియంత్రణలోకి తెచ్చుకున్న విషయం తెలిసిందే. మరోవైపు, హూతీల నియంత్రణలో ఉన్న భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా 'డాన్ ఆఫ్ యెమెన్' రిట స్థానిక ప్రభుత్వం భారీ సైనిక చర్యను చేపట్టింది. ఈ క్రమంలోనేబాబ్ ఎల్ మండెబ్ జలసంధిపై తాము పైచేయి సాధించామని తెలిపింది. తీరప్రాంత పట్టణం ధుబాబ్, దాని సమీపంలోని విమానాశ్రయాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. భారీ నిరసనల కారణంగా మూడు దశాబ్దాలకుపైగా సాగిన అలీ అబ్దుల్లా సలేహ్ పాలనకు 2012లో తెరపడింది. ఆధునిక యెమెన్ చరిత్రలో అత్యంత కీలకమైన రాజకీయ నేతగా సలేహ్ గుర్తింపు పొందారు. 1978 నుంచి 1990 వరకు ఉత్తర యెమెన్ అధ్యక్షుడిగా.. ఆ తర్వాత 2012లో రాజీనామా చేసే వరకు ఉమ్మడి యెమెన్ మొదటి అధ్యక్షుడిగా సేవలందించారు. సమర్థవంతమైన రాజకీయ వ్యూహ చతురతతో గుర్తింపు పొందిన ఆయన.. తన పాలనను 'పాముల పడగలపై డ్యాన్స్ చేయడం'తో పోల్చేవారు. సంక్లిష్టమైన అధికార వ్యవస్థలు, వ్యూహాత్మక పొత్తుల ద్వారా ఆయన మూడు దశాబ్దాలకు పైగా అధికారాన్ని నిలబెట్టుకున్నారు. ఉత్తర, దక్షిణ యెమెన్‌లను విలీనం చేసి 'రిపబ్లిక్ ఆఫ్ యెమెన్' ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించారు. సనా రాజధానిగా, అడెన్ ఆర్థిక రాజధానిగా ఏర్పడిన యెమెన్ రిపబ్లిక్‌కు మొదటి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 1994లో జరిగిన స్వల్పకాలిక అంతర్యుద్ధంలో దక్షిణ ప్రాంత వేర్పాటువాదుల ప్రయత్నాన్ని తిప్పికొట్టి, సనా కేంద్రంగా తన కేంద్రీకృత అధికారాన్ని బలపరుచుకున్నారు. 2004--2010 ఉత్తర యెమెన్‌లోని సైదీ షియా తిరుగుబాటుదారులైన 'హూతీ'లపై వరుసగా అనేక సైనిక చర్యలను చేపట్టారు. కానీ, 2011లో 'అరబ్ స్ప్రింగ్' ఉద్యమంతో యెమెన్‌లో తిరుగుబాటు మొదలైంది. సలేహ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. దీంతో 2012 ప్రారంభంలో ఉపాధ్యక్షుడు అబ్దుల్ మన్సూర్ హాదీకి అధికారాన్ని బదిలీ చేసి, ఆయన పదవి నుంచి తప్పుకున్నారు. దీంతో దేశంలో ఏర్పడిన రాజకీయ అస్థిరతను ఆసరాగా చేసుకుని ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారులు పుంజుకున్నారు. 2014--2015 మధ్య అనూహ్యంగా హూతీలు, అబ్దుల్లా సలేహ్ మధ్య వ్యూహాత్మక పొత్తు కుదిరింది. ఈ కూటమి మన్సూర్ హాదీ ప్రభుత్వం నుంచి సనా నగరాన్ని స్వాధీనం చేసుకుంది. చివరకు హాదీని అధికారంలోంచి దింపేశారు. అయితే, హౌతీలతో సలేహ్ కటీఫ్ చెప్పి సౌదీ అరేబియాతో ఒప్పందం చేసుకున్నారు. సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ కూటమి.. యెమెన్ ప్రభుత్వాన్ని పునరుద్ధరించడానికి, దక్షిణ సరిహద్దులో ఇరాన్ ప్రభావాన్ని నిరోధించడానికి 2015 మార్చిలో వైమానిక, భూతల దాడులను ప్రారంభించింది. దీంతో ఆగ్రహించిన హౌతీలు.. 2017లో సనాలోని సలేహ్ ఇంటిని చుట్టుముట్టి హతమార్చాయి.హూతీలు, ప్రభుత్వం మధ్య ప్రత్యక్ష పోరాటంతో పాటు వ్యాధులు, ఆకలి కారణంగా 3,77,000 మందికి పైగా మరణించారు. ఇది ప్రపంచంలోని అత్యంత ఘోరమైన మానవతా విపత్తులలో ఒకటిగా నిలిచింది. అలాగే, మరో 45 లక్షల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులుగా మిగిలిపోయారు. ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు ధ్వంసం కావడం వల్ల భారీ స్థాయిలో కలరా వ్యాప్తి చెందింది.

## భారత్ కీలక శక్తిగా
# ఎదుగుతోంది

మొదటిపేజీ తరువాయి..

ఆహ్వానం మేరకు 3 రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఢిల్లీ విచ్చేసిన ఆయన, ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం ఉమ్మడి పత్రికా ప్రకటన



విడుదల చేశారు. ప్రపంచం ఒకవైపు రాజకీయంగా, భౌగోళికంగా విభజనకు గురవుతున్న తరుణంలో భారత్ వంటి దేశాలతో భాగస్వామ్యం అత్యంత కీలకం అని మాట్లాడారు. ఏ అంతర్జాతీయ వేదిక అయినా భారత్ చర్చలు, సహకారానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని కూడా తాము అనుసరిస్తామని తెలిపారు. గ్లోబల్ టెక్నాలజీ చర్చల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలోనూ భారత్ అసాధారణ నాయకత్వ పటిమను ప్రదర్శించిందని పార్మెలిన్ అన్నారు. ఈ క్రమంలోనే 2026 ఫిబ్రవరిలో న్యూఢిల్లీ వేదికగా భారత్ నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026' గొప్ప విజయాన్ని సాధించిందని ప్రశంసలు కురిపించారు. దీనికి 88 దేశాలు, ఇతర అంతర్జాతీయ సంస్థలు ఆమోదించాయని ఆయన గుర్తు చేశారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానం ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సాంకేతిక ప్రయోజనాలు కొన్ని దేశాలు, సంస్థలకే పరిమితం కాకుండా ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు చేరేలా భాగస్వామ్యం కల్పించడానికి, ఏఐ పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడానికి స్విట్జర్లాండ్ కృషి చేస్తుందన్నారు. 2027 జూన్‌లో జెనీవాలో స్విట్జర్లాండ్ నిర్వహించబోయే తదుపరి గ్లోబల్ ఏఐ సమిట్‌కు భారత్‌ను కీలక భాగస్వామిగా పరిగణిస్తున్నట్లు పార్మెలిన్ పేర్కొన్నారు. ఇక్కడ ఆమోదించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్' మార్గదర్శకాల ఆధారంగానే తాము కూడా ముందుకు సాగుతామని వెల్లడించారు. భారత్-స్విట్జర్లాండ్ ఆర్థిక సంబంధాల్లో ఇండియా-యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ మధ్య జరిగిన (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) కీలకంగా మారుతోంది. భారత్, స్విస్, నార్వే, ఐస్‌లాండ్, లిక్టెన్‌స్టెయిన్‌లతో కూడిన మధ్య కుదిరిన ఈ డీల్ 2025, అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వచ్చింది. ఈ డీల్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, దీని అమలు తీరుపై తాము చాలా సంతోషంగా ఉన్నామని పార్మెలిన్ వెల్లడించారు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చాక స్విస్ కంపెనీల నుంచి ఆసక్తి బాగా పెరిగిందన్నారు. రానున్న సంవత్సరాల్లో భారత్- స్విట్జర్లాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడ ఒకవైపు స్విస్‌కు వినూత్న సాంకేతికతలు, పెట్టుబడి సామర్థ్యం, అంతర్జాతీయ కంపెనీలు ఉండగా, భారత్‌కు భారీ మార్కెట్, అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ఉన్నాయని ఆయన వివరించారు. ఇలా రెండు వైపులా బలబలాలు ఇరు దేశాలకు మరింత ప్రయోజనం చేకూర్చే అవకాశాల్ని కల్పిస్తున్నాయని స్విస్ ప్రెసిడెంట్ చెప్పుకొచ్చారు. రవాణా, లాజిస్టిక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో స్విస్ కంపెనీలు ఇప్పటికే భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టాయని వెల్లడించారు. మరోవైపు భారత్- స్విట్జర్లాండ్ స్నేహం శతాబ్దాల నాటిదని కొనియాడారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో ప్రధానమంత్రి మోదీ, స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్ సమావేశమై ద్వైపాక్షిక చర్చలు చేపట్టారు. కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పటిష్టం చేసేలా అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. రాబోయే 15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, పది లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు లక్ష్యంగా ప్రతిష్టాత్మక ఆర్థిక రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించారు. స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్‌తో ద్వైపాక్షిక చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. భారత్- స్విట్జర్లాండ్ స్నేహం శతాబ్దాల నాటిది. ఆవిష్కరణ, మౌలిక సదుపాయాలు, అధునాతన సాంకేతికత నేడు మన పునాదికి బలమైన స్తంభాలుగా ఉన్నాయి. నేటి శిఖరాగ్ర సమావేశంతో మన భాగస్వామ్యానికి కొత్త వేగాన్ని, కొత్త శిఖరాలను అందించబోతున్నాం. ఇది పెట్టుబడి, ఆవిష్కరణ, ఉద్యోగాలు, పరస్పర శ్రేయస్సు కోసం రూపొందించిన ఒక ప్రతిష్టాత్మక ప్రణాళిక. దీనితో రాబోయే 15 ఏళ్లలో భారతదేశంలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి, 10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలను సాధిస్తాం. స్విట్జర్లాండ్‌లో భారతదేశ ఎగుమతులకు మార్కెట్‌ను పెంచడానికి, రెండు దేశాల మధ్య పెట్టుబడులను మరింత సులభతరం చేయడానికి మేము అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నాం. దీనివల్ల స్విట్జర్లాండ్‌కు భారతదేశ వ్యవసాయ, ఫార్మా, వస్త్ర, ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతి పెరుగుతుంది. అదే సమయంలో బయోటెక్, లైఫ్ సైన్సెస్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి భారతదేశంలోని ముఖ్యమైన రంగాల్లోకి కొత్త స్విస్ పెట్టుబడులను ఆకర్షిస్తాం. ప్రజల మధ్య సంబంధాలే మన భాగస్వామ్యానికి అతిపెద్ద బలం. ఈ రోజు సంతకం చేసిన మైగ్రేషన్ అండ్ మొబిలిటీ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్, యంగ్ ప్రొఫెషనల్స్ అగ్రిమెంట్‌తో స్విట్జర్లాండ్‌లో భారతీయ విద్యార్థులు, పరిశోధకులకు అనేక కొత్త అవకాశాలు లభిస్తాయని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధమైన పాలన, సంప్రదింపులు, దౌత్యం పట్ల భారత్- స్విట్జర్లాండ్ ఒకే విధమైన నిబద్ధతను పంచుకుంటున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచ శాంతి, స్థిరత్వాన్ని పెంపొందించడానికి ఇరు దేశాలు తమ సహకారాన్ని కొనసాగిస్తాయని అభిప్రాయపడ్డారు. పెరుగుతున్న అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రపంచ సంస్థల్లో సంస్కరణలు అత్యంత కీలకమని ఇరు దేశాలు భావిస్తున్నాయని వ్యాఖ్యానించారు. "భారత్, స్విట్జర్లాండ్ రెండూ ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధమైన పాలన, సంప్రదింపులు, దౌత్యాన్ని విశ్వసిస్తాయి. ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం మేం కలిసి పనిచేస్తాం. ఉక్రెయిన్, పశ్చిమాసియా ఇలా ఎక్కడైనా శాంతి కోసం చేసే ప్రతి అర్థవంతమైన ప్రయత్నానికి భారతదేశం నిరంతరం మద్దతు ఇచ్చింది. పెరుగుతున్న ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి ప్రపంచ సంస్థల్లో సంస్కరణలు అవసరమనే విషయంలో కూడా మేమిద్దరం ఏకీభవిస్తున్నాం." అని ప్రధానమంత్రి మోదీ అన్నారు. భారత్, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ మధ్య చారిత్రాత్మక వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం అమలు తర్వాత ద్వైపాక్షిక సంబంధాల్లో వేగం పెరుగుతుందని ప్రధానమంత్రి మోదీ అన్నారు. ఈ క్రమంలోనే అధ్యక్షుడు గై పార్మెలిన్‌ను ప్రశంసించారు. "స్విట్జర్లాండ్ అధ్యక్షుడికి స్వాగతం పలకడం నాకు చాలా సంతోషంగా ఉంది. అన్నింటికంటే ముందు భారత్- స్విట్జర్లాండ్ సంబంధాల పట్ల ఆయన నిబద్ధతను నేను అభినందిస్తున్నాను. గత ఏడాది అక్టోబర్‌లో ఆయన వ్యక్తిగత మద్దతుతోనే మేము దేశాలతో చారిత్రాత్మక వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై సంతకం చేశాం. యూరోపియన్ ఆర్థిక కూటమితో భారతదేశం కుదుర్చుకున్న మొదటి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇదే." అని ప్రధాని మోదీ అన్నారు.

# దేశంలో మునుపటి శాంతి కనిపించడం లేదు

**బీజేపీ పాలనలో ప్రజలకు భద్రత కరువు**

**బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ సంచలన వ్యాఖ్యలు**

**సంజయ్ దత్ వ్యాఖ్యలపై రాజకీయ దుమారం**

**సంజయ్ వ్యాఖ్యలకు మద్దతు తెలిపిన కాంగ్రెస్**

**సరదాగా చేసిన వ్యాఖ్యలని సంజయ్ దత్ వివరణ**

న్యూఢిల్లీ, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి):

బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెను దుమారాన్ని రేపాయి. దేశంలో మునుపటిలా శాంతియుత వాతావరణం కనిపించడం లేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచింది. బీజేపీ ప్రభుత్వాల హయాంలో ప్రజలకు భద్రత కరవైందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. అయితే, తన వ్యాఖ్యలు కేవలం సరదా సంభాషణలో భాగమని సంజయ్ దత్ తర్వాత వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ నేత నానా పటోలే మాట్లాడుతూ, సంజయ్ దత్ "నికార్సయిన నిజం" పలికారన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో పట్టపగలే హత్యలు జరుగుతున్నాయని, ప్రజలు అభద్రతాభావంతో ఉన్నారని ఆరోపించారు. ప్రజల ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని ఆయన సూచించారు. మరో కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ కూడా సంజయ్ దత్‌కు మద్దతిచ్చారు. ఒత్తిడి కారణంగానే ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారని, ఆయన మాటలు హృదయాంతరాల నుంచి వచ్చాయని అన్నారు. అయితే, శివసేన (యూబీటీ) అధికార ప్రతినిధి ఆనంద్ దూబే భిన్నంగా స్పందించారు. సంజయ్ దత్ వ్యాఖ్యలను ఆయన మాట్లాడిన సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవాలన్నారు. దేశం శాంతియుతంగానే ఉందని, ఉజ్వల భవిష్యత్తు వైపు సాగుతోందని తెలిపారు. "ఇక్కడ ఏదైనా తప్పుగా అనిపించిన వారు, వేరే చోటికి వెళ్లిపోవచ్చు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వివాదంపై సంజయ్ దత్ ఆదివారం స్పష్టత ఇచ్చారు. శేఖర్ సుమన్ టాక్ షోలో తాను చేసిన వ్యాఖ్యలు సరదా సంభాషణలో భాగమని, ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'గాంధీగిరి' స్ఫూర్తితో ప్రేమ, ఐక్యతను ప్రోత్సహించే ఉద్దేశంతోనే ఆ వ్యాఖ్యలు చేసినట్లు వివరించారు. గాంధీ జయంతి సందర్భంగా జరిగిన ఈ షోలో, "దేశంలో మునుపటి శాంతి కనిపించడం లేదు. ఆ మంచి రోజులు మళ్లీ రావాలని శివుడిని ప్రార్థిస్తున్నా" అని సంజయ్ దత్ వ్యాఖ్యానించారు.

# వణికిస్తున్న అనుమానాస్పద వైరస్

మొదటిపేజీ తరువాయి..

మీడియాతో మాట్లాడుతూ, ఆగ్నేయ సైబీరియాలో వెలుగుచూసిన ఈ ఇన్‌ఫెక్షన్ వ్యాధి గురించి తమకు సమాచారం ఉందని అన్నారు. ఈ పరిస్థితిని అమెరికా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రాల(సీడీసీ)తో పాటు ఇతర సంస్థలు నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ మాజీ అధికారి డాన్ హాఫ్‌మెన్ మాట్లాడుతూ, ఈ ఘటనకు సంబంధించిన సమాచారాన్ని అమెరికా గూఢచార యంత్రాంగం సేకరిస్తున్నట్లు తెలిపారు. సైబీరియాలోని యాంటీ-ప్లేగ్ పరిశోధన కేంద్రంలో ఇటీవల ఓ ప్రమాదం జరిగినట్లు సీఎన్ఎస్ వార్త సంస్థ నివేదించింది. ఆ తర్వాత అక్కడ పనిచేసిన ఒక ల్యాబరేటరీ టెక్నీషియన్ తెలియని ఇన్‌ఫెక్షన్‌తో మరణించారు. ఇర్కుట్స్క్ సమీపంలోని షెలెఖోవ్‌లో ఉన్న యాంటీ-ప్లేగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ ఘటన జరిగిందని రష్యా ప్రభుత్వ వార్త సంస్థ టాస్ పేర్కొంది. మరోవైపు అంటువ్యాధుల పర్యవేక్షణ సంస్థ రోస్పోట్రెబ్నాడ్జోర్ దీనిపై కీలక విషయాలు వెల్లడించింది. సదరు ఉద్యోగి మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పేర్కొంది. అతనికి న్యుమోనియా లాంటి లక్షణాలు మాత్రం కనిపించాయని, అయితే ఆ వ్యాధి లేదా ఇన్‌ఫెక్షన్ ఏమిటో ఇంకా నిర్ధరణ చేయాల్సి ఉందని పేర్కొంది. ఇర్కుట్స్క్ , షెలెఖోవ్ నగరాల్లో పారిశుద్ధ్యం లేక అంటువ్యాధులు బాగా ప్రబలుతున్నాయని రోస్పోట్రెబ్నాడ్జోర్ పేర్కొంది. ఏది ఏమైనప్పటికీ, ల్యాబ్ ఉద్యోగి మృతి కేసులో తాము ప్రత్యేక ప్రోటోకాల్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపింది. అయితే న్యూమోనిక్ ప్లేగ్ సంభవించి ఉండవచ్చనే ఆందోళనలు చెలరేగాయి. మరణించిన ల్యాబ్ టెక్నీషియన్ ఒక 28 ఏళ్ల మహిళ అని, ఆమె బహుశా ప్లేగ్ వ్యాధితో మరణించి ఉంటుందని బురియాటియా రిపబ్లిక్ నాయకుడు అలెక్సీ సిడెనోవ్ పేర్కొన్నారు. ప్లేగ్ వ్యాధి వ్యాపిస్తోందని వార్తల నేపథ్యంలో, ప్రధాన వైద్యాధికారులతో స్థానిక అంటువ్యాధుల నివారణ మండలి అత్యవసర సమావేశం నిర్వహించింది. ఆ తర్వాత ఇర్కుట్స్క్ గవర్నర్ ఇగోర్ కోబ్జెవ్ మాట్లాడుతూ, ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రశాంతంగా ఉండాలని కోరారు. షెలెఖోవ్ పరిసర ప్రాంతాల్లో అదనపు భద్రతా చర్యలు ఏర్పాటు చేశామని చెప్పారు. మరోవైపు ఇన్‌ఫెక్షన్ ప్రబలిన పరిశోధన కేంద్రానికి సమీపంలో ఉన్న అల్యూమినియం కర్మాగారం తమ సిబ్బందిని ముఖానికి మాస్కులు ధరించాలని ఆదేశించింది. సదరు కర్మాగారం అధిపతి ఆర్టెమ్ ఫోమినిఖ్ మాట్లాడుతూ, ఈ ఇన్‌ఫెక్షన్ వ్యాప్తిపై దేశంలో ఊహాగానాలు, రూమర్లు, పరస్పర విరుద్ధంగా ఉన్న నివేదికలు ప్రచారంలో ఉన్నాయని అన్నారు. ప్రజలు వాటిని నమ్మవద్దని, ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాదు మరణించిన ల్యాబ్ టెక్నీషియన్‌తో సన్నిహితంగా ఉన్న వారందరినీ వైద్యుల పర్యవేక్షణలో ఉంచారని, ప్రస్తుతం వారిలో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించలేదని ఆయన అన్నారు.

# ప్రయాణికుల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం..

హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి)

మహిళలు, ప్రయాణికుల భద్రతకు మరింత భరోసా కల్పించే లక్ష్యంతో రూపొందించిన 'అభయ—మై ట్యాక్సీ సేఫ్' యాప్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆటోలు, క్యాబ్‌లకు సంబంధించిన 'అభయ—మై ట్యాక్సీ సేఫ్' స్టిక్కర్లను ఆవిష్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఆటో, క్యాబ్ డ్రైవర్ తప్పనిసరిగా ఈ స్టిక్కర్‌ను వాహనంపై ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్టిక్కర్‌ను చూడగానే ప్రయాణికుల్లో భద్రతపై నమ్మకం కలుగుతుందని తెలిపారు. ఆటో, క్యాబ్ యజమానులు తమ వాహన







వివరాలను యాప్‌లో నమోదు చేసుకుని, సమీప ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి స్టిక్కర్లు పొందాలని సూచించారు. డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు. ప్రయాణికుల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, అదే సమయంలో ప్రతి పౌరుడి బాధ్యత కూడా అని పేర్కొన్నారు. మహిళలు, ఇతర ప్రయాణికులు 'అభయ—మై ట్యాక్సీ సేఫ్' యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ట్యాక్సీ డ్రైవర్లకు యాప్ వినియోగం, ప్రయాణికుల భద్రతపై అవగాహన కల్పించారు. పోలీస్ కళాబృందం నాటక ప్రదర్శన ద్వారా ట్రాఫిక్ భద్రతపై అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) రాయల ప్రభాకర్‌రావు, ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సుజాత, వెంకన్న, ట్రాఫిక్ సిబ్బంది, ట్యాక్సీ డ్రైవర్లు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.


Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967